


గర్భాదాన మంత్రాల్లో అర్థాలు!
పునర్జన్మ వున్నది?
నిప్పులో మీదా నడవొచ్చు!
మార్చినెల వెరయిటి సంచికలో
ఏసుక్రీస్తుకు పెళ్ళయిందట!
అంతరిక్షంలో తెల్లరంధ్రాలు!
ఆడవాళ్ళు ఎందుకు సాధిస్తారు?
రష్యా కమ్యూనిస్టువ్యవస్థను కుదిపివేసిన నోబుల్ బహుమతి నవల!
డాక్టర్ ఝివాగో
మరో సంక్షిప్తనవల
మీవారు పనిపోతు అయితే!
కూతురుకు కోటనిర్మించిన తండ్రి!
జార్జి బెర్నార్డ్ షా రచన:
సౌందర్య దేవత
VARIETY IV-0-A1, Lal Bahadur
500 001



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు

దేశోద్ధారక కాశీనాధుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938 – 1972]

శుక్రవారం : 19-3-'82

దుర్మతినామ సం. ఫాల్గుణ బ. నవమి

సంపుటము 75 : సంచిక 28

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

*


విడిప్రతి వెల రు. 1-25 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

పోతన పంచశత జయంతి



జన్మం - కాలం

ఆంధ్ర మహా భాగవత కర్త పోతనార్యుడు, ఓరుగల్లు మండలంలో, జనగామ తాలూకాలోని బమ్మెర గ్రామస్థుడు; 'పోతరాజు గద్దె' అనే పేరుతో నాలుగు రాళ్ళు పాతిన స్థలమూ, ఎదురుగా శిథిల రామాలయమూ, చిహ్నాలుగా మిగిలిపోయినై. నియోగి బ్రాహ్మణ వంశంలో, కౌండిన్యస గోత్రంలో, స్మార్త శైవ కుటుంబంలో, లక్కమాంబా కేసనలకు పోతనగారు జన్మించారు.

రసార్ణవ సుధాకర కర్తయైన సర్వజ్ఞ సింగభూపాలుని కంటె భిన్నుడై, ముమ్మడి సింగభూపాలుడనే వ్యవహార నామం కల, సర్వజ్ఞ సింగమనీడు, క్రీ. శ, 1430 నుండి 1475 వరకూ రాచకొండలో రాజ్యం చేశాడు. అతడు ప్రౌఢదేవరాయలకూ, కోమటి వేమారెడ్డికీ సమకాలీనుడు. ఆ సింగమనీని భోగినిపై దండకం రచించి, చిన్నతనంలో పోతనగారు అతడికి కృతి యిచ్చి అతని కోర్కెను తీర్చాడు. కనుక ఇతని కాలమూ, శ్రీనాథుని కాలము ఒకటిగానే భావించవచ్చు; సుమారుగా, 15వ శతాబ్దంగా. పోతనగారూ శ్రీనాథుడూ బావమరదులు కాకపోవచ్చు. శ్రీనాథుని బావమరది దగ్గుపల్లి దుగ్గన్న; అతని అన్న పోతన్న. కనుక కొందరు భ్రాంతి పడే అవకాశం ఉన్నది బావమరదులని. వీరభద్ర విజయం, నారాయణ శతకం, పోతన కర్తృకాలనే భ్రాంతి కూడా దేశంలో ఉన్నది.

ఇమ్మనుజేశ్వరాధములు

రాజులకు కృతి ఇవ్వడానికి పోతన వ్యతిరేకి కాదు. మనుజేశ్వరాధములకీయడానికి వ్యతిరేకి. తానొక కృతినిచ్చి చూశాడు. నిరాదరణమూ, తిరస్కారమూ లభించింది; వెంటనే బమ్మెరలో హాలికుడై, భగవంతుణ్ణి నమ్ముకున్నాడు. భాగవత రచన ప్రారంభించి ముగించాడు. రచనా పరిమళం సింగమనీడు దాకా వ్యాపించింది. కృతినిమ్మన్నాడు పోతన నిరాకరించాడు. అతని నుద్దేశించే "ఇమ్మనుజేశ్వరాధములు" అనే పద్యం చెప్పాడు. కాని చెప్పడంలో, అధములైన రాజులను గూర్చి చెప్పినట్లుగా చెప్పాడు. రాజు కోపోద్దీపితుడయ్యాడు.

ఫలితంగా ఆ గ్రంథం భూస్థాపితమయింది. భూస్థాపితమైనట్లు సర్వలక్షణ సారసంగ్రహకర్త సాక్ష్యము. చుట్టూ కొంత కాలం పహరా ఉన్నది. అది జీర్ణమైనదనే నమ్మకం కలిగిన తర్వాత రాజభటులు వెళ్ళిపోయారు, లేదా, పోతన స్వర్గస్థులైన పిదప వెళ్ళిపోయారు. బంధువులా గ్రంథాన్ని త్రవ్వించి చూశారు. కొంత గ్రంథం లుప్తమయింది. ఉన్నంతవరకు తిరిగి ప్రతిని వ్రాయించారు.

పూరణాలు

బంధువుల బృందంతోపాటు, పోతన శిష్యుడు నారయ ఉన్నాడు. ఓరుగల్లుకు యాభై మైళ్ళ దూరంలో ఉన్న 'వెలిగందెల' గ్రామవాసి; విశిష్టాద్వైత మతానుయాయి. అద్వైతియైన పోతన, శ్రీధరీయ వ్యాఖ్య ఆధారంగా గ్రంథ రచనం చేసినవారు. నారయ దశమస్కంధాంత గద్య పోతన పేరుతోనే వ్రాశాడు. ద్వితీయ, తృతీయ స్కంధాలలోని కొన్ని పద్యాలూ, దశమస్కంధోత్తర భాగం, ఏకాదశ ద్వాదశ స్కంధాలూ పూరించాడు. అయితే మత భేదం వల్ల కొన్ని వైరుధ్యాలు కన్పిస్తవి.

బొప్పనామాత్య పుత్త్రుడు గంగన, పంచమ స్కంధంలో చాలా భాగం పూరించాడు. ఓరుగల్లు సమీపంలోని ఏర్చూరివాసి, సింగన షష్ఠ స్కంధాన్ని పూరించి, పోతన శ్రీరామ చంద్రుని కంకితం చేస్తే, ఇతడు విష్ణువు కంకితంచేశాడు. స్వప్న వృత్తాంతం వ్రాశాడు, పూర్వ కవులతోపాటు పోతన స్మరణ కూడా చేశాడు. ఈ స్కంధాన్నే జంట కవులు (నంది మల్లన-ఘంటసింగయ) సర్వాన కూడా రచించారు కాని అవి దొరకడంలేదు. ఖమ్మం నివాసి హరిభట్టు షష్ఠ స్కంధం రచించడమే కాకుండా, ఏకాదశ, ద్వాదశ స్కంధాలు కూడా అద్వైతపరంగా రచించాడు కాని యది యీ భాగవతంలో చేరక ప్రత్యేక గ్రంథ మయింది. మొత్తంమీద ఒక సారస్వత కషాయమైన నేటి భాగవతంలో, పోతరాజు

కవితా మాధుర్యాన్ని; ఇతరులు వేలు పెట్టని భాగంలోనే దర్శించాలి.

మందార మకరంద మాధుర్యాలు

పోతనగారి రుక్మిణీ కల్యాణం, ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం, వామనావతార ఘట్టాలు మందార మకరంద మాధుర్యాలు. కొన్ని కథలు మూలమున కంటె పెంచి, రసమయము చేసిన సందర్భాలు ఉన్నై. సంస్కృత సమాసం చేసినా తెలుగువలె సుబోధంగా ఉంటూ సుందరమై దివ్యానుభూతిని కల్గిస్తుంది. జాతీయములు కోకొల్లలై, మార్గకావ్యమైనను దేశిపద్ధతికి సన్నిహితంగా ఉంటుంది. పల్లెల్లో చల్ల చిలికేటప్పుడు స్త్రీలు గానం చేయడం, అతని శైలీ సౌలభ్యానికి దృష్టాంతం. గోపికా వ్యేషణం మొదలైన మాధురులు క్రుమ్మరిస్తూ బహుళ ప్రచారంలో ఉన్నవి. "నమ్మితి నా మనంబున, నీ పాదకమల సేవయు, కమలాక్షు నర్చించు, కారే రాజులు, లా వొక్కింతయులేదు" మొదలైన పద్యాలు ప్రతి పల్లెలోనూ విన్పిస్తూనే ఉంటాయి. సామాన్య ప్రజల దగ్గఱకు పద్యం వెళ్ళడానికి వీలుగా, ఛందస్సును జాగ్రత్తగా ఉపయోగించుకున్న కవి పోతన. క్లిష్టమైన వేదాంత విషయాన్ని సులభంగా చెప్పగల దొడ్డ ప్రజ్ఞ ఇతనికున్నది.

పారాయణ గ్రంథం

వివాహం కావలసిన వారు రుక్మిణీ కల్యాణాన్ని, ఆర్తి పొందిన వారు గజేంద్ర మోక్షణాన్ని, శత్రుమర్దనం కావలసినవారు ప్రహ్లాద చరిత్రను– ఇంకా కొందఱు నారాయణ కవచాన్ని పారాయణం చేస్తారు. పోతన తపశ్శాలి. అతని వాక్కులో మంత్ర శక్తి భాసిస్తుంది.

భగవన్నుతి చేసే కావ్యం ఉత్కృష్టమైనదనీ, విచిత్రార్థాన్వితమైనా తద్విరహితమైన కావ్యం పనికిమాలినదనీ పోతన అభిప్రాయం. మహేశ్వర ధ్యానం చేస్తూ వుంటే శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చి గ్రంథ రచన కావింపుమన్నాడు. త్యాగరాజుల వారికి కూడా భాగవతం పారాయణ గ్రంథమే. వారు సొంత దస్తూరీతో గ్రంథాన్ని వ్రాసుకొన్నారట.

ఆ మహనీయుని పంచ శత జయంతి ఆంధ్రుల కొఱకు పెద్ద పండుగ.

– పైడిపాటి సుబ్బరామశాస్త్రి

పోతన్న పద్యాలు

దైవము మానుషాకృతిని దాల్చి జగద్ధిత భక్తి నిల్పఁగా
భావమునం దలంచి పరమభాగవతంబును దెల్గుబాసలో
ఠీవి ననన్యసాధ్యమగు తేఁపరచింపఁగఁజేసి లోకసం
భావన మీఱి దావఱలు బమ్మెర పోతన యెంతు సత్కవిన్.

– కీ. శే. నందిరాజు చలపతిరావుగారు

పేదరికంబు కాపురము; పెద్దది దేహియనంగ వాక్కుయున్
రాదు మనంబు స్థైర్యమున గ్రాలక గ్రంథము వ్రాయ శక్యముం
గాదు, గురుండు లేడు, బహు ఘట్టములన్ నిగమాంత విద్యయె
ట్లీదితివయ్య పోతన కవీశ్వర భాగవతాబ్ధి వీధులన్.

– శ్రీ మిన్నికంటి గురునాథశర్మగారు

పులకింపఁగ జడ దేహము
బలికింపఁగ నంతరాత్మ భాషామృతమున్
చిలికించి భక్తి బీజము
ఇలికించెను పోతరాజా యాంధ్ర నలందా!

– శ్రీ విడుదవోలు వేంకటరావుగారు

ఆరయఁ బంచదార చవులద్దిన ముద్దు పదాల తేనియల్
గాలు మనోజ్ఞ భావములు గల్గిన పాకపు పాల మీఁగడల్
చేరలఁ బంచు భక్తిరస సింధువు పోతన కైత యన్న నో
రూరదె ధాతకేని జవి యొగ్గక తప్పనె వాని తాతకేన్.

– శ్రీ వానమామలై వరదాచార్యులుగారు

భాగవతంబు నా బాలశిక్ష–

– జాషువా



"రచయితలంతా పరాకుగా వుంటారా? లేక పరాకు వున్నవాళ్లే రచయిత లవుతారా?" పరమహంసను చూసిన వాళ్లకు ఆ అనుమానం కలుగుతుంది.

రచయితగా దేశంలో ఎంత పేరు ప్రఖ్యాత లున్నాయో పరమహంసకు అంత పరాకు వుంది. అతని పరాకు చేష్టలు కాలేజీలో తోటి లెక్చరర్లకు, విద్యార్థులకు సరదాగా మాట్లాడుకొనే టాపిక్స్. కానీ యింట్లో అతని భార్యకు అవి పరీక్షా సమయాలు! చిరాకు కారణాలు!

చిత్రమేమంటే పరమహంస తనకు పరాకన్న విషయాన్ని చస్తే అంగీకరించడు. 'కాంపెన్సేషన్ అది. నాకు ఆలోచించే విషయంపైన ఏకాగ్రత జాస్తి. అప్పుడు ఎవరేం చెప్పినా గుర్తుండవు. ఆలోచించే విషయం తప్ప మరో అంశం గుర్తుండదు. ఏకాగ్రతకు, పరాకుకు భేదం తెల్సుకోకపోతే ఎలా?'

'నీకు పరాకన్న విషయాన్ని పరాకులో మర్చిపోయి వుంటావులే.'

పరమహంస, చెవులు పగిలిపోయేలా ఎలక్ట్రిక్ బెల్లు మోగినా విన్పించుకోకుండా క్లాసు చెప్తాడు కాని, క్లాసులో పాఠం చెప్పటానికి పుస్తకాలు చూడడు. విద్యార్థి ఎవరన్నా బెల్ అయిందని గుర్తుచేస్తే పాఠం ఆపి 'ఇది ఎన్నో పిరియడ్?' అని అడుగుతాడు. కానీ బెల్ కొట్టగానే క్లాసుకు వెళ్లటం ఎప్పుడూ మర్చిపోడు.

ఇంట్లోను అంతే. ఎప్పుడూ రాస్తూనో, చదువుతూనో వుంటాడు. ఎవరన్నా ఆహ్వానించి తీసుకెళ్తేనేగాని ఎక్కడికీ వెళ్లడు. కాలేజీ... యిల్లు... వొట్టి 'యింటి పక్షి.'

రాస్తుంటే సింహాసనంలాంటి ఆ కుర్చీ, చదువుతున్నప్పుడు ఫేను క్రింద పడకకుర్చీ... లేకపోతే పట్టెమంచం అతని స్థావరాలు. రాస్తున్నా, చదువుతున్నా ఫేను తిరుగుతుండాల్సిందే. రేడియోలో ఏదోపాట మోగుతుండాల్సిందే. ఏది ఆగినా మూడ్ పోతుంది. మామూలు మనిషవుతాడు. వంటింట్లో భార్య దగ్గరి కెళ్తాడు.

'ఇవాళ ఏం కూర చేస్తున్నావ్?'

'అదేమిటండీ. కాకరకాయ వేపుడు చేయమని పొద్దున మీరేగా చెప్పేరు?'

'ఓహో... చెప్పేనుకదూ? అవున్లే...'

పరమహంస రాసుకొనే కుర్చీ సింహద్వారం దగ్గరే వుంటుంది. ఇంట్లోకి ఎవరు వెళ్ళినా అతని ముందు నుంచే వెళ్లాలి.

'ఏమండీ. కుక్క వచ్చి అన్నం తిని పోయిందండీ. చూస్తుంటానన్నారుగా?'

'చూస్తూనే వున్నాగా?'

పరమహంస చూస్తూనే వుంటాడు. కాని దొంగలుపడి దోచుకుపోయినా పట్టించుకోలేనంత పరాకులో వుంటాడా సమయంలో. అందుకని పరమహంస భార్య అతనికి ఒక్క పని చెప్పదు. ఇంటి పనులు, బయటి పనులు అన్నీ తనే చేసుకొంటుంటుంది.

వ్రాత, చదువు లేనప్పుడు పరమహంస భార్యా పిల్లలతో సర్దాగా కాలక్షేపం చేస్తాడు. కుటుంబ సభ్యులతో అనుబంధం జాస్తి. పిల్లలంటే అతనికి మరీ ప్రాణం! ఇల్లువదిలి పరాయి వూళ్ళో వారం రోజులు వుండటం గగనమే! అసలు ప్రయాణాలంటేనే పరమహంసకు భయం.


"పరమహంస పెద్ద రచయిత అని పేరే కాని ఒక్క సరదాలేదు. ఎప్పుడూ ఇల్లూ... పుస్తకాలూ... భార్యాపిల్లలూ... రచయిత యింత నేరో ప్రపంచంలో వుంటే ఎలా? పైగా పెద్ద ప్రపంచాన్నంతా చూసినట్టు... రకరకాల మనుష్యుల మనస్తత్వాలను స్వయంగా సృష్టి చేసినట్టు రచనలు! ఫోజు. హిపోక్రసీ..."

నిజమే. యింత లిమిటెడ్ వరల్డ్లో

వేలాది కుటుంబాలు అనాదిగా వాడబడుతున్న
లవంగనూనె ప్రభావాలన్నింటినీ ప్రామిస్‌లో మళ్ళీచూసారు.

లవంగనూనెతో కూడిన సాటిలేని టూత్‌పేస్ట్ ప్రామిస్

మీరూ ఎందుకు వాడి చూడకూడదు మరి!



ప్రామిస్
దంతక్షయంనుండి రక్షణకు
తోడ్పడుతుంది. నోటినితాజాగా
రూపొందించి
దుర్వాసనను అరికడుతుంది.

బల్సారా ఉత్పాదన

ఆరోగ్యంచిందే పళ్ళు,
చిగుళ్ళు, తాజాశ్వాస–
అదే మరి ప్రామిస్ వాగ్దానం.

CHAITRA-BLS-453 TEL.

ప రా కు

ప్రతుకు వెళ్ళబోనూ సర్వజ్ఞుడిలా తను యిన్ని రచనలు ఎలా చేయగలుగుతున్నాడు? పరమహంసే ఆశ్చర్యపోతుంటాడు!

అలాంటి పరమహంస కుటుంబసమేతంగా నో బంధువుల యింట్లో పెళ్ళికి వెళ్ళవల్సి రావడంతో అసలు కథ ఆరంభమయింది!

* * *

పెళ్ళికొడుకు పరమహంస భార్యకు స్వయంగా మేనమామ కొడుకు. వాళింటికి చాలాసార్లు వచ్చాడు. ప ర మ హం స తో మాట్లాడేడు కూడా.

'మా ప్రభు గాడికి పె ళ్ళి ట ం డీ. శుభలేఖతోపాటు వుత్తరమూ రాసేడు' అంది పరమహంస భార్య కమల పోస్ట్‌లో వచ్చిన వుత్తరాల బొత్తిలో ఆ వుత్తరం తెచ్చి చదివి...

'పత్రికల వాళ్ళెవరి వ ద్ద ను ం చీ వుత్తరాలేం రాలేదూ? పది కథలు వివిధ పత్రికల్లో పెండింగ్ వున్నాయి గదా?'

కమల ఆనందం భర్త ప్రశ్నతో చప్పగా చల్లారిపోయింది. చిరాకొచ్చింది.

''మీ కథలు, పత్రికలు — ఎప్పుడూ అదే కలవరింతా? మా ప్రభు పెళ్ళిటండీ?'

'ప్రభు! ఎవడు?' అన్నాడు వుత్తరాల బొత్తిని పరిశీలిస్తూ తాపీగా పరమహంస.

'ఖర్మ! మా మేనమామ కొడుకండీ. హైదరాబాద్‌లో పని చేస్తున్నాడు కదా?'

'ఓహో! అతనా? గుర్తుకొచ్చాడులే!... 'వంశాంకురం' కథ స్వీకరించబడిందోయ్'

'మిమ్మల్ని రమ్మని రాసేడు. అసలు వుత్తరం మీకే రాసేడు. చూడండి.'

'అలాగే వెళ్దాం. సాయంకాలానిగ్గా?' నో సాహిత్య సంస్థ నుంచి వచ్చిన వుత్తరాన్ని చూస్తూ అన్నాడు.

'సాయంకాలం ఏమిటండీ? సినిమా కెళ్ళటం అనుకొన్నారా? పెళ్ళి ఇంకా పదిరోజు లుంది. మనకు దగ్గరే - పెళ్ళికూతురు వాళ్ళ వూరు. వాళ్ళు అక్కడనుంచి తరలివచ్చేరోజు, బండి, రాసేడు మామయ్య. ఆ రోజుకి మనం పెళ్ళిపార్టీతో కలిస్తే సరి! అందరం కల్సి...'

'నీకు అసలు బుద్ధిలేదు కమలం. పెళ్ళికి పోకుండా పార్టీకి పోతే ఏం బాగుంటుంది? అందులోనూ మీ బాబాయ్ కూతురు పెళ్ళం టున్నావ్?'

కాలగతి!

అసహ్యమైన గొంగళి పురుగువని
అపహాస్యము చేసేవు నాడు
రంగు రంగుల సీతాకోక చిలుకగా
మారాను చూడు
వంపుసొంపుల్ని వయసు సొగసుల్ని
చూసుకొని మురిసిపోతున్నావు నేడు
ముడతలు పడే వృద్ధాప్యం
ముంచుకురాక మానదు ఏదో ఒకనాడు!

— రాణీమాలిని

పోస్ట్‌లో వచ్చిన వుత్తరాల మూడ్‌లో వున్న భర్తతో మాట్లాడటం తనది బుద్ధి తక్కువ అని అప్పటికి గ్రహించింది కమల!

తీరా పెళ్ళి పార్టీతో కలవటానికి పక్క వూరికి బయలు దేరాల్సిన రోజుకి పరమహంస రాస్తున్న నవల పూర్తికాలేదు. చివరి దశలో వుంది. ఆ దశలో బ్రేక్ పడితే మరేమన్నా వుందా?

'పెళ్ళి ఎల్లుండి కదా? నేను రేపు సాయంకాలం బయల్దేరి వస్తాలే కమలా — ప్లీజ్...'

కమల చిన్నబుచ్చుకొంది. భయపడింది. 'వొక్కడినీ వదిలేసి వెళ్తే యిల్లు దొంగలకి అప్పచెప్పేసినట్లే? పైగా పెళ్ళి సంగతి మర్చిపోడూ?'

'మమ్మీ, స్కూల్లో రేపు డిబేట్. ప్రైజు నాదే. నేను నీతో రాను. రేపు నాన్నతో వస్తా' ఏడో క్లాసు చదివే చిన్నవాడు లిటిగేషన్ పెట్టాడు.

'మా హెడ్ మిస్ట్రెస్ వొక్కరోజు కన్నా తక్కువ లీవ్ యివ్వనంది. మా స్కూలు స్ట్రిక్టు. శెలవు పెట్టకుండా వెళ్తే పేరు కొట్టేస్తారు. నేనూ డాడీతోనే వస్తా' అప్పర్ కేజీ చదివే అనుపమ ప్రాబ్లం అది.

పిల్లలిద్దరూ రానంటంతో కమల చిన్నబడింది.

'మనం వెళ్దాం మమ్మీ. మామయ్యకు వుత్తరం రాసేంగదా? నాన్నగారు, చెల్లి, తమ్ముడు రాకపోతేనేం? మనకు భయమా?' పెద్దపిల్ల కోపంగా అంది.

చివరికి కమల పెద్ద పిల్లతో అనుకొన్న విధంగా ఆరోజు వెళ్లేటట్లు, పరమహంస పిల్లలిద్దరినీ తీసుకొని మర్నాడు నేరుగా పెళ్ళి జరిగే వూరికి వచ్చేటట్లు నిర్ణయం జరిగింది.

'ఒరేయ్ సాంబూ...అనూపా...నాన్నగారు పెళ్ళి సంగతి మర్చిపోతారు. మీరూ మర్చిపోకండేం? తప్పకుండా బయల్దేరి రండి— నాన్న బద్ధకిస్తే బలవంతం చేసి తీసుకు రావాలి. తెల్సిందా?'

యిలా ఎన్నో జాగ్రత్తలు పిల్లలకి, భర్తకి కూడా చెప్పాక కమల పెళ్ళికి బయల్దేరి వెళ్ళింది.

* * *

ఆ రోజు కాలేజీకి శెలవు పెట్టి దీక్షగా కూర్చొని నవల పూర్తిచేసి పోస్టు చేసేడు పరమహంస. పోస్ట్ చేసి యింటి కొస్తుంటే మరో నవలకు యితివృత్తం దొరికింది. అది తాస్తా బుర్రలోకి దూరి గజిబిజిగా గందరగోళం చేయసాగింది.

''అవునూ సాంబూ. మీ అమ్మ ఏదీ? ఎక్కడికెళ్ళింది? కాఫీ యివ్వమని చెప్పు' అంటూ ఫేను క్రింద పడక్కుర్చీలో కూర్చొని కళ్ళు మూసుకొన్నాడు పరమహంస.

సాంబు డిబేట్‌లో ఫస్ట్ వచ్చిన హుషారుతో వున్నాడు.

'ఏమిటి డాడీ నీ నవలకు? నీ నవలకు నీవటానికి నా దగ్గర వో మందు వుంది. చెప్పేను నా వైపు చూడు. నేను చెప్పేది విను' అంటూ డిబేట్‌లో మాట్లాడి వచ్చిన దాన్ని వో పదినిముషాలు ఆనర్గళంగా ఆటోమేటిక్ రైఫిల్ పేల్చినట్లుగా మాట్లాడేడు.

ఆ దెబ్బతో పరమహంస 'మూడ్' పోయింది. నవల యితివృత్తం మనసు పొరల్లో దాక్కుంది.


అనుపమ వచ్చాక ముగ్గురూ వూరికి బయల్దేరేరు. రైలుస్టేషన్‌కువెళ్లి టిక్కెట్లు తీసుకొని రైలు ఎక్కేరు. అప్పుడు సాంబూకు గుర్తుకొచ్చింది అసలు విషయం—

'నాన్నా! అమ్మ శుభలేఖ దాచిపెట్టివెళ్ళిన బేగ్ ఏది?'

'మంగలి పొదిలా అదెందుకురా ప్రతి చోటికి? కావాలనే యింట్లో వదిలేసివచ్చా—'

'మరి మనం ఏ వూరు వెళ్ళాలో నాకు గుర్తులేదు, నీకు గుర్తుందా?''

'టిక్కెట్లు తీసుకొన్నాంకదురా. ఏమిటా



కెంగారు ? నీకు చిన్నతనంలోనే మతి పోతోందే !'

'అది రైలుస్టేషన్ నాన్నా. అక్కడినుంచి మనం పెళ్ళికూతురు వాళ్ళ వూరికి బస్సెక్కి వెళ్ళాలి కదా ? ఆ వూరు పేరు తెల్సా ? ఆ వివరాలున్న శుభలేఖ ఆ సంచిలో వుంది.'

పరమహంసకు గుండె పగిలింది. రైలు కదిలింది !

* * *

రైల్లో ప్రయాణం చేస్తున్నంతసేపు ముగ్గురూ కల్సికట్టుగా, విడివిడిగా ఆలోచించగా ఆలోచించగా తాము పెళ్ళికి వెళ్ళాల్సిన వూరుకు 'క్లూ'లు చిక్కేయి. అందులో ముఖ్యమైనది ఆ వూళ్ళో వో ప్రఖ్యాతిచెందిన గుడి వుంది. పక్కనే కొండ వుంది. ఏది కూడా ఏదో చిన్నది వుంది.

'మీకు పాతగుళ్ళంటే ప్రాణం కదండీ. ఆ వూళ్ళో వో పాతగుడి వుందిట. శిల్ప సౌందర్యంతో వుంటుందట. పైగా మీకు మంచి మూడ్ రావటానికి అక్కడ వో చక్కటి కొండ, చిన్న నదికూడా వున్నాయట ! యింకేం ? నాలుగు నవలలకు, పది కథలకు థీములు ఆలోచించుకోవచ్చు మీరు పెళ్ళికొచ్చి' కమల వివ్వడో విగతాళిగా భర్తతో అన్న మాటలే ఆ క్లూకు ఆధారం.

రైలు దిగాక పరమహంసకు మరో బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది.

'ఒరేయ్ సాంబూ, పెళ్ళికి మనలాగే అటో యిటో వాళ్ళు చాలామంది వస్తుండ వచ్చుగా, యీ ప్రయాణీకుల్లో. అలాంటి వాళ్ళెవరయినా వున్నారేమో పరిశీలించు. అదుగో ... ఆ గుంపుగా పోయే జనాన్ని ఎక్కడికెళుతున్నారో అడిగిరా. వెళ్ళు. వాళ్ళు మనంవెళ్ళే పెళ్ళికే అని నా సిక్స్త్ సెన్స్ చెప్తోంది.

సాంబు పరుగెత్తుకుంటూ ఆ గుంపు దగ్గరికెళ్ళి విషయాలు సేకరించి వచ్చాడు.

'ఆ గుంపు వెళ్ళేది పెళ్ళికే. వాళ్ళు వెళ్ళే వూర్లో దేవాలయం వుంది, కొండ వుంది, చిన్న పిల్ల ఏరు కూడా వుంది. కాని వాళ్ళు వెళుతున్నది ఏవరింట్లోనో పెళ్ళికి కాదు; మగ పెళ్ళివాళ్ళు వీళ్ళే !'

'పోనీ ఆ వూరు పేరు కనుక్కోక పోయావా ?'

'కనుక్కొన్నాగా ! ఆ వూరు పేరు తిప్పరాజుపల్లె.'

పరాకు

'ఆ...అదే అదే... పల్లె... శుభలేఖలో ఆ పేరే చదివినట్టు గుర్తు !'

తీరా బస్సు డిపోకి వెళ్ళి విచారిస్తే తిప్పరాజుపల్లె అనే వూరికి బస్సులే లేవు. ఆ వూరు అక్కడికి రెండుమైళ్ళ దూరంలో వుంది.

'ఆ వూరికి బస్సుంది నాన్నా. ఆ వూరితోనే ఆగిపోతుంది కూడా. అమ్మ అనుకొంటుంటే విన్నాను. నాకుగుర్తొచ్చింది' అనుపమ మరో క్లూ యిచ్చింది.

'అవును, నాతోనూ అదే చెప్పింది. పాపం. మరీ మరీ చెప్పింది' అన్నాడు పరమహంస దీనంగా.

* * *

విచారించగా విచారించగా గుడి, కొండ, చిన్న ఏరు వుండి నేరుగా బస్సు వుండి 'పల్లె'తో అంతమయ్యే వూర్లు రెండు తేలేయి. ఆ సెంటర్‌కి అప్పరాజుపల్లె దక్షిణాన వుంటే, ముప్పరాజుపల్లె వుత్తరం వైపు వుంది. రెంటిలో ఏది ?

బొమ్మా బొరుసూ వేస్తే అప్పరాజుపల్లే వచ్చింది. సరిగ్గా ఆ సమయంలోనే అప్పరాజుపల్లె బస్సు వచ్చింది. బలశాలురకు, బుద్ధిశాలురకు మాత్రమే అందులో ప్రవేశం చిక్కింది. ఆ తర్వాత మరి రెండు గంటల క్కాని అప్పరాజుపల్లెకు బస్సు లేదు.

'పోనీ ముందు ముప్పరాజుపల్లెకు వెళ్ళి చూస్తేనో ?'

ముప్పరాజుపల్లె వెళ్ళాల్సిన బస్సు అర గంట క్రితం రావాల్సింది అప్పుడే తెల్సింది. ఆబస్సు చెడిపోయిందనీ, కనుక రాదని! మళ్ళా బస్సు రెండు గంటల తర్వాతే.

ఆలోచిస్తూ పిచ్చిలో రోడ్డుమీద విల బడ్డాడు పరమహంస. ఓ కారు వచ్చి అతని ముందు ఆగింది!

'హలో కవిగారూ? మీరు? యిక్కడ? ప్లెజెంట్ సర్‌ప్రైజ్ !'

అప్పరాజు, ముప్పరాజు పల్లెలకు వెళ్ళే బస్సులను గురించి కథ ఎలా రాయటమా? అని ఆలోచిస్తున్న పరమహంస ఆ మాటలు అన్న అతడిని వెంటనే గుర్తించలేదు.

'నేనండీ వామనరావును. గుర్తు పట్టలేదా?'

వామనరావు సినిమా ప్రొడ్యూసర్. రెండు హిట్లు, మూడు ఫ్లాప్‌లు, వొక యేవరేజ్ సినిమాలు ఆయన కాతాలో వున్నాయి కొన్ని సంవత్సరాల క్రితం వోసారి పరమహంసకు పరిచయం.

కారులో జనం అంతా క్రిందికి దిగేరు, తెరవెనుక జీవులు. అంచేత జనం మంచి ప్రమాదం లేకపోయింది. పరిచయాలయ్యాయి పిల్లల్తోసహా పరమహంసను కాఫీకని హోటల్లోకి లాక్కెళ్ళేరు.

'నా బస్సు...'

'వెధవబస్సు కారులో డ్రాప్ చేస్తాం సార్. ఎక్కడికెళ్ళాలో చెప్పండి.'

ఎలా చెప్పాలో తెలీక పరమహంస ఇబ్బంది పడుతుంటే సాంబు విషయమంతా చెప్పేడు.

'అయితే యింకేం? లొకేషన్ సెలక్షన్‌కు మేముముప్పరాజుపల్లెవెళుతున్నాం.మీరూరండి'

కాఫీలయ్యాక కారు దగ్గరికొచ్చారంతా. వామనరావు స్వయంగా చెక్‌డోర్ తెర్చి పరమహంసకు లోపలికి దారి చూపించాడు. అటు

జానపద కథల విశిష్టత

జానపద కథల్లో సంఘటనల ఔచిత్యాలను గురించి తర్కించే రోజులు పోయాయి. జానపద కథలు ప్రయోజనకరమనీ, బాలల మేధస్సుకు పదును పెట్టి వారిలో నిర్మాణాత్మకమైన మార్పులు తెచ్చి కార్య సాధకులుగా తీర్చి దిద్దగలవని పలు దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉదాహరణకు రాజుల కథలో, ప్రతి రాజ కుమారుడికి ఏదో ఒక సాహస కార్యం వుంటుంది. ఎన్ని అవరోధాలు, అవాంతరాలు వచ్చినప్పటికినీ, అనుకున్న దానిని సాధించి తీరుతాడు. చెప్పే విధానాలలో మార్పు ఉండవచ్చు. కానీ లక్ష్యం ఒక్కటే కావటం వలన, ఆ లక్ష్య సాధన వైపు బాలల మనసు పరుగులు తీస్తుంది. ఇటువంటివే మిగిలినకథల్లో కూడా కోకొల్లలుగా ఉన్నాయి. ఇవన్నీ బాల బాలికల మెదడుకు పదునుపెట్టి వారి మానసిక పరిపక్వతకు దోహదం చేయగలవు.

పరాకు

డైరెక్టర్... యిటువైపు వామనరావు. మిగతావాళ్ళు ముందుసీట్లో సర్దుకున్నారు.

"పిల్లలకి యిరుకు. మనం తిరిగి వచ్చిందాకా ఇక్కడే వుంటారు! ప్రొడక్షన్ మేనేజరు గారూ... హోటలతనికి చెప్పొచ్చారుగా ? ఏం సాంబా... వుంటారుగా... మళ్ళీ యిప్పుడే వచ్చేస్తాం.. మీకేం భయం లేదు. హోటల్ రూమ్‌లో వుండండి?...'

సాంబు తల వూపేడు. అనుపమ దిక్కు మొహం పెట్టి తండ్రి వైపు చూచింది.

కారు కదిలింది. కొంచెం దూరం వెళ్ళేక అసలు విషయంలోకి వచ్చాడు వామన్.

వాళ్ళు తీయబోయే సినిమా కథ చెప్ప బోయి ఆగేడు.

'అసలు మేం కొత్త రైటర్స్‌ని ఇంట్రడ్యూస్ చేద్దామనుకొంటున్నామండీ కవిగారు. మీతో కథ డిస్కస్ చేసి సంభాషణలు కూడా మీచేతే రాయిద్దామనుకొన్నాను. టైటిల్ కూడా యిమ్మన్నా. మా నెక్స్ట్ పిక్చర్‌కు మాటలు మీరే రాయాలి. కాదంటే కుదరదు. యిప్పుడే చెప్తున్నా.'

'ముప్పరాజువల్లెలో పెళ్ళి వాళ్ళు దొరుకుతారా? రోడ్డుమీద పిల్లలు ఎలా వున్నారో?' పరమహంస ఆలోచనలు యీ రెండు అంశాల చుట్టే తిరుగుతున్నాయి.

వామనరావు కథలోకి వచ్చాడు. ఇంటర్వెల్‌దాకా కథ చెప్పేసరికి ముప్పరాజువల్లె రానే వచ్చింది. అక్కడ విచారిస్తే మర్నాడే కాదు వారంరోజులదాకా ఆ వూళ్ళో ఏవరింటా పెళ్ళే లేదని తెల్సింది.

అయితే బొమ్మా బొరుసే కరెక్ట్. పెళ్ళి వారి వూరు అప్పరాజువల్లె!

'పెళ్ళివారి వూరు చేర్చే పూచీ నాది గురూగారూ. దాన్ని గురించి ఆలోచించకండి. మా కథ... కథలో క్లైమేక్స్ ఎలా వుంటే బాగుంటుందో మీరు చెప్పాలి. పేరున్న కథకులు. మీకది నిముషంలో పని. ప్లీజ్... కథను గూర్చి ఆలోచించరూ?'

గుడి — నది — కొండ... మూడూ వొకచోటే వున్నాయి ఆ వూళ్ళో. అక్కడ కూర్చోపెట్టి కథ చెప్పేడు వామనరావు.

'కథలో కొత్తదనం ఏమీ లేదండీ. మీ సినిమా వాళ్ళు యిలాంటి కాళ్ళూ, చేతులూ లేని కథల్ని తీసుకొంటూరేం?'

'కాళ్ళూ చేతులూ, గుండెకాయ కూడా కథకు మీ మంచే రావాలి గురూ...!'

కథను గురించి ఆలోచనలో పడ్డాడు కారెక్కాడు పరమహంస. అతను తప్ప కారులో మిగతా వారంతా యిరుగ్గా కూర్చున్నారు. కారు నిశ్శబ్దంగా వుంది. వింతో అవసరమైతే తప్ప డ్రైవరు కారు హారన్ కూడా వుపయోగించడం లేదు.

కారు విన్నో వూర్కను, జనసమ్మర్దం వున్న సెంటర్ను దాటింది. మలుపులు తిరిగింది పరమహంస బుర్రలో పడ్డ కథ కూడా ఎన్నెన్నో మెలికలు తిరిగింది. మార్పులు చేర్చుకొంది. కారు మెయిన్‌రోడ్డున పడ్డట్లే అతని కథకూ వో రూపం వచ్చింది.

అప్పటిదాకా తను దేన్నీ గమనించే స్థితిలో లేడు.

'గురువుగారు బ్రహ్మాండంగా ఆలోచించారు. ఏట్లాగైనా కథకులు కథకులే.'

పరమహంస తను వూహించిన మార్పులు చేర్పులతో కథ, క్లైమేక్సు చెప్పాడు. అతను మాట్లాడుతుంటే దాన్ని టేప్ రికార్డు చేసేడు వామనరావు.

'యింతకీ మనం యిప్పుడెక్కడున్నాం? మా సాంబు, అనుపమ...'

'ఏమోయ్ డ్రైవర్? ఆ సెంటర్ దాటొచ్చామా? ఆపలేదేం అక్కడ?' డ్రైవరుమ కేకలేసేడు వామనరావు. కారు ఆగింది.

'ఆ సెంటర్ దాటి అయిదుమైళ్లే వచ్చాంసార్.'

'అప్పరాజా పలె ...'

వామనరావు డోర్ తెర్చుకొని కారుదిగేడు. అతనితోపాటు అంతా దిగారు; పరమహంస కూడా దిగక తప్పలేదు.

వామనరావు చేతి గడియారంలో టైమ్ చూచుకొన్నాడు. చిరాకుపడ్డాడు.

'అప్పరాజా పల్లెంటే...మళ్ళీ వెనక్కివెళ్ళి దక్షిణానికి తిరిగి డొంక రోడ్డులో వెళ్ళాలి. యీ డ్రైవరుకు బుద్ధిలేదు. ముందుకు వెళ్ళటంతప్ప వెనక్కివెళ్ళే అలవాటు యీ వామనరావుకు లేదని తెలీదూ? ఛీ ఛీ ... అన్నట్టు డైరెక్టరుగారూ ...ప్రెస్ వాళ్ళకు మనం ఎంగేజ్‌మెంట్ కూడా యిచ్చినట్టు వున్నాంకదూ? ఓ! యిప్పటికే లేటయిపోయిందే! మైగాడ్. పన్‌క్ట్యుయాలిటీ మైన్‌టైన్ చేయటం నా వ్రతం. సార్ కవిగారూ...మీకు మా వల్ల, మాకు మీ వల్ల పెద్ద చిక్కొచ్చిపడింది. ఏంచేద్దాం?'

'సార్ అప్పరాజా పల్లె వెళ్ళే బస్సు అదుగో ఆగింది?'

'కవిగారూ – మళ్ళీ కలుద్దాం థేంక్యూ.'

వామనరావు కారెక్కాడు, అతనితోపాటు మిగతావాళ్ళూ ఎక్కారు. కారు నిముషంలో కనుమాపు దాటిపోయింది.

రోడ్డుకు ఆటుపక్క ఆగివున్న అప్పరాజా పల్లె బస్సు కదిలింది. పరమహంస రోడ్డుకు అడ్డంగా పరుగెత్తేడు. బస్సు అతడి పక్క నుంచి బరువుగా వెళ్ళింది.

బస్సు ఆగినచోట యిద్దరు పిల్లలు వొంటరిగా నిలబడ్డారు. పెద్దగా ఏడుస్తున్నారు చుట్టుపక్కల పరమహంస తప్ప పురుగు లేదు. ఆ పిల్లల్ని చూస్తుంటే పరమహంసకు సాంబు, అనుపమ గుర్తుకొచ్చారు–వొంటరిగా వాళ్ళేంచేస్తున్నారో? తనకోసం యిలాగే ఏడుస్తున్నారా? ఓ గాడ్! తన అజ్ఞానం ... పరాకూ ... ఛీ ఛీ...

'నాన్నా ... అమ్మా ... బస్సెక్కి వెళ్ళిపోయారూ...' యిద్దరు పిల్లల్లో చిన్నపిల్లవాడు నేలమీదపడి దొర్లుతూ ఏడుస్తున్నాడు. వాడిని ఎత్తుకొన్నాడు పరమహంస. బస్సు ఎక్కే పరుగులో పిల్లల్ని మర్చిపోయినట్టుంది తల్లిదండ్రులు!

తను? పెళ్ళి వాళ్ళ వూరు కనుక్కొనే పరుగులో పిల్లల్ని వదిలేసేడా? లేక సినిమా వాళ్ల స్వార్థపు పరుగు మైకంలో పడిపోయాడా?

బస్సు అల్లంత దూరం వెళ్ళి ఆగింది; వెనక్కి వస్తోంది.

వామనరావు– అతని చూపు, ఆలోచనలు, ముందుకు తప్ప వెనక్కి వెళ్ళవు. అతను ఖరీదైన సినిమా మనిషి! తనకి ముందు చూపు, వెనకచూపు, పక్కచూపు ఏంలేవు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది తన స్థితి!

పరమహంస పిల్లల్నిద్దర్నీ పట్టుకొని రోడ్డు మధ్యగా నిలబడ్డాడు.

సాధారణ జనాన్ని ఎక్కించుకొని ముందుకు పరుగు తీసిన ఆ బస్సు పాపం నెమ్మదిగా వెనక్కి వస్తోంది. ఆగుతోంది.

అమ్మయ్య! యీ పిల్లలు తమ తల్లిదండ్రుల్ని కల్సుకొంటారు. కానీ తను? పరాకుగా చూడకుండా వదిలేసి వెళ్ళిన పిల్లల్ని కల్సుకోగలడా? ఏమైపోయారో పాపం?


* * *

అనుపమ తండ్రిని చూస్తూనే ఏడుస్తూ చంకెక్కి మెడను గట్టిగా కౌగిలించుకొంది.

'నీకు మరీ అంత పరాకు పనికిరాదు నాన్నా. కారు ఎక్కగానే మోహంలోపడ్డావా? మా ముందు నుంచి వెళ్తూ కూడా మమ్మల్ని చూడకపోతే ఎలా నాన్నా? మాకు ఏడుపు రాదూ?'

కారు వ్యామోహంలో పిల్లల్ని మర్చిపోయాడా తాను! కాదు! కథనుఏకాగ్రతలో...

'అసలు వాళ్ళ కథను గురించి మవ్వెందుకు ఆలోచించాలిట! నిన్ను కారులో చూచి మేము చేతులెత్తేం. అరిచాము. మమ్మల్ని చూచి కూడా వాళ్ళు కారు ఆపలేదు. వాకెంత



బాధ్యత

బాధ్యత
విరుగని
వాకు
అభిమానం
ఉదయపు నీడ!
జీవన
పోరాటానికి
దిగితే
అది
మధ్యాహ్నపు నీడ.

— బిట్టు

పరాకు

కోపం వచ్చిందో తెల్సా? వెనక నుంచి గుంచూసి రాయి విసిరి కారు అద్దాలను పగలగొట్టాలనిపించింది. కానీ ఆ కారులో నువ్వున్నావుగా? అందుకని వూరుకొన్నాను. మరెప్పుడూ వాళ్ళతో వెళ్ళొద్దు నాన్నా. వాళ్ళు నిన్ను మోసం చేస్తారు. నాకు కోపం వస్తుంది తెల్సా?'

సాంబు వుక్రోషంచూస్తే పరమహంసకు ముద్దొచ్చింది. ఏడుపొచ్చింది.

'వెళ్ళను బాబూ. తప్పయిపోయింది. ఇంకెప్పుడూ పరుగులెత్తను. పరాకుగా వుండనుగా?' సాంబును దగ్గిరికి తీసుకుంటూ గద్గద స్వరంతో అన్నాడు.

'మనం వెళ్ళాల్సింది అప్పరాజా, ముప్పరాజా తిప్పరాజా పల్లెల్లో ఏదీ కాదు నాన్నా. అసలు ఆ వూరి పేరులో 'పల్లె' లేదు. నువ్వు శుభలేక మర్చిపోతావని వూహించి, మనకోసం అమ్మ, తాతయ్యను పంపింది. అడుగో తాతయ్య.'

'ఇంతకీ ఆ వూరి పేరేమిటండీ అసలు?'

'ఆదర్శపురం.'

'ఆ... అవునవును. గుర్తొచ్చింది. శుభలేఖలో ఆపేరే చదివేను.'

'ఆదర్శాలు చెప్పే రచయిత కూడా అంత మంచి వూరిపేరును కూడా మర్చిపోతే ఎలా నాన్నా?' అని సాంబు తండ్రిని విలేయలేదు. తండ్రిని చూసి నవ్వేడు!

పరమహంస తన పరాకును తల్చుకొని తానే పిచ్చిగా నవ్వుకొన్నాడు!

వారఫలం

19-3-1982 శుక్రవారం మొదలు
25-3-1982 గురువారం వరకు

★మేషం — శుభకార్యాలోచనలకు, వ్యాపారాను కూలతకు, క్రయ విక్రయాలకు, నూతనవ్యవహారాలకు, నూతన వస్తు సేకరణకు, వ్యాపారంలో ఉన్నతశిఖరం అధిరోహించుటకు అనుకూలవారమే. స్త్రీలకు: సుఖశాంతులకు, ధనాదాయానికి అవకాశమున్నది. రాజకీయవాదులైతే మేలైన దినమే.

★వృషభం — మీ యిష్టప్రకారమే అన్ని వ్యవహారాలు జరుగగలవు. మీకు వ్యాపారదక్షత ఉంటే యధాప్రకారమే పనులు జరుగుతాయి. క్రీడావనిలోనో, సాహిత్య రంగంలోనో ధనాదాయమో, నూతనావకాశాలో ఉండగలవు. స్త్రీలకు : సాహిత్య పరంగా కుటుంబ వ్యవహార రీత్యా మేలు సంభవం.

★మిథునం — ఆరోగ్యలోపం ఏర్పడటమో ఇష్టకార్యసిద్ధి, దూర బంధువుల వలన మేలు జరగటం, మిత్ర కార్యానికై మీరు ప్రయాస పడటం జరుగుతుంటు. వ్యాపారస్థులైతే అన్ని విధాలా సుగుణం కనిపించే దినం. స్త్రీలకు: వ్యవహారాలుంటే పరిష్కారం కాగలవు. ముఖ్య రంగంలో ఎలాటి యిబ్బంది లేకుండా జరుగుతుంది.

★కర్కాటకం — శుభకార్యానుకూలతకు, సాహిత్య రంగంలో నూతన అవకాశాలు, అందిన వారితో ఏదోవిధంగా సర్దుబాటు చేసికోవాలిగాని తగాదాకు దిగరాదు. అలాంటిపరిస్థితి ఉన్నది గనుక హెచ్చరిక. వ్యాపారం చేసేలాగైనా, రాజకీయంగా ఏదైనా మేలు జరగాలన్నా మంచి వారమే. స్త్రీలకు: ఆనందంగా వారమంతా జరగటం ఒక విశేషం.

★సింహం — బంధువులో, తెలిసిన వారో బాగా పరిచితులో యింటికి చేరనున్నారు. మిత్రుల వలన ఏదోబాధాకరమైన విశేషం జరుగనున్నదని గ్రహించుకోవాలి. స్త్రీలకు: అభివృద్ధి అన్నిరంగాలలోకి కనిపించుటయేగాక ఆదాయంలో కూడా అభివృద్ధి కనిపించనున్నది. లాభంగల వారమే.

★కన్య: ప్రత్యక్షంగా జరిగే అపకారం లేదు గాని అధిక వ్యయ సూచక దినంగా భావించాలి. బంధు విరోధానికి, మిత్రుల వలన అపకారం జరిగేమార్గం ఉన్నది. వ్యాపారంలో బాగా ఆలోచించిగాని ఉపక్రమింపరాదు. స్త్రీలకు : నూతన ప్రయత్నాలలో లాభం. వస్తుసేకరణకు అవకాశం, క్రీడారంగంలో ఏదో అవకాశాలు లభించటం జరుగుతుంది.

★తుల — సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు పెంపొందే అవకాశం ఉన్నది. మీర వే ధాశక్తితో ఒకానొకకార్యం సాధించనున్నారు. ధనాదాయానికి కూడా అనుకూలమే. ఒకానొక ఉత్తమోత్తమమైన వారంగా గ్రహించాలి. విద్యారంగంలో విద్యార్థినీ విద్యార్థులకు సదవకాశాలుండగలవు. స్త్రీలకు: నూత్న విధాన ఆదాయం, సర్వానుకూలతాసంసిద్ధి.

★వృశ్చికం — ఈ వారంలో శ్రమతో కార్యానుకూలత సాధించుకోనున్నారు. కొందరికు వృత్తియందు అభివృద్ధి, ఏదో ప్రమోషన్ లభింపవచ్చునేమో! ప్రయాణం చేయవలసి రావటం, అందుశ్రమకలగటం. వ్యాపారంలో స్వల్పంగా యిబ్బందులు సంభవించటం గమనించగలరు. స్త్రీలకు: సభ గౌరవం, పెండ్లి పేరంటాల ప్రస్తావన అవకాశంగల దినం. మనోబలం వలన కార్యసాధనగలదు.


★ధనుస్సు: ఇది ఉత్తమమైన వారం. బంధు వర్గీయులను ఆహ్వానించకయే యింటికి రానున్నారు. వారికొరకు, వారి వసతులకొరకు, శ్రమించనున్నారు. మీకేదో సహాయంచేయాలని ఒకానొకరు వెంటబడుతారు. అది నమ్మరాని విషయంగా గ్రహించాలి. అనారోగ్యతకు కారణమైన వారం. స్త్రీలకు: బంధు గోష్ఠి, నూతన మిత్ర సమాగమానికి, ప్రయాణానుకూలతకు అనువైన వారం.

★మకరం — ఈ వారము అంతా ఉత్తరాషాఢ నక్షత్రజాతకులకు ప్రోత్సాహకరంగాఉంటుంది. అన్ని రంగాలలో శ్రమించే వారికి అనుకూలమే. బెంగపడనవసరం లేదు. వృత్తిలో సంభవించే గౌరవం, సభాకార్యక్రమాన లభించే గౌరవం, మిమ్మల్ని తృప్తిపరచనున్నాయి. స్త్రీలకు: విద్యారంగంలో అనుకూలత, కొందరికు నూతనోద్యోగాలు ఫలవంతంకావటం గమనింపనున్నారు.

★కుంభం — సంఘంలో, చలనచిత్ర రంగములో, క్రీడావనిలో, వృత్తిఉద్యోగాలందు మీ కీర్తి అతిశయింపనున్నది. చాల కాలం అనఖా పడిన డబ్బు చేతికంద గలదను శుభవార్త వింటారు. స్త్రీలకు: బాకీలు వసూలు కావటం, క్రొత్తగా కొన్ని వస్తువులు కొనుగోలు చేయుటం జరుగుతుంది.

★మీనం:— రేవతీ నక్షత్ర జాతకులు శుభఫలితాలను పొందనున్నారు. అసాధ్యమనుకొన్న విషయాలు మీచే సాధింపబడుతవి. మీ సహాయం అర్థించేవారుంటారు. 'స్వంతలాభం' కొంత మానుక పొరుగు వారికి తోడు పడుట న్యాయమేగా! స్త్రీలకు: వృత్తిలో గౌరవం, అధిక వేతనావకాశం, శ్రమకు తగ్గ ఫలితం గల వారం.

— విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

కె. పి. ఆర్. – కడప

నా వయస్సు 32 సంవత్సరములు. మర్మాంగము మీద రెండు మూడు నెలలకొక సారి నీటి బుడగలు లాంటివి వస్తాయి. నెప్పిగాని, దురదగాని వుండదు. అవి తొనుగా చిట్లి పొక్కులు కట్టి రాలిపోతాయి. దీనివల్ల వివాహము చేసుకొనుటకు భయముగా వున్నది. ఇవి రాకుండా వుండాలంటే ఏమి చెయ్యాలి ?

ఆ నీటి బుడగల లాటివి వచ్చినప్పుడు ఆ ప్రాంతంలో కారే రసివంటి పదార్థాన్ని లేబరేటరిలో పరీక్షింప చేయుటం ద్వారా రోగ నిర్ధారణ జరుగుతుంది. నెత్తురు పరీక్ష (వి. డి.ఆర్.ఎల్) చేయించటం కూడా చాలా అవసరం. ఈ పరీక్షల ఫలితాల ననుసరించి చికిత్సచేయించుకోవలసి ఉంటుంది.

పి. యు. – ఎమ్మిగనూరు

నా వయస్సు 19 సంవత్సరములు. నాజుట్టు విపరీతముగా వూడి పోవుచున్నది. దీనికి కారణమేమిటి ? ఏమి చేస్తే వూడకుండా వుంటుంది.

జుట్టు వూడటానికి చాలా కారణాలు విడివిడిగాను సమిష్టిగాను దోహదం చేయవచ్చును.

అమైనో యాసిడ్లనబడేవి ఆహార పదార్థాల లోని ప్రొటీన్లు జీర్ణమవగా శరీరంలో ఉత్పత్తి అవుతాయి. వాటి లోపం వల్ల ఇలా జుట్టువూడి పోయే అవకాశం ఉన్నది.

కొన్ని విష జ్వరాలు మొదలయినవి వచ్చినతర్వాత జుట్టువూడడం జరుగుతుంది. కొందరికి జుట్టు రక్తనాళాలు ముకుళించుకోవటం ద్వారావయస్సు మీరే కొద్దీ వూడుతుంది. కొందరికి వంశ పారంపర్యంగా జుట్టు పలచబడటం జరుగుతుంది.

ఈ లక్షణానికి మూల కారణాలు తొలగించటమే చికిత్స. వంశపారంపర్యంగా వచ్చేదానికి తప్ప మిగతా కారణాలను తొలగించవచ్చును. తల నూనెల మార్పుల వల్ల ఎక్కువ లాభం ఉండదు.

వివ్. బి. మురపాక

నా వయస్సు 19 సంవత్సరములు. గత ఆరు నెలలనుండి శరీరంలో ఏ ప్రాంతంలోనైనా ఒక నిముషం పాటు సూదులతో గ్రుచ్చినట్లు చురుక్కు మంటుంది. ఏ క్షణంలో ఎక్కడ అలా అవుతుందో చెప్పలేం. ఎక్కువగా ఎడమ భుజం కీలు వద్ద, వెన్ను పూస కుడివైపు జీర్ణాశయందగ్గర అలా అవుతుంది. రాత్రిళ్ళు భుజం దగ్గర చాలా బాధగా ఉంటోంది. చెయ్యి చచ్చుబడి పోయిందా అన్పంతబాధగ వుంటుంది. ఎందుకిలాఅవుతుంది? తెలుప ప్రార్థన. ఎక్స్‌రే ఎక్కువగా తీయిస్తే శరీరానికి ఏమైనా హాని జరుగుతుందా ?

బి.కాంప్లెక్స్ విటమినుల లోపం వల్ల ఇలా జరిగే అవకాశం ఉంటుంది. బి. కాంప్లెక్స్ మాత్రలు రోజుకి మూడు పూటలుగా ఒక రెండు నెలలపాటు వాడండి.

ఎక్కువగా ఎక్స్—రేలు తీయించటంవల్ల శరీరానికి హాని కలిగే అవకాశం ఉన్నది. నెత్తురుని ఉత్పత్తిచేసే కణాలు దెబ్బతినటం, కొందరికి కేన్సర్ వంటి రోగం రాగల అవకాశం ఉన్నది.

టి. వి ఎస్. ఆర్. – ఆండలూరు

పగలు భోజనం చేసిన వెంటనే నిద్రపోతే పొట్ట పెరుగుతుందని, అరుగుదల తక్కువగా వుంటుందని చాలామంది అంటారు. ఇదిఎంత వరకు నిజం ? పగలు భోజనం చేయగానే నిద్ర పోతే ఆరోగ్యానికి హానికరమా? అలాగేమంచి నీళ్ళు ఎక్కువగా త్రాగితే పొట్ట పెరుగుతుందని కూడా అంటారు. మంచి నీళ్ళు ఎక్కువ త్రాగటానికి, పొట్ట పెరగటానికి సంబంధం వున్నదా?

భోజనానంతరం విశ్రమించటం మంచిది కాదనటం సబబే! తీసుకున్న ఆహారానికి తగినంత వ్యాయామం చేయుటం చాలా అవసరం. వ్యాయామం లేకుండా ఉంటే తప్పకుండా పొట్ట పెరుగుతుంది.

మంచినీళ్ళు త్రాగటానికి పొట్ట పెరగటానికి సంబంధం లేదు.

శ్రీమతి మనసు కథ

వాసిరెడ్డి సీతాదేవి

(గత సంచిక తరువాయి)

జరిగిన కథ - 3 : ఢిల్లీ కాన్ఫరెన్స్‌కని వెళ్లిన శివప్రసాద్ అక్కడికి వెళ్లకుండానే తన ఫ్రెండ్ శరత్‌బాబుతో తిరిగొచ్చిన భర్తను చూసి ఆశ్చర్యపోతుంది సుజాత. తను కాన్ఫరెన్సుకు వెళ్లి తిరిగొచ్చేవరకు శరత్ ఇక్కడే వుంటాడని చెప్తే ఏం చెప్పాలో తోచక ఆలోచన్లో పడిపోతుంది. ప్రసాద్ ఢిల్లీ వెళ్లకపోవడానికి గల కారణమేమిటో చెప్పకపోవడంతో, ఏమేమో వూహించుకొంటుంటుంది సుజాత. నిద్రపట్టక వెర్రి ఆలోచనలను చేస్తున్న సుజాతతో కాంపోజ్ టాబ్లెట్ మింగించి నిద్రపుచ్చుతాడు శరత్.

5

"అమ్మగోరూ ! అమ్మగోరూ !"

"ఓ సుజాతమ్మగోరూ !"

సుజాత బద్ధకంగా కదిలి కళ్ళు తెరవడానికి ప్రయత్నించింది.

రాత్రి వేసుకొన్న నిద్రమాత్రలు ఇంకా పని చేస్తున్నట్టున్నాయి. కళ్ళు తెరిపిళ్ళ పడటంలేదు.

"ఓ అమ్మగోరూ ! ఓ సుజాతమ్మగోరూ !"

ఆ కేకలకు సుజాత చెవులు బద్దలై పోతున్నాయి – పక్కమీద లేచి కూర్చుంది.

కళ్ళు నలుపుకొని చూసింది.

పనిమనిషి ఎదురుగా అరుస్తూ నిలబడి ఉన్నది– దాని ముఖం చూడగానే సుజాత మత్తు వదిలి పోయింది.

."నర్సమ్మా ! ఏమిటే ఆ అరుపులూ ?"

"అరుపులేంటి తల్లీ ? అరిష్టాలు జరిగి పోతుంటేనూ ?" ముఖంమీద పడుతున్న జుట్టును చెయ్యి తిప్పి వెనక్కు తోసుకుంటూ అన్నది నర్సమ్మ.

"ఏమిటే నీ గోల ?"

"గోలేంది తల్లో ! మీరిట్టావచ్చి చూడండి తల్లో ! ఓర్నాయనో ! ఈ ఇంట్లో ఏదో అయిపోతా ఉంది బాబో !" నర్సమ్మ గుండెలు బాదుకోసాగింది.

"ఏమిటే తిక్కలముండా ! అసలు సంగతి చెప్పకుండా ఆ గొడవేమిటే ! ఏం జరిగింది. అరవకుండా చెప్ప" సుజాత కంఠంలో ఖంగారు, చిరాకు, భయం మూడుపేటల గొలుసులా అల్లుకు పోయాయి.

"మీ కళ్లతోనే చూడండి తల్లీ ! నే సెప్పడ మెందుకూ ?" అంటూ నర్సమ్మ దొడ్లోకి పరుగు తీసింది.

నర్సమ్మ వెనకే సుజాత ఆదుర్దాగా పరిగెత్తింది.

"ఇదిగో ! మీరే సూడండమ్మా !" అంటూ నర్సమ్మ నీటి తొట్టిమీది మూత కిందకు తోసింది.

సుజాత నీటితొట్టి మీదగా తలవంచి చూసింది.

ఒక్కసారిగా గుండె వూడివచ్చి గొంతుకు అడ్డం పడ్డట్టు అయింది !

కాళ్ళు భూమిలోకి దిగిపోతున్నట్టు అయింది. ఒళ్ళు చెమటలతో ముద్దయిపోతున్నది.

సగం మునిగీ, సగం తేలుతూ, నల్లపిల్లి సుద్నా మిటకరించుకొని ఆకాశంకేసి చూస్తూ నీటి తొట్లో పడి ఉన్నది.

అది రోజూ వంటింట్లో తిరిగే పిల్లి.

అది టైం ప్రకారం సుజాత పెట్టిన పాలన్నం తిని వెళ్ళిపోయి తోటలో తిరుగుతూ ఉంటుంది. వంటింట్లో, సామానుల గదిలో, ఎలుకల బాధ లేకుండా చేసింది.

మూడు రోజుల ముందు ఓ రోజు దీన్ని చూసి భయపడి పారిపోతూ ఒక ఎలుక మంచినీటి డ్రమ్ములో పడింది. దాన్ని బయటికి రాకుండా, ఈ పిల్లి డ్రమ్ము అంచుమీద మునిగాళ్లానించి కూర్చుని రాత్రంతా ఉక్కిరి బిక్కిరి చేసింది.

నీళ్లలో ఉండలేకా, బయటికి రాలేకా తెల్లవారే సరికి ఎలుక చచ్చి, ఉబ్బిపోయి ఉన్నది. తను చూసే సరికి బాగా ఉబ్బిపోయి ఉన్న చచ్చిన ఎలుక నీళ్ల పైన తేలుతూ ఉన్నది. చివరకూ దీనికీ ఆ ఎలుకకు పట్టిన గతే పట్టింది.

అసలు ఇది ఈ తొట్టిలో ఎలా పడింది ?

పడిందేపో బయటికి ఎందుకు రాలేకపోయింది ?

"ఏమిటే నర్సమ్మా ఇది ?" సుజాత బలవంతంగా గొంతు పెగుల్చుకుంటూ అన్నది.

"నాకేం తెలుసమ్మా ?"

"ఎలా పడిందంటావూ ?"

"నాకు తెలియటంలేదమ్మా !"

"ఒకవేళ పడినా తొట్టిలోనుంచి ఎందుకు బయటికి దూకలేకపోయిందంటావూ ?"

"ఎట్లా దూకుద్దమ్మగోరూ ? ఇంత లావు మూత తొట్టిమీద పెట్టి, అంత లావు రాయి ఆ మూతమీద పెట్టింటేనూ ?" తొట్టి పక్కన ఉన్న మూతనూ రాయినీ చూపిస్తూ అన్నది నర్సమ్మ.

'ఇదో తిక్కలముండ' అనుకొంది సుజాత.

ఈ మూత పెట్టి, అంత లావురాయి దానిమీద పెట్టి ఉంటే అసలు పిల్లి తొట్టెలో ఎలా పడుతుంది ?

"తొట్టిమీద మూత పెట్టి ఉంటే అసలు పిల్లి లోపలకు ఎలా వెళ్తుందే ?" అడిగింది నర్సమ్మను.

"అదేగదమ్మా ఇచిత్రం !"

"ఛీ ! నర్సీ !" సుజాత తల గిర్రున తిరిగింది.

"నిన్న మీరేగదమ్మా చెప్పారూ ?"

"నేనేం చెప్పానే ?" సుజాత బుర్ర బద్దలై పోతున్నది.

"రెండు రోజులు నల్లాలో నీళ్లు రావనీ, నేవర్నో వేశారనీ !"

"అవునే ! రావని చెప్పాను. ఐతే ?"

"తెల్లారి అంట్లు తోమడానికి నీళ్లుండవని నిన్న సాయంకాలమే నీళ్లు పట్టి తొట్టినిండా పోశానమ్మా ! నిండా పోసి, మూత పెట్టి, దానిమీద ఈ రాయి పెట్టాను. తెల్లారి మూత తీసి సూద్దునుగందా – ఇదిగో ఇట్టా ఇది సచ్చి పడుందమ్మా !"

సుజాత నిట్టూర్పు విడిచి, గుండెల నిండుగ గాలి పీల్చుకుంది.

"నర్సమ్మా ! నువ్వు చూసేవరికే తొట్టిమీద మూత ఉండి ఉండదే ! రాత్రి పిల్లే మూతపడేసి, ఆ తర్వాత అది పడిపోయి ఉంటుంది. పైకి రాలేక నీటిలో మునిగి చచ్చిపోయి వుంటుంది."

"అదేంటి సుజాతమ్మగోరూ ! నన్ను పిచ్చిదాన్ని సేస్తున్నారూ ? నానే సాయంగా నా యీ సేతుల్తో మూతా, రాయీ తీత్తేనూ ! సూద్దునుగదా నల్ల పిల్లి చచ్చిపడి ఉంది."

"అయితే పిల్లి లోపలకు ఎలా వెళ్ళిందంటావే!"

"అదేగందా నేనడుగుతా ! ఇది సిత్రంలో ఇసిత్రం అయిపోతేనూ !"

"నీ బొంద ! నాకేమీ అర్థం కావడంలేదు."

"ఈ ఇంటిలో ఏదో – –"

"నర్సమ్మా నోరు మూసుకుంటావా లేదా ?" సుజాత నర్సమ్మను కసిరింది.

పనిమనిషిని కసురుకుంది. కాని మనసును మాత్రం ఏదో గుబులు చుట్టేసింది.

సుజాత గబగబా లోపలకు వెళ్ళింది

భర్త కోసం వెదికింది.

ఎక్కడా కన్పించలేదు.

శరత్‌బాబు గదిలో ఉన్నాడేమోనని చూసింది. అక్కడలేదు. శరత్‌బాబు కూడా కన్పించలేదు.

తోటలోకి వెళ్ళి చూసింది. అక్కడా లేరు.

ఇంత పొద్దుటే ఇద్దరూ ఎక్కడకెళ్ళి నట్టు ?

ఈ పిల్లి చావడమేమిటి ?

రాత్రంతా ఓ పీడకలలా జరిగిపోయింది.

ఈ శరత్‌బాబు ఎవడు ?

ఇక్కడకెందుకొచ్చాడు ?

ఉదయిస్తున్న సూర్యబింబం ఎర్రగా, ముద్దగా తూర్పున పైకి పాకుతోంది.

నర్సమ్మ నల్లపిల్లి తోక పట్టుకొని నీళ్ల తొట్టిలోనుంచి బయటికి లాగింది.

జీవంలేని దాని కళ్లు ఉషఃకాంతిలో మెరిశాయి.

సుజాత గుండెలో గండు పిల్లులు పోదిస్తున్నాయి.

"నర్సమ్మా! అయ్యగారెక్కడే?"

"నేనొచ్చేసరికే అయ్యగారు లేరమ్మా. బయటి తలుపులు తెరిచే ఉన్నాయ్."

ఇంత పొద్దుటే ఎక్కడకు వెళ్ళాడు?

శరత్‌బాబు ఏమయ్యాడు?

సుజాతకు ఏదో ఆలోచన వచ్చింది. గబగబా లోపలకు నడిచింది. గెస్టురూంలోకి వెళ్ళింది.

శరత్‌బాబే ప్రసాదును తీసుకెళ్ళి ఉంటాడు. ఇద్దరూ ఎక్కడికెళ్ళారో? రాత్రి ఏవో బిళ్లలు ఇచ్చి తనను నిద్రపుచ్చాడు. తను వళ్ళు తెలియకుండా నిద్రపోయిండి. నర్సమ్మ లేపేదాకా తనకు మెలుకువ రానేలేదు. ఇదంతా ఒక పథకంగానే జరిగింది. అతను రాత్రి తనకిచ్చిన మాత్ర ఏమిటి?

కాంపోజేనా! ఇంకేదయినా అయివుంటుందా!

టేబుల్ డ్రా లాగి వెదికింది.

వార్డ్రోబు తీసి వెతకసాగింది.

"ఏమిటి వెదుకుతున్నారు?"

సుజాత అదిరిపడింది.

గిర్రున వెనక్కు తిరిగి చూసింది.

ముచ్చెమటలుపోశాయి!

"దీనికోసమేనా వెదుకుతున్నారు?" శరత్‌బాబు తెల్లటి చిన్న బాటిల్ చూపిస్తూ అడిగాడు.

ఇతను ఎప్పుడు లోపలకు వచ్చాడు?

తను వెదుకుతున్నది ఆ సీసా కోసమేనని అతనికెలా తెలిసింది?

బోనులో నిలబడ్డ ముద్దాయిని చూసినట్టు చూసింది.

"మీ ఆయనే మింగాడు. ఈ బాటిల్ మీ ఆయనదే! మరీ ఎక్కువ మింగేస్తాడేమోనని ఈ బాటిల్ ప్రసాద్ దగ్గరనుంచి తీసుకొచ్చి నా గదిలో పెట్టుకున్నాను."

"అబద్ధం! ఆయనకు కాంపోజ్ వేసుకొనే అలవాటు లేదు. మీరే—" ఏదో ఆలోచిస్తూ వాక్యం పూర్తిచెయ్యలేదు.

"అది మీకు తెలియకపోవచ్చు!"

ఓ క్షణం ఆగి ఆమె ముఖంలోకి చూసి "కొత్తగా అలవాటు చేసుకుంటున్నాడేమో!" అన్నాడు.

"సుజాతా! సుజాతా!" ప్రసాద్ హడావిడిగా లోపలకు వచ్చాడు.

"చూడరా శివం! ఈ బాటిల్ ఎవరిదో చెప్పు! మీ ఆవిడ ఇక్కడ కోర్టు పెట్టి నన్ను క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నాది." సీసా ప్రసాద్‌కు అందిస్తూ అన్నాడు శరత్‌బాబు.

"నాదే ఇది? అయితే ఏమైందిప్పుడు?"

"ఆ సంగతి మీ ఆవిడనే అడుగు."

ఎక్కడ? పదండి చూద్దాం" అంటూ బయలుదేరాడు శరత్‌బాబు.

"నర్సమ్మ చచ్చిన పిల్లినితీసి గోడవతల పారేసింది" అన్నది సుజాత.

"నీటితొట్టయినా చూడొచ్చుగా?"

"మీరెళ్ళి చూసిరండి. అలా నిలబడతారేం? మీరెళ్ళి మీ స్నేహితుడికి ఆ నీళ్లతొట్టి చూపించి రండి" అని భర్తకేసి చూసింది సుజాత.

శరత్‌బాబూ, ప్రసాదూ ఇంటి వెనక్కు వెళ్లారు.



"కాదు. రాత్రి మీరు చూస్తున్న పేపర్లేమిటి?"

"ఓహో ఆవా? అవి ఆ టేబుల్‌మీదే ఉన్నాయిగా? అవి చదివినా మీకు అర్థం కావు."

సుజాత తలవంచుకొని నేలచూపులు చూసింది.

"నిజం చెప్పండి. మీరు వెదుకుతున్నది ఈ బాటిల్ కోసమే కదూ?" అంటూ "ఇదిగో తీసుకోండి. ఇందులో కాంపోజ్ మాత్రలే ఉన్నాయ్. చూడండి!" శరత్‌బాబు చెయ్యి ముందుకు చాచాడు.

"ఆయన చేతకూడా రాత్రి ఈ బిళ్లలే మింగించారు కదూ?" శరత్‌బాబును హత్య నేరంతో

"మీకు నిద్ర మాత్రలు వేసుకొనే అలవాటుందా?" గుటక మింగుతూ అడిగింది సుజాత.

"అలవాటేంలేదు కాని అప్పుడప్పుడు—అదినరే పనిమనిషి నర్సమ్మ ఏమిటి ఏదో గొడవగా చెబుతోంది?"

"మన నల్లపిల్లి నీటితొట్టిలోపడి చచ్చిపోయింది. వేసిన మూత వేసినట్టే ఉందనీ లోపల పిల్లి చచ్చిపడి ఉందనీ అంటోంది."

"పిల్లి నీటితొట్టిలోపడి చచ్చిపోయిందా?

సుజాత వంటింట్లోకి వెళ్ళింది.

స్నేహితులిద్దరూ తిరిగొచ్చేసరికి సుజాత ట్రేలో ఒక కప్పు కాఫీ, ఒక కప్పు టీ పెట్టుకొని వచ్చింది.

చదువుతున్న పేపరు పక్కకుపెట్టి టీ కప్పు అందుకున్నాడు శరత్‌బాబు. ప్రసాద్ కాఫీ కప్పు తీసుకొన్నాడు.

"నీళ్ళతొట్టి చూసొచ్చారుగా? మూతవేసి

ఉండగానే పిల్లి లోపలకు ఎలా వెళ్ళిందంటారూ ?" భర్తను అడిగింది సుజాత.

"అదే నాకు అర్థం కాలా?" అయోమయంగా అన్నాడు ప్రసాదు.

"మీరు చూసేవరికి పిల్లి లోపలే ఉందా ?" శరత్‌బాబు అడిగాడు.

అవునన్నట్టు తల ఊపింది సుజాత.

"తొట్టిమీద మూతకూడా... ?"

కొంతసేపు ఆగి గుర్తు చేసుకొని "ఉన్నది" అన్నది.

"మూత మీరే తొలగించి చూశారా ?"

"నర్సమ్మ మూత పక్కకు పెట్టి చూపించింది."

"అయితే మీ పని మనిషే ఇదంతా చేసింది."

"అంటే మీ ఉద్దేశ్యం? మా పనిమనిషే పిల్లిని చంపి అందులో పడేసిందంటారా ?" గాభరా పడింది సుజాత.

"అట్లా అని నేను అనలేదు."

"మరి ?"

"నా ఉద్దేశ్యం..."

"ఏమిటి ?"

"రాత్రి నీళ్ళు నింపి మూత వేయడం మర్చిపోయి ఉంటుంది. తొట్టి అంచుమీద తిరుగుతున్న ఎలుకను చూసి మీ పిల్లపిల్లి దానిమీదకు దూకి ఉంటుంది. తొట్టిలోనుంచి బయటికి రాలేక చచ్చిపోయి ఉంటుంది. తెల్లవారి మీ పనిమనిషి నర్సమ్మ చచ్చిపోయి తేలుతున్న పిల్లిని చూసింది.

మ న సు క థ

అంగారు పడిపోయి పక్కనే ఉన్న మూత తొట్టిమీద వేసి మీకోసం పరిగెత్తుకొచ్చి ఉంటుంది.

"మీరు డిటెక్టివ్ నవలలు రాస్తుంటారా ?" సుజాత అడిగింది.

"లేదు." శరత్‌బాబు మెల్లిగా నవ్వుతూ టీ కప్పు ట్రేలో పెట్టాడు.

"పోనీయ్ చదువుతుంటారా ?"

"ఆఁ అప్పుడప్పుడు – మరీ తోచనప్పుడు – అదీ సెలెక్టెడ్ రైటర్సువి మాత్రమే చదువుతాను. పర్ ఆర్డర్ కానండైల్, ఎలరీ క్వీన్ —"

"కాని ఇప్పుడు మీరు చెప్పింది ఆ స్టేండర్డులో లేదేమరి ?" సుజాత పెదవి విరిచింది.

శరత్‌బాబు పెద్దగా నవ్వాడు.

"సుజాతా ! పిల్లి కథ కాసేపు ఆపి ఈ పూట బ్రేక్ ఫాస్టుకు ఏం చేస్తావో చెప్పు" అన్నాడు ప్రసాద్.

"మీ ఆవిడ ఈ పూట పిల్లి కతే – టిఫెన్ చేయించేట్టుందిరా ప్రసాద్." అన్నాడు శరత్‌బాబు.

"శరత్‌కు వెరట్టంటే ఇష్టం !" అన్నాడు ప్రసాద్.

"నర్సమ్మ పిండి రుబ్బే మూడ్‌లో ఉందో లేదో" అంటూ సుజాత లేచింది. వంటింట్లోకి వెళ్ళబోతూ ఏదో గుర్తు వచ్చినట్టు ఆగింది.

"ఇంతకూ మీరిద్దరూ తెల్లవారకముందే – అదే పనిమనిషి వచ్చేవరికే ఇంట్లో లేరట. ఎక్కడి కెళ్ళారూ ?" అని అడిగింది.

"స్విమ్మింగ్‌కు వెళ్ళాం. శరత్‌కు స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం." అన్నాడు ప్రసాద్.

"ప్రసాద్ ఈ వార్త చూశావా ? ఘోరం ! ముగ్గురు చనిపోయారు. తొమ్మిదిమంది గాయపడ్డారు. మొత్తం ఇంజనీరింగ్ లేబ్ అంతా దగ్ధం అయిపోయింది." శరత్‌బాబు పేపరు చూపిస్తూ అన్నాడు.

ప్రసాద్ పేపరు అందుకున్నాడు, చదివాడు.

"న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్సులో ప్రేలుడు ! నేటి తెల్లవారుఝామున..." ప్రసాద్ వార్త పూర్తిగా చదివి శరత్‌కేసి చూశాడు.

"మీ పెమివార్ కూడా పోస్టుపోన్ చేసినట్టు రాశారు. చూశావా ?" అన్నాడు ప్రసాద్.

"చూశాను. మూడురోజులు పోస్టుపోన్ చేశారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో ?" సాలోచనగా అన్నాడు శరత్.

సుజాత భర్త చేతిలో ఉన్న పేపరు తీసుకున్నది. వార్త చదివింది. పేపరు సోఫామీద వేస్తూ శరత్‌బాబుకేసి అదోలా చూసింది.

శరత్‌బాబు ఆ చూపుకు అదిరిపోయాడు.

"మీరొకసారి ఇలా రండి ?" అన్నది భర్తతో సుజాత.

సుజాత వెనకే ప్రసాదు పిల్లిలా నడిచాడు. ఆమె అతడ్ని బెడ్‌రూంలోకి తీసుకెళ్ళి తలుపులు దగ్గరగా వేసింది.

నెస్టమ్ శిశువు జీర్ణానికి మంచిది

మీ పసిపాపకోసం
11 విటమిన్‌లు
ఇనుముగల
బియ్యంతో
తయారయిన
ఒకే ఒక పదార్థం.



ప్రకృతి సిద్ధమైన పద్ధతులలో మీ పాపని పెంచండి. ఇవ్వ గలిగినంత కాలం పాపకి చనుపాలు యివ్వండి—మీరు ఇవ్వగలిగిన పుష్టికరమూ. సున్నితమూ అయిన ఆహారం అదే.


పాపకి 4 నెలలు వచ్చేసరికి ఎక్కువ పోషక పదార్థాలు కావాలి. ఘన పదార్థాలు తీసుకోడానికి పాప సిద్ధంగా వుంటుంది. నెస్టమ్ గురించి. పాప ఆహారంలో ఘన పదార్థాలు ప్రవేశ పెట్టడం గురించి మీ డాక్టర్‌ని సంప్రదించండి. నెస్టమ్ బియ్యంతో తయారు చేయబడింది—ఎంతో సులభంగా జీర్ణమయ్యే సీరియల్.

నెస్టమ్ బేబీ సీరియల్ రైస్—పాల నుంచి ఘన పదార్థాలకి సున్నితమైన మార్పు.


నెస్టమ్®
బేబీ సీరియల్
రైస్

పాల నుంచి ఘన పదార్థాలకి
సున్నితమైన మార్పు


తయారు చేసే పద్ధతి :



ముందుగా మరిగిన వెచ్చని పాలు



పోయండి.
నెస్టమ్ చేర్చండి.



కలపండి. తినిపించుటకు తయారు.

SAA/FSL/N/2257 TEL

NESTLÉ®

"ఇదంతా నాకేదో అనుమానంగా ఉంది" గొంతు తగ్గించి అన్నది.

"అంటే?" అయోమయంగా చూశాడు ప్రసాదు.

"ఇంకా అర్థం కాలేదా? మీ స్నేహితుడు శరత్‌బాబు పనే ఇది! రాత్రి పన్నెండు గంటలదాకా మేలుకొనే ఉన్నాడు. నాకు మత్తు మాత్రలిచ్చి నిద్రపుచ్చాడు. అవును! మీకు కూడా ఇచ్చాడు గదూ? ఇద్దర్నీ మత్తులోపెట్టి ఈ ఘోరం చేసి ఉంటాడు."

"ఏ ఘోరం?" తల గోక్కున్నాడు ప్రసాద్.

"అయ్యో! ఖర్మ!" నెత్తి బాదుకుంది సుజాత.

"ఆ చెప్పేదేదో సరిగా చెప్పు!" విసుగ్గా అన్నాడు ప్రసాదు.

"నేను సరిగానే చెబుతున్నాను. మీ బుర్రే సరిగా పని చెయ్యడం లేదు. రాత్రి మింగిన మత్తు బిళ్లలు ఇంకా మీ మెదడుమీద పనిచేస్తున్నట్టే ఉంది."

ప్రసాదు ముఖాన్ని ఓ ప్రశ్నార్థకంగా మార్చి భార్యకేసి చూశాడు.

"అదేనండీ! ఆ పేపర్లో వచ్చిన వార్త!"

"వాడే వేయించాడంటావా?"

"వేయించడం కాదు. చేయించాడు."

"చేయించాడా?"

"చేయించడం కాదు. చేశాడు."

"ఏం చేశాడు?"

"న్యూక్లియర్ ఇంజనీరింగు లాబ్‌లో బాంబు పెట్టి పేల్చివేశాడు."

"సుజాతా!" పెద్దగా అరిచాడు ప్రసాదు.

"పెద్దగా అరవకండి వింటాడు. వింటే ఇప్పుడు మన ఇల్లు పేల్చేస్తాడు."

"సుజాతా నీకు మతిపోతున్నది."

"నాక్కాదు పోయింది మీకే!"

"సుజాతా!" ప్రసాదు కళ్లల్లో నరజీరలు కదిలాయి.

పెదవులు వణికాయి.

సుజాత అతడి కళ్ళలోకి చూసింది. కలవర పడింది.

"మీరిలా కూర్చోండి. శాంతంగా ఆలోచిం

చండి. ఆయన మీ స్నేహితుడే కావచ్చు. ఎలాంటి స్నేహితుడో నాకు తెలియదు. రాత్రి జరిగిందంతా ఓసారి గుర్తు చేసుకోండి. ఆఁ! అన్నట్టు తెల్లవారి మీరు లేచేసరికి అతడు ఏం చేస్తున్నాడు? ఇంట్లో లేడు కదూ?"

"ఉన్నాడు. అతనే నన్ను నిద్రలేపాడు. తలుపు తట్టి పిల్చాడు. నువ్వు మంచి నిద్రలో ఉన్నావు. నన్ను లేపి స్విమ్మింగుకు తీసుకెళ్లాడు." బుర్రలో నుంచి ఏదో పెకలించుకొని, ఎక్కడో దేన్నో చూస్తున్నట్టుగా అన్నాడు ప్రసాదు.

"కరక్టేనండీ! నేనూహించిందంతా నిజమే. అక్కడ బాంబు పేల్చి, ఇంటికి వచ్చి మిమ్మల్ని నిద్రలేపి ఉంటాడు. ఎలిబీ కోసం అండీ! సాక్ష్యం కావాలికదా? రాత్రంతా ఇంట్లోనే ఉన్నట్టూ, తెల్లవారుఝామున మిమ్మల్ని స్విమ్మింగ్‌కు తీసుకెళ్ళినట్టూ, రుజువు కోసం చేశాడండీ! ఇప్పుడు అర్థం అయిందా?"

"లాబ్‌లో బాంబు పెట్టాల్సిన అవసరం వాడికేమొచ్చింది?"

"ఏమో అది మీకే తెలియాలి."

"నాకా?" కలవరపడ్డాడు ప్రసాదు.

"ఏదో అన్నాను. మీకూ తెలియకపోవచ్చు. నా తెలివి తెల్లారినట్టే ఉంది. అంతపని చేసేవాడు మీకెందుకు తెలియనిస్తాడూ? అదంతా వాళ్లే చూసుకుంటారు."

"వాళ్ళెవరూ?"

"పోలీసులండీ – పోలీసులు!"

"పోలీసులా?" ప్రసాదు తెరిచిన నోరు తెరిచినట్టే ఉండిపోయింది.

"మీకో పని చెయ్యండి."

"ఏమిటి?"

"ఆయన్ని డ్రాయింగు రూంలోనుంచి గెస్టు రూంలోకి తీసుకెళ్ళండి. కూర్చొబెట్టి ఏదో ఒకటి మాట్లాడుతూ ఉండండి. ఈలోపల నేను పోలీసు స్టేషన్‌కు ఫోన్‌చేస్తాను. పోలీసులు వచ్చేంతవరకూ, టిఫిన్ తయారౌతోందని నేను మధ్య మధ్య మీకొచ్చి చెబుతూ ఉంటాను. మీరు మాత్రం అతడు బయటికిపోకుండా చూడండి. ఊఁ సరేనా?"

"ఒరేయ్ శివా?"

బయటి నుంచి కేక వినిపించింది.

సుజాత అదిరిపడింది.

సుజాత ఉలిక్కిపడింది!

ప్రసాదు తలుపు తెంచుకొని బయటికొచ్చాడు.

సుజాత భర్త వెనకే వచ్చింది.

"ఏదేమిటండీ అలా ఉన్నారు?" సుజాత ముఖంలోకి చూస్తూ అడిగాడు శరత్‌బాబు.

సుజాత కంగారుపడింది.

అసలే తెల్లటి ముఖం, ఇంకా తెల్లబడిపోయింది.

"అరగంటలో టిఫెన్ చేసి పట్టుకొస్తాను, ఈలోపల మీరు స్నానం పూర్తిచేసుకోవచ్చు." గాభరాను అణచుకుంటూ అన్నది.

"మీకు శ్రమ ఇవ్వడం నాకు ఇష్టంలేదు. మీకు రాత్రి సరిగా నిద్రకూడా లేదు. నీరసంగా కన్పిస్తున్నారు. మేమిద్దరం అలా బయటికెళ్ళి టిఫెన్ చేసివస్తాం. మీక్కూడా తీసుకొస్తాం. పదరా శివం!" అన్నాడు శరత్‌బాబు.

"దొంగరాస్కెల్ అటునుంచి అటే పారిపోవాలని చూస్తున్నాడు" అనుకుంది సుజాత.

"అబ్బే నాకేం శ్రమ లేదండీ. అర్ధగంటలో టిఫెన్ సిద్ధం చేస్తాను. మీకు పెసరట్టు అంటే చాలా ఇష్టం కదా? ఈ ఊళ్లో హోటల్లో పెసరట్టు బాగుండదు. ఈలోపల మరో కప్పు టీ త్రాగుతారా?" ఆప్యాయతను తెచ్చిపెట్టుకొని అన్నది సుజాత.

"ఓ.కే. మీ ఇష్టం! ఖాళీగా కూర్చోవడం ఎందుకూ? మీకేం సహాయం చెయ్యమంటారో చెప్పండి. టీ పెట్టమంటారా?" ఉషారుగా అన్నాడు శరత్.


"ఒరేయ్ శరత్. అలా సరండర్ అయిపోకురా. మా ఆవిడ నీతో పిండి కూడా రుబ్బించివెయ్యగలదు. జాగ్రత్త!" అన్నాడు ప్రసాద్.


ప్రసాద్ మాటకు శరత్ హాయిగా నవ్వాడు.

"సుజాతా. నీ పని నువ్వు చూసుకో!" వచ్చే నవ్వును ఆపుకుంటూ అన్నాడు ప్రసాదు.

సుజాత వంటగదిలోకి వెళ్ళేసరికి, నర్సమ్మ అంట్లుతోమి గిన్నెలు వంటగదిలో బోర్లించి పెడుతున్నది.

(ఇంకా వుంది)





పోతన భాగవత మాహాత్మ్యము



నక్క దోసకాయ యూరుగాయ, గోంగూర పచ్చడి. బ్రతె పెరుగు అంతే. అంతకంటె నక్కడ యేమి దొరకును ? అవే పంచభక్ష్య పరమాన్నములు. ఇట్లు ముదినము వేళపాళయని లేక కొర్నిపాటి సుబ్బరాజుగా రన్నప్రదాన మాచరించుచుండిరి. అన్నము జొన్న యన్నము. విస్తరి బొడ్డు మేడియాకు విస్తరి. ఉప్పు రాతి యుప్పు. నీరు దిగుడు బావి నీరు. ఇప్పటి మాటయా, దాదాపు మూతేండ్ల క్రిందటి మాట ! ముప్పది సంవత్సరము లిట్లా బ్రాహ్మణుం డన్నప్రదాన మొనర్చినాడు. మహాను భావుడు. నిర్గర్వుడు.

అతని భార్య దుర్గమ్మ. ఎందఱతిథులు వచ్చినను వారి కందఱకు బహు పరిశుభ్రముగా వండి, భర్త కుట్టి సిద్ధపరచి యుంచిన యాకులలో వడ్డించి, వారు సంతుష్టిగ భుజించిన తరువాతం దాను భుజించును. ఇట్లొక్క దినమా ? ఒక్క మాసమా ? ఒక్క సంవత్సరమా ? ముప్ప దేండ్ల నుండి చేయుచున్నది.

అతిథులకు సాయంకాలము మూడు గంటలు కాగానే ఆవపుంగాయ దినములలో తంపటి వైచిన యనుప గుగ్గిళ్ళు, లేజొన్న కంకుల దినములలో మాచ బియ్యము, మొక్కజొన్న పొత్తుల కాలములో మొక్కజొన్న పొత్తులు, ఇట్లు నే యే కాలములలో నేది పచ్చునో యది యల్పాహారముగ వారి యెదుటం బెట్టి, తాము వేగుపపమంత గంటము చేత బుచ్చుకొని తాటి యాకులపై, భాగవతమో, హరివంశమో, మతేదియో సుబ్బరాజుగారు వ్రాసికొనుచుందురు.

ఇట్లాతం డెన్నియో గ్రంథములు వ్రాసినాడు. కవీశ్వరు లాతనికిం గమ్మలం గట్టినట్లుందురు. ఆతనికి పోతరాజుగారన్న యపరిమిత భక్తి ప్రపత్తులు గలవు. ఒకనాడు తాము భార్యయుం బందు కొనియుండంగా భార్యనిట్లు ప్రశ్నించెను.

"దుర్గా ! పోతరాజుగా రెట్లుండురని నీ యభిప్రాయము ?''

ఈ ప్రశ్న యెందులకో యామెకు బోధ పడలేదు. కాని "పొడుగుగాను పన్నుముగాను మందురని నే ననుకొందును'' అని యామె బదులు చెప్పెను.

"అలాగునం గాదు సుమీ ! పొట్టిగా నుండును, తగుమాత్రమైన బొజ్జ గలిగియుండును'' అని సుబ్బరాజుగా రనిరి. ఔనని, కాదని భార్యాభర్త లిట్లు సంభాషించుకొన్నమీందట, భర్త

"దుర్గా ! నే నన్నమాటయే నిజమగునెడల — నదిగో — గోడ బల్లమీందం బెట్టిన మద్దెల యున్నదే, అది గణగణ మ్రోగును'' అనునంతలో యేమి జరిగెనో మనకుం దెలియదుగాని మద్దెల గణగణ మ్రోగెను. అంత సుబ్బరాజుగారు మహానందమున లేచి మద్దెలను క్రిందికి దింపి దానికిం బూజ లొనర్చి "పోతరాజుగారి మద్దెల'' యని దానికిం బేరిడిరి. ఆనాటినుండి భాగవతములోని గజేంద్ర మోక్షాది గాథలలోని పద్యము లన్నియుం గీర్తనముగా పాడు కొనుచు నా మద్దెల వాయించుకొనుచుండెడివారు.

ఈ కథ జరిగి యానాటి కిరువదేండ్లయినను నతిథులకు సుబ్బరాజుగారు దీనిని తప్పక వినిపించు చుండెడివారు. ఈ కథ చెప్పి —

క. పలికెడిది భాగవత మట !
పలికించెడివాడు రామభద్రుండట ! నేఁ
బలికిన భవహర మగునట
పలికెద వేఱొండు గాథ పలుకఁగనేలా !''

అను పద్యమును చదివి "ఆహా ! మహానుభావుండు ఎంత మృదులముగా, నెంత లలితముగా, నెంత మనోహరముగాం జెప్పినాడో ? మా తండ్రి పోతరాజుగారిప్పుడెక్కడనుండునో'' యని కన్నుల నీరు జలజల రాల్చుచుండును

కాల మొక్కరీతిగా నడవదు. వర్షములు వెనుకం బట్టినవి. పంటలు తగ్గినవి. క్షామము తలసూపినది. సుబ్బరాజుగా రతిథుల కట్లే యన్నదానలో నన్నదానము చేయుచున్నారు. క్రమక్రమముగా కర్పూరమువలె, పాటి పొలము, ఇల్లు, పాత్ర సామగ్రి, నగలు అమ్మిన ద్రవ్యము హరించిపోయినది. దుర్గమ్మ మెడలో మంగళసూత్రము, కూతురు మెడలో రూపు మిగిలినవి. ఒకనాటి మధ్యాహ్న మతిథులు వచ్చినారు. ఇంట నేమియు లేదు. ఒంటియందు మిగిలిన మంగళసూత్రము నిచ్చి, తాను పసుపు బొందు ధరించి, దుర్గమ్మ మంగళ సూత్రమునమ్మి భర్త తెచ్చిన రెండు వరహాలతో నా యతిథులకు నన్నము బెట్టి, మిగిలినది సాయంత్రము మమ్మాయి కొఱకు ఎట్టిపెట్టి, యా రాత్రియే నెవ్వరితోం జెప్పకుండ యూరు విడిచి పోవుటకు నేర్పాటు చేసినది. సుబ్బరాజుగారు నంగీకరించిరి.

ఇంతలో నా యూరిలోనున్న సంపన్న గృహస్థుం డొకండీ యంశమును కర్ణాకర్ణిగా విని యాయన వద్దకు నా రాత్రియే వచ్చి, "సుబ్బరాజుగారూ ! మీకు దుర్దినములు వచ్చినవి. దరిద్రతకంటె దుస్థితి లేదు. మిమ్ము నేను గనిపెట్టుదును. మీ రెక్కడికినిం బోవలదు'' అని వేడుకొనెను. ఆ మాటలు విని సుబ్బరాజుగారు, "ఓయబ్బ! దుష్ట దినములు మాత్రము మమ్మేమి చేయంగలవయ్యా ! దరిద్రము పోతరాజుగా రనుభవింపలేదా ? ఆయన కంటె మే మెక్కువవారమా ? ధర్మబుద్ధిచే నొకరు నాకింత పెట్టంగా నేను దినువాడను కాను.

పోతరాజాగారిని రక్షించిన యొంటిమిట్ట కోదండ రామమూర్తి మమ్మేల రక్షింపకుండును ? అడవులఁబట్టి పోవుదుము.

నాయనా ! పోతరాజాగారు

"అడవి రక్ష లేని యబలుండు వర్ధిల్లు
రక్షితుండు మందిరమున జచ్చు"

నని చెప్పినారు. మమ్మడ్డు పెట్టకుము. కాని నాదొక కోరిక యున్నది. ఎవ్వరైన నతిథులు వచ్చునెడల నీవు వారిని చేతనగునంతవరకు నాదరించు చుండుము. పోతరాజాగారు సంతసింతురు" అని చెప్పి యాతని బంపివేసెను.

ఇదివఱకుఁ దాను వ్రాసిన తాటియాకు గ్రంథము లన్నియు నటుక మీదఁబదిలముగా దాచి, తాను వ్రాసిన పోతరాజాగారి భాగవతమును దేవతార్చనపుఁబెట్టెతోఁగూడ సంగవస్త్రమునఁజుట్టి తలపైఁ బెట్టుకొని, పోతరాజాగారి మద్దెల నీపుపై గట్టుకొని, గంటము మొలలో దోపికొని కూతురు నెత్తుకొని, భార్య చేయి పట్టుకొని —

క. శ్రీకంఠ చాప ఖండన
పాకారి ప్రముఖవినుత భండన, విలసత్
కాకుత్స్థ వంశ మండన
రాకేందు యశోవిశాల రామనృపాలా !

అని పఠించుకొనుచు వెడలిపోయెను.

అది మహమ్మదీయుల రాజ్యము. నవాబుగారు జోడు గుఱ్ఱాల బగ్గీపై తమ ఖాసా తోట నుండి నగరునకుఁబోవుచున్నారు. వెనుక తరువు సవార్లు, ముందరిగా రవుతులు వచ్చుచున్నారు. ఆ దారినే వెడలుచున్న సుబ్బరాజుగా రమాంతముగా నవాబుగారి బగ్గీ గుఱ్ఱముల కళ్లెములను గట్టిగఁబట్టి దాని నాపివేసినారు. నవాబు పరివారమంతయుఁ జుట్టు మూఁగినారు. సుబ్బరాజుగారు పట్టిన పట్టు విడువక నవాబుగారితో

"ఓయబ్బ ! నీవేనటయ్యా ! ఈ మట్టుపల్లె పొలాల కంతకును రాజువు ? సరేకాని, నాకేమైనను భత్యమేర్పాటుచేసి తాటాకు గ్రంథాలు వ్రాయించ రాదటయ్యా ! నాకు జరుగుబాటుగను నుండును. నీకు ఖ్యాతిగాను నుండును. సుఖముగా గూర్చుండి వ్రాయుదును. నీ కచ్చేరీలోనికి నన్ను రానీయరని నిన్నుఁజూచుటకు నిక్కడకు వచ్చినాను. ఎవరేమి చెప్పుకొందురో వినవచ్చును గదయ్యా ! బండి నిమ్మళముగా తోలించుకొనరాదయ్యా !" అని, ఒకే ధారగా, గ్రుక్కవిడువకుండ, నిష్కల్మషముగ, తన మనసులోని మాటలన్నియు వినిపించినాఁడు. నవాబుగారు విని నిశ్చేష్టితులైనారు. కొంతసడికి తన వైపే చూపులు నిగిడ్చినట్లు సుబ్బరాజుగారు గ్రహించి ఓ యబ్బ ! అదేమి చూచెదయ్యా !

శా. కారే రాజులు ? రాజ్యముల్ గలుగవే ?
గర్వోన్నతిం బొందరే ?
వారేరీ ? సిరిమూటఁ గట్టుకొని
పోవంజాలిరే ? భూమిపైఁ
బేరైనం గలదే ? శిబిప్రముఖులున్
ప్రీతి న్యశస్కాములై
యీరే కోర్కులు వారల న్మఱచిరే ?
యిక్కాలమున్ భార్గవా ?

అని పోతరాజుగారు సెలవిచ్చిరయ్యా ! అడుగక యడుగక నరుసదేండ్ల కడిగినానయ్యా ! ఈ పొలాలన్నియు మాకకే నా కిచ్చిన నక్కరలేదు. వింటివా ? నీవిచ్చు భత్యము నా కేమియు నక్కర లేదు. కొలువు చేయించుకోనయ్యా, నీ వేదిచ్చిన దానితోనొక పూట యతిథి కన్నము పెట్టి మిగిలిన గంజితో నా కూతురు సంరక్షించుకొందును. మామాట కేమి" — అని గద్దించి యడిగినట్లు చెప్పెను. నవాబుగారు నిలువు గ్రుడ్లు వైచికొని చూచుచుండగా సుబ్బరాజుగారు,

"సీతో నాకేమి పోనయ్యా ! రాజన్నప్పుడు పోతరాజుగారే రాజుగాని నీవెక్కడి రాజువయ్యా !" అని పలికి వెడలిపోవుచుండగా, నవాబుగారి భటులాతని నున్నములో కెముక లేకుండ గొట్టి బాధలు పెట్టిరి. "రామ రామ" యని నానిన్నింటి సహించి పోబోవుచుండగ, నొక భటుఁడాతని జందెమును త్రెంపఁబోయెను. సుబ్బరాజుగారు మాటిగ వాని నెత్తిపై గంటముతో గొట్టెను. ఒక్క గంటపు పోటుతో వాఁడు గిలగిల కొట్టుకొని పడిపోయెను. సుబ్బరాజుగారిని నవాబు భటులు చెరసాల యందుంచిరి.

మిషాచి, స్ఫోటకపు వ్యాధులచే నా రాజ్య మత్యంత భయంకరముగ నుండెను. కారాగారమునకు నలువది బారల దూరముననొక కానుగ చెట్టు గలదు.

అచట దుర్గమ్మ కూతురుకో కాయకసరు దిని కాలక్షేపము చేయుచుండెను. తాను వానిచే బ్రతికినను పిల్ల బ్రతుకఁగలదా !. పిల్ల కొఱకు నొకరి యింట దాసిగా జేరి దుర్గ, తెల్లవారగనే వండి కూతురునకు బెట్టి మిగిలినది కారాగారము చెంత భర్తకడ నుంచెడిది. ఇట్లు కొన్ని దినములు జరుగ పిల్లకు స్ఫోటకము వచ్చినది. కానుగ చెట్టు క్రింద యీతాకుల నడుమ దుర్గ, పిల్ల కొఱకు కంటికిమంటికి నేకధారగా నేడ్చుచుండెను. సుబ్బరాజుగారు చెఱసాలలో భీష్మస్తవము పఠించుచున్నారు. కొంతసేపటికి పిల్ల మరణించినది. భార్యను చూచి సుబ్బరాజుగారు దుఃఖము నాపుకొని,

"ఓయబ్బ ! ప్రపంచ మిట్టిదని యెన
రెఱుఁగరు
తొందర యేల ? ఒంటిమిట్ట
కోదండరాము
డిచ్చినాఁడు, ఆయనయే తీసికొన్నాడు
ఓయబ్బ తన సొమ్ము తాను
తీసికొనఁడేమి

పోతరాజుగారి మాటయందు నాకున్నట్లే నీకు ప్రమాణ బుద్ధి యున్నది. కావునఁ జెప్పెదను.

ఉ. మచ్చిక నీరికెల్ల బహు మాత్రము
చోద్యము ! దేహపుట్టుచుఁ
జచ్చుచునుండఁజూచెదరు చావక
మానెదు వారిభంగి !
చచ్చిన వారి కేడ్చెదరు చావున
కొల్లకనాఁగ వచ్చునే !
ఎచ్చటఁబుట్టె నచ్చటికి నేగుట
నైజము ప్రాణికోటికిన్


అందువలన మన యమ్మ వైకుంఠమున నున్నది. నేనెఱుఁగుదును. రాత్రియే నాకుఁదెలిసినది' అని చెప్పి యామె నోదార్చెను.

"ఇంతలో స్ఫోటకపు శవమునచ్చట యుంచరాదని చెరసాల భటులు గద్దించిరి. దుర్గమ్మ "అయ్యలారా ! నా పిల్లకుఁ దరువాతి కర్మ జరిపించుటకుఁగాపైన లేదు. నేనే నా చేతులతో యీ కర్మ జరిపింపవలెనా, యని గోలుగోలున నేడ్చుచుండెను. ఆ యేడ్పునకు భర్త గుండెలేకావు, బ్రహ్మాండమంతయుఁ దల్లడిల్లినది. మకరి పట్టి పీడించి నిర్వీర్యునిగ నొనర్చిన గజేంద్రుని మాడ్కి సుబ్బరాజుగారున్నారు. అట్లే

"శా. లావొక్కింతయు లేదు; ధైర్యము
విలోలంబయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చెఁ
దనువుం డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుంగ
మన్నింపందగున్ దీనునిన్
రావే ! యీశ్వర ! కావవే వరద !
సంరక్షింపు భద్రాత్మకా !

యీ పద్యము జదువుకొనుచు శాంతి పడిరి.





ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

సహపాఠుల సౌహార్దం

తమ యింటికి వచ్చిన అతిథిని గౌరవించడం భారతీయుల సంప్రదాయం. ఈ సంప్రదాయం పూర్వం పెద్దలలో కాకుండా పిన్నలలోకూడా ఉండేది. విద్యార్థులు విద్యకోసం గురుకులానికి వెళ్లితే, అక్కడ ఉన్న విద్యార్థులు క్రొత్త విద్యార్థుల యెడ ఎంతో దయ చూపి, వాళ్లకు తమతోపాటు అన్ని సౌకర్యాలూ కలిగించేవారు. తోడి మానవుని తనమాదిరిగానే చూచే పద్ధతి ఆ కాలంలో ఉండేది.

మందమతులూ, మూర్ఖులూ, సోమరులూ అయిన విద్యార్థులు పాతవారైనా, కొత్తవారయినా — వారిని తక్కినవారు అపహాస్యం చెయ్యడం అక్కడక్కడ ఉంటే ఉండవచ్చును గాని, ఒకరినొకరు హింసించడంలేదు.

మనకు విదేశీయుల దాస్య శృంఖలాలనుంచి విముక్తి లభించి ముప్ఫయి నాలుగేళ్లు దాటినా, పాశ్చాత్యుల అనుకరణ మాత్రం నశించలేదు. ముఖ్యంగా విద్యార్థులలో ఇది అధికంగా కానవస్తుంది. విదేశాలలోని బోర్డింగు స్కూళ్లలో కొత్త విద్యార్థులు వచ్చినప్పుడు పాత విద్యార్థులు వారిని కొత్తలో కొంత చికాకు పరచడం ఉన్నది. అది వినోదం కోసమేగాని, వారిని హింసించాలనే సంకల్పంతో కాదు. కొద్ది రోజుల్లో ఆ కొత్త విద్యార్థులూ పాత విద్యార్థులలో కలిసిపోతారు. వారి విద్యార్థి దశలో తోడి విద్యార్థులవల్ల ఎట్టి చికాకూ ఏర్పడదు.

మన దేశంలో పూర్వం లేని యీ పద్ధతి పాశ్చాత్యుల సంపర్కంవల్ల వచ్చింది. అన్నిచోట్లా కాకున్నా, కొన్ని ప్రాంతాలలోనయినా ఈ పద్ధతి కానవస్తున్నది. తోడి విద్యార్థులను ఇలా హింసించడం దారుణ రూపం దాల్చి — బాధ భరించలేక విద్యార్థులు ఆత్మహత్యకు కూడా గురి కావలసి వస్తున్నది. ఈమధ్య కర్ణాటక రాష్ట్రంలోని దేవగిరిలోని వైద్య కళాశాల విద్యార్థి తోడి విద్యార్థులు పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్న సంగతి, అందరికీ తెలుసును. ప్రజల క్షేమారోగ్యాలకు బాధ్యత వహించే డాక్టర్లుగా తయారు కావలసిన విద్యార్థులే ఈ రీతిని అమానుషంగా ప్రవర్తిస్తే మనదేశం ఎట్టి స్థితికి రాగలదో గ్రహించవలసి ఉన్నది. బాధ పడుతూవున్న ప్రాణుల యెడల దయాదాక్షిణ్యాలు చూపవలసినవారూ, భావి భారత నిర్మాతలూ అయిన యువకులు ఈ విధంగా ప్రవర్తించడం భావ్యం కాదు. వైద్య కళాశాలల్లోనే కాదు — ఇంజనీరింగు కాలేజీలలో కూడా ఇలాటి హింసాత్మక చర్యలు జరుగుతూ ఉన్నవి. ఒరిస్సాలోని రూర్కెలా ఇంజనీరింగు కాలేజీలో పాత విద్యార్థులు కొత్తగా చేరిన విద్యార్థులను హింసించడం ఉన్నది. వినోదంకోసం ఏర్పడిన యీ సంప్రదాయం విషమ రూపాన్ని ధరించడం చాలా శోచనీయం. సహపాఠుల యెడల విద్యార్థులు సౌహార్దం చూపవలెనే కాని, హింసా కాండకు దిగడం తగదు. అట్టి చర్యలు వ్యక్తిని మానవత్వాన్నుంచి చాలా దూరం ఈడ్చుకుపోతాయి. ★

౬

సుబ్బరాజుగారి గంటపు దెబ్బ తిన్న భటుఁడు మరణించెను. ఖూనీ చేసినందులకు సుబ్బరాజుగారిని భీష్మైకాదశి దినమున విచారణకు దీసికొని రమ్మని నవాబుగారి యాజ్ఞ యైనది. దుర్గమ్మ కంతకు ముందే భేదులు ప్రారంభమైనవి. ఒకనాడామె భర్త వద్దకు డేకురుకొనుచు వచ్చి, తానిక బ్రతుకుట దుర్లభమని కడసారి దర్శనమునకై వచ్చితిననెను. ఆమెను చూచి భర్త కొయ్యబారెను. ఒక్క నిముసమునకే తెలివి తెచ్చుకొని, యామెను చూచు సరికి "శ్రీరామచంద్ర! మీ పాద సన్నిధినే మరణింప వలెనని యున్నది. కాని వ్యాధియు, భటులును ఉండనీయుట లేదు. నన్ననుగ్రహింపుఁడు. ఇవే నమస్కారములు" అని యామె యనుచు నతి కష్టముతో తిరిగి పోవుచుండెను. ఆమె యవస్థ చూచి, తన యవస్థఁ దలఁచికొని సుబ్బరాజుగారు —

క. కలఁడందురు దీనులయెడఁ
   గలఁడందురు పరమ యోగి గణముల
   పాలం
   గలఁడందు రన్ని దిశలను
   గలఁడు గలండనిన వాఁడు కలడో లేడో?"

అని చదువుకొనుచు, నట్లు సందేహము గలిగినను వెనువెంటనే ధైర్యమునవలంబించి, నిశ్చల మనస్సుతో

పోతన భాగవత మాహాత్మ్యము

"క. నీ పాద కమల సేవయు
   నీ పాదార్చకుల తోడి నెయ్యంబు నితాం
   తాపార భూత దయయును
   దాపస మందార! నాకు దయసేయఁగదే"

అని ధ్యానించుకొనుచుండెను.

నవాబుగారి కచ్చేరి హాలులో సుబ్బరాజుగారు నేరస్థుని స్థానమున నిలువఁబడిరి. "నీ గంటము దెబ్బచే మా భటుఁడు చనిపోయినాఁడు. కాబట్టి నీకు మరణ దండన యేల విధింపకూడదో చెప్పు కొందువా?" అని నవాబుగారడిగిరి. సుబ్బరాజుగారు నిబ్బరముతో "ఓయబ్బ! గంటపు దెబ్బకే చచ్చిపోయి నాడయ్యా! గట్టిగా కొట్టనేలేదయ్యా! మా యబ్బ! యెన్ని గ్రంథములు వ్రాసిన గంటమయ్యా! ముందు జన్మమున వాఁడు మంచి కవియై పుట్టును. నన్నడుగుటెందుకు? నీ యిష్టము వచ్చినట్లు చేసికోవయ్యా! అడిగి యడిగి నీ వేమాత్రము చేయగలవయ్యా! పోపో" అని కచ్చేరినుండి పోవ బ్రయత్నింప భటులాతనిఁ బట్టుకొనిరి. ఆతని తల నరుకవలెనని నవాబుగారాజ్ఞాపించిరి. భటులాతనిని దగ్గరనే యున్న వధ్యస్థానమునకుఁ గొని పోయిరి. తలారి కత్తి చేతఁబట్టుకొని సుబ్బరాజుగారి మొగము వంకఁజూడఁగనే యాతని కొకవిధమగు భయము కల్గెను. కత్తి పారవైచి తానా పని చేయఁజాలనని తలారి చెప్పెను. నవాబుగారు భటునితో సుబ్బరాజు తల నరుకకపోయిన, నాతని తలయే నఱికింతుమని బెదరించిరి. చేయునది లేక భటుఁడు చేయెత్తి కత్తితో కంఠముపై నొక్కవేటు వేసెను. కాని కంఠముపై గాయమైన కాలేదు. తల తెగలేదు. అప్పుడు సుబ్బరాజుగారు, "ఓ యబ్బా, నీవలనఁ గాదయ్యా!

పోతన్నగారి భాగవతము నా దలపై నుండగా, తల తెగుననియే యనుకొంటి వయ్యా! నఱకుటకు నీతరమయ్యా! నన్ను వెనుకకు విఱచి కట్టిన కట్లు విప్పుము. చేతులను విప్పుము. అప్పుడు నరుకవచ్చును" అనెను.

నవాబు చేతులు విప్పుటకాజ్ఞ చేసిరి. సుబ్బరాజుగారు నెత్తి మీదనున్న పోతన భాగవతము తీసి, కన్నుల నద్దికొని, దానిని క్రింద పెట్టి, ప్రదక్షిణ నమస్కారము లాచరించి, "కోదండరామ ప్రభో" అని యొక్క పెద్ద ధ్వని చేసి, చాప చుట్టఁగబడి ప్రాణములు విడిచెను.

నవాబుగారికి కడుపులో చేయి పెట్టి కలచి నట్లయినది. వారేడ్చి, యేడ్చి తుదకు రామభక్తులైరి. పోతన భాగవత మహిమ యట్టిది.

—'సాక్షి' నుండి సంగ్రహితము.

[శ్రీ నిడుదవోలు వేంకటరావుగారి 'పోతన' నుంచి] ●


ఆరోగ్యం, మజా, జోరూ తోడు జోడుగా!
Bournvita
Bournvita
తాగండిక బోర్న్‌విటా.
మీ కుటుంబంలోని వారికి క్యాడ్‌బరిస్ బోర్న్‌విటా యివ్వండి. దానిలోని రుచి అంటే వాళ్ళందరికీ మహా యిష్టం. బోర్న్‌విటాలో ప్రకృతిలోని మంచి లక్షణాలుగల కోకో, మాల్ట్, పాలు, పంచదార సమృద్ధిగా వున్నాయి. దీన్ని తయారుచేసింది, 100 సంవత్సరాలకు పైగా ఆరోగ్య పానీయాలు తయారు చేయడంలో ప్రత్యేకత గణించిన క్యాడ్‌బరీవారు.
క్యాడ్‌బరిస్ బోర్న్‌విటా
దీన్లోని మంచిదనం పెరుగుతుంది మీపైనిక.
Cadbury's
Bournvita
The tastier food drink
Cadbury's
Bournvita
డబ్బు ఆదాచెయ్యండి...
అందరూ కోరుకునే
రీఫిల్ ప్యాక్ తెచ్చుకోండి!
OBM-7538 TL



అమరబిక్షలు

కె.కె. రఘునందన

దశరథరామయ్యగారు చనిపోయి యేడాది గడిచినా సరే వర్ధనమ్మలో జ్ఞాపకాలు మాత్రం — ఆమెని వదలిపోలేదు. నుదుటిమీది బొట్టు చెరిగిపోయిన దౌర్భాగ్యానికి లోకంలో తలెత్తుకు తిరగలేని పరిస్థితి అయిపోయింది.

కాలం కొవ్వొత్తిలా కరిగిపోతూందే తప్ప పాత రోజులు తిరిగి రావుకదా ! అన్న నిస్పృహ ఆమెను కదిల్చివేసి కన్నీటిని బహిర్గతం చేస్తోంది.

ఒకప్పుడు వర్ధనమ్మ జీవితం సుడిగుండాల్లేకుండా సాగిపోయే నావలా సాగిపోయేది. ఏ ఆటంకాలు లేకుండా సాఫీగా — సంతోషంగా ఇద్దరు కొడుకులతో — ముగ్గురు ఆడపిల్లలతో — పువ్వు పువ్వులా సంసారం వెల్లివిరిసేది.

కాని ! ఇప్పుడామెలో మిగిలినవి — నైరాశ్యం — చీకటి — నిస్పృహ — నిర్లిప్తత.

పెద్దకొడుకు రాజేషు ఇంజనీర్ ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లిపోయాడు. ముగ్గురు కూతుళ్లు — మూడుముళ్లు పడటం వల్ల — అత్తవారిళ్లకు వెళ్లిపోయారు. ఎన్నాళ్లని దగ్గరుండి ఓదారుస్తారు ?

ఎటొచ్చీ రెండో కొడుకు రమేషు ఉన్న ఊర్లోనే ఉద్యోగం కావటంతో తల్లివద్దే ఉండవలసి వచ్చింది. అప్పుడప్పుడు రెండో కోడలు రేణుక సూటిపోటి మాటలకు వర్ధనమ్మ గురౌక తప్పలేదు. ఎంతైనా యజమానిలేని ఇల్లు చుక్కానిలేని పడవలా లోటుగ ఉంటుందన్న నగ్నసత్యం ఆమె మనసులో నాటుకుంది.

మనిషిగా బ్రతికినన్నాళ్లూ స్వర్గ సుఖాల్ని చవిచూసింది. దేనికీ లోటు అన్నది ఎరగదామె. ఒకర్ని చెయ్యి చాచటం, అప్పు అడగటం ఆమెకు మనుగడలో తెలీని మాటలు.

దశరథరామయ్యగారి పలుకుబడివల్ల అంతా సజావుగానే జరిగిపోయేది. కూరగాయలు, పప్పు దినుసులు - అన్నీ కొనుక్కోకుండానే — ఏ రెల్లివలస రాజాలో, కుమిలి రెడ్డిలో పంపేవారు. ఆయనకు రాజకీయంగా ఎంతో మాటకారితనం, డబ్బు వుండటం వల్ల గుంభనగా ఏనుగులా దర్జాగా ఉండేవారు.

ఆయన తనకున్నంతలోనే ఎక్కువగా చదివించి, ప్రయోజకుల్ని చేసారు. పెద్దకొడుకుని ఇంజనీరింగు చదివించారు. రమేషుకి బియిడి ట్రైనింగ్ కానిచ్చి, భోగాపురం నాయుడ్ని పట్టుకొని మేస్టారుగా ఉన్న వూళ్లో ఉద్యోగం వేయించుకున్నారు.

ఆయన మాటకు సాధారణంగా ఎవ్వరూ ఎదురు చెప్పేవారు కాదు. వర్ధనమ్మ ఆయనకు ప్రాణం ఇవ్వడానికి సైతం సిద్ధపడేది.

అటువంటిది రెండేళ్ళక్రితం — సుఖసంతోషాలు విరబూసిన ఆ ఇంట్లో — ఏ మాంత్రికుడో చేతబడి చేసినట్లు ఒక్కసారిగా విషబిందువులు చింది — విషాదనాదాలు ధ్వనించాయి.


దశరథరామయ్యగార్కి టి. బి. వచ్చింది. ఆయన రాయిలాంటి శరీరం ఆ ఒక్క జబ్బుకి లొంగిపోవలసి వచ్చింది. అందుకే అంటారు — దేనికి లొంగని మనిషైనా జబ్బుకి లొంగక తప్పదని.

విధి ఈ విధంగా వక్రిస్తుందని ఊహించని వర్ధనమ్మ ఎంతగానో రోదించింది. ఆమెను ఊరడించి — రాజేషు — తండ్రిని విశాఖపట్నం టి. బి. హాస్పిటల్లో జాయిన్ చేసాడు.

దశరథరామయ్యగారి దురదృష్టమో — వర్ధనమ్మ నుదుటి కుంకుమ చెరిగిపోవాలని రాసి వుందో కాని — ఆయన జబ్బు ముదిరిందనీ, అది తగ్గేలా లేదని — డాక్టర్లు నిర్ధారించారు. ప్రయత్నించడం — డబ్బు ఖర్చు పెట్టడం కొడుకులుగా తమ కర్తవ్యమని తలంచి ఆయన్ని ఎమెర్జన్సీ వార్డులో ఉంచారు. వర్ధనమ్మని కూడా 'సీతమ్మధార'లో ఓ చిన్న బస ఏర్పాటుచేసి ఉంచారు రమేషు - రాజేషు.

ఆమెకు చేదోడు — వాదోడుగా వుంటుందని తన భార్య సుస్మితని ఉంచాలనుకున్నాడు రాజేషు. కాని ఒంటరిగా ఉండి చెయ్యి కాల్చుకుంటాడని వూహించిన వర్ధనమ్మ అందుకు ససేమిరా ఒప్పుకోక- ఒంటరిగానే ఉంటానంది.

దానికి రమేషు ఉదాసీనం వహించాక తన భార్య రేణుకను ఆమెతో వుంచి — ఇల్లు తను చూసుకుంటానని చెప్పాడు రాజేషులా కాకుండా


డిపీ-నే డిపీ-తో
రండి
డిపీలాండ్
Dipy's
Dipy's

రామేషుకి వంట వార్పులో కొంచెం అనుభవం వుందని తెలిసి అందుకు అంగీకరించింది వర్ధనమ్మ.

రేణుక మాటలు బాకుల్లా గుండెల్ని గాయం చేసినా నిగ్రహించుకొని గంభీరంగా వుండి — భర్తకు సేవలు చెయ్యడంలో నిమగ్నమైపోయింది.

ఆర్నెల్లు గడిచేసరికి జబ్బు మొండిదై కూర్చుని— వర్ధనమ్మ బ్రతుకును చీకటి చేయసాగింది. దశరథ రామయ్యగారు ఒకప్పుడు ఎంతో ధైర్యస్థులే అయినా సరే — చివరికి జబ్బువచ్చిన మరుక్షణం భీరువులా అయిపోయి — ఎముకలు తన్ను కొచ్చి నీరసంగా తయారయ్యారు.

''నిప్పుకుచెదపట్టిందని'' 'దశరధరామయ్యగారికి జబ్బా !!' అని ఆయనకు తెలిసిన రాజులు, రెడ్లు ఆశ్చర్యపోయి ఎంతో విచారించారు. అంతో—యింతో సహాయం అందించారు కూడా !

వర్ధనమ్మను ఒక్కొక్కరూ వచ్చి పలకరించి పోతూంటే దుఃఖం ఎగదన్నుకు రాసాగింది. కాని ఏం పాలుపోయేది కాదామెకు.

ఎప్పుడైనా తప్పదన్నట్టు మృత్యురాక్షసి ఆయన్ని ఏడాదికల్లా కబళించివేసి — వర్ధనమ్మను 'ఆడదానికి చరమాంకంలో ఏ శిక్ష పడాలో' అదే వేసింది. సౌభాగ్యాలన్నీ కాలి బూడిదయ్యాయి. వర్ధనమ్మగార్ని మునుపు ఏ నోములు — వ్రతాలు చేసినా పెద్దముత్తయిదువగా తీసుకువెళ్లి ఆశీర్వాదం పొందేవారు. అటువంటిది ఆమెకు ఈ దుర్ఘటన ప్రాప్తించడంతో అందరూ చాలా బాధపడ్డారు.

చెయ్యవలసినదంతా కొడుకులు చేస్తూంటే వర్ధనమ్మ నోట్లో గుడ్డ కుక్కుకుని ఏడవటం తప్పితే మరేం చెయ్యలేక నిస్సహాయంగా ఉండిపోయింది. తనకి తప్పనిసరిగా చెయ్యవలసిన తతంగం ఆడంగులు చేస్తూంటే చచ్చిపోవాలన్నంత ఆవేదన, ఆవేశం ఏర్పడ్డాయి ఆమెలో.

నిరాశ - నిట్టూర్పులతో — సంవత్సరం గడిచి పోయింది. ఒకరి దగ్గర వుంటూ చేవలేని బ్రతుకులా శూన్యంగా అయిపోయింది.

మాసికాలన్నీ సక్రమంగా - నిరాటంకంగా జరిగి పోయాయి.

సంవత్సరీకాలు దగ్గర పడ్డాయి. కొడుకు కోడలు, కూతుళ్లు వచ్చారు. ఒకప్పుడు అందరూ వస్తే పండగలా నిండుగావుండేది. దశరధరామయ్య గారు మనవళ్లతో చిన్నపిల్లాడిలా ఆడుతూ — కొడుకులతో తిరిగ్గా మాట్లాడుతూ, కోడళ్లను వ్యంగ్యమైన చిన్న చిన్న చురకలు అంటిస్తూంటే చాలా సరదాగా గడిచేది. పాత గుర్తులన్నీ కళ్లకు కట్టి మరింత రంపపుకోతకు గురైంది వర్ధనమ్మ మనసు.

దీపావళి వస్తే చాలు ఆయనకు భయం. చప్పుళ్లకు లేడిలా బెదిరిపోయేవారు. చెవుల్లో దూది యిరికించుకుని ఇంట్లోనే ఉండేవారు. అంత ధైర్యస్థులు టపాకాయలుకు భయపడ్డం విచిత్రంగా అనిపించేది ఊరివాళ్లకు.

అదే దీపావళినాడు ఆ ఇంటి దీపం ఆరిపోయింది.

రాజేషు హైదరాబాద్‌లో ఉండటంవల్ల — ముందుగా సెలవులు పెట్టుకుని వచ్చాడు. సంవత్సరీ

కాలకు ఏం ఏర్పాట్లు జరగాలో అన్నీ తనే స్వయంగా చూసాడు. రమేషు తల్లిని ఓదార్చి తక్కిన కార్యక్రమాల్లో పాల్గొన్నాడు.

ఎలాగైతేనేం ఆయన అదృష్టవంతులే ! ఇద్దరు కొడుకులు--ముగ్గురు కూతుళ్లు—మనవళ్లు- మనవరాళ్ల సమక్షంలో సంవత్సరీకాలు ఏ అవరోధాలు లేకుండా — నిర్విఘ్నంగా — సజావుగా సాగిపోయాయి.

వర్ధనమ్మలో బాధ ఎంత అణుచుకుందా మనుకున్నా సరే అధికం అవుతుందే తప్ప తగ్గలేదు. మనవళ్లు ఆడుకుంటుంటే 'వాళ్లే నయం ఏ బాధా ఎరగని పసివాళ్లు' అనుకుని నిట్టూర్చింది.

రమేషు కొడుకు వంశీకృష్ణను దగ్గరకు తీసుకుని తన గుండెల్లో దాచుకుని అడిగింది — ''ఏంరా ! మీ తాతయ్య ఎక్కడికెళ్లారు ?''

''తాతగారు దేవుడి దగ్గరికి వెళ్లాలని నువ్వే చెప్పావుగా ! ఎప్పుడొస్తారు'' వాడు చక్రాల్లాంటి కళ్లు తిప్పుతూ ముద్దుగా అడిగాడు.

వాడికి తనేమని సమాధానమివ్వాలి ? 'రారు' అనడానికి ఆమె మనస్సు ఎందుకో ఒప్పుకోలేదు. నోటికి ఏదో అడ్డం పడ్డట్టయింది.

ఇంతలో రాజేషు కొడుకు జగ్గుగాడు రైలాట ఆడుకోడానికి లాక్కుపోయాడు వాడ్ని.

భారంగా నిట్టూర్చింది వర్ధనమ్మ. రాజేషు ఆమె వద్దకు వచ్చాడు. వెళ్లిపోతానని చెప్పడానికి వచ్చాడని అనుకుంది ఆమె.

''అమ్మా ! నువ్వు అలా ఏడుస్తూంటే మా గుండె తరుక్కుపోతోంది. నువ్వు బాధపడినా పోయిన మనుషులు తిరిగిరారు. ఆయనకేం అదృష్ట వంతులు. హాయిగా సకల గౌరవాలతో వెళ్లిపోయారు. కాని మనమే ఒంటరివాళ్లం అయిపోయాం. బ్రతికి నన్నాళ్లు రాజాలాగే బ్రతికారు'' సానుభూతి కురిపించాడు రాజేషు.

వర్ధనమ్మకు బాధ సాగలా మనసంతా కమ్మింది. రాజేషు ఆమెని ఊరుకోబెట్టాడు.

మళ్లీరాజేషు—''అమ్మా! నేను హైదరాబాద్‌లో ప్రస్తుతం ఓ అద్దె యింట్లో ఉంటున్నాను. అద్దె రెండువందలయాభైకు పెంచేసారు ఈ మధ్యనే. ఎన్నాళ్లని అద్దె యింటివాళ్ల మాటల్ని భరిస్తూ వుంటాం. అందుకే ఓ స్వంత ఇల్లు కట్టుకోవాలని ఆలోచిస్తున్నాను. అప్పుడే మా ఆఫీసు దగ్గర చిక్కడపల్లిలో సైట్ చూసాను కూడ ! దానికి ప్రస్తుతం రెండువేలు కావాలి. అవి నా దగ్గరలేవు ఎవర్నైనా అప్పు అడగడం నాకు ఇష్టంలేదు. అందుకే నీ దగ్గర అడుగుదామని వచ్చాను. నువ్వు నా మాటని కాదనకమ్మా !'' అర్థింపుగా అన్నాడు.

వర్ధనమ్మ గుండె కలుక్కుమంది.

''ఒరే! నాన్నగారి డబ్బు అది. ఆయన తతంగానికే అయిపోయిందే ! ఇంకెక్కడుంది. నీకు తెలుసుగా. నువ్వే ఖర్చుపెట్టావు'' అంది ఆమె.

''పోనీ ! నీ నగలు అమ్మేస్తే — ఆ వచ్చే డబ్బులో నాకు ఇవ్వగా మిగిలింది ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసేద్దాం'' సలహా యిచ్చాడు రాజేషు.

ఆమె హృదయ స్పందన హెచ్చింది. మనిషి ఉన్నప్పటికీ, లేనప్పటికీ ఉండే తారతమ్యం, ఇప్పుడు స్పష్టంగా ప్రతిబింబించింది.

''ఒరే నీకు నోరెలా వచ్చిందిరా — అవి...'' ఏదో చెప్పబోతూంటే వర్ధనమ్మకు అడ్డం వచ్చి —

''అమ్మా ! ఇప్పుడు అవి ఏం చేసుకుంటావ్ ? అనుభవించినన్నాళ్లు వాట్నే అనుభవించావు. వాటితో నీకింక పనిలేదు. పోనీ నువ్వు సరదాపడి పెట్టుకుందా మనుకున్నా లోకం వూరుకోదు. కనుక —'' మళ్లా ఆమె మొహంలోకి చూసి అన్నాడు రాజేషు.

కొడుకే అంత హీనంగా మాట్లాడుతూంటే వర్ధనమ్మ ఏం మాట్లాడలేకపోయింది.

ఇంతలో చిన్నకోడలు వచ్చింది.

''మీలో మీరు మంతనాలు జరిపించేసుకుని డబ్బుని కాజేద్దామని ప్లాను వేస్తున్నారు. మా ఆయనకు రావలసిన వాటా మాకు ఇప్పించండి. నగలు పెట్టుకున్నన్నాళ్లు సింగారించుకున్నారు కదా ! ఇప్పుడు అమ్మితే ఏం కొంప మునిగి పోతుంది ?'' రేణుక మాటలు వర్ధనమ్మ గుండెను తూట్లుతూట్లుగా పొడిచాయి. నిలువునా దహించుకు పోయింది ఆమె మనసు.

వర్ధనమ్మ లోపలికి వెళ్లింది. భర్త బీరువా లోని దంతపు పెట్టె తీసి తెచ్చి — టీపాయ్‌మీద పెట్టి తెరిచింది.

''ఒరే! ఇవి మీరు అమ్ముకుంటే నాకేం అభ్యంతరం లేదు. కాని ఒక్క విషయం గమనిం చండి. ప్రతి స్త్రీకి పడే శిక్షే నాకూ పడింది. ప్రతి ఆడదానికీ తొలగిపోయే సౌభాగ్యాలే నాకూ తుడుచుకు పోయాయి. కాని — నా మనసులో ప్రవహించే జ్ఞాపకాల వెల్లువ మాత్రం చెదిరిపోలేదు. అవి కలకాలం — స్త్రీ చచ్చేవరకూ వుండే మధురమైన స్పందనలు. ఇవి నగలు కావు. నా పవిత్రమైన గుర్తులు. ఒకప్పుడు నేనెలా జీవించానో — ఏం అనుభవించానో ప్రతి క్షణం గుర్తు చేస్తూ — నన్ను బ్రతికించే, అమర చిహ్నాలు. వీట్ని అమ్మేసి నన్ను నా మనసుని చంపేసేంత దారుణ మనస్తత్వం మీకుంటే వెంటనే తీసుకోండి. అమ్మేసి మీకు కావలసిన సౌఖ్యాల్ని కొనుక్కోండి'' వర్ధనమ్మ గుండె ల్లోంచి ఆవేదనగా ప్రతిధ్వనించిన ప్రతిమాట, ఒక్కొక్క భాష్ప బిందువుగా మారి దంతపు పెట్టెపైపడి ప్రతిఫలించాయి.

రాజేషు, రేణుక, ఇద్దరూ ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసుకుంటూ అచేతనంగా ఉండిపోయారు.

కొన్నిక్షణాల అనంతరం -


''క్షమించమ్మా ! నీ అంతర్యాన్ని గుర్తించలేక మూర్ఖుడిలా ప్రవర్తించాను. నాకే శిక్ష విధించినా తప్పులేదు'' రాజేషు తల్లి పాదాలపై పడ్డాడు.

రేణుక క్షమించమని ప్రాధేయపడింది. అప్పటికే గుమ్మం దగ్గరికొచ్చి అంతా విన్న రమేషుక్కూడా కన్నీళ్లు ఒలికాయి. ★


అంకితం

మా అందరికీ దూరమై మాకు గుండెకోత మిగిల్చిన మా నాన్నగారి ఆత్మకు శాంతి చేకూరాలని — ఈ కథను అంకిత మిస్తున్నాను.

— రచయిత




మీ స్నానమునందు ఒక క్రొత్తదనము నిచ్చు
సబ్బు - ప్రేమ్
క్రొత్త
సుకుమారమైన మీ చర్మ సౌందర్యమునకు ప్రేమ్.
దీని పరిమళము స్వచ్ఛమైన నురగ మీ శరీరమును ఆహ్లాదింపజేయును
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చు సబ్బు-ప్రేమ్.
NEW
Prem
REFRESHING SOAP
PREM
ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.
Imageads-M-AP-1527 Tel









సినిమా





'అత్తకు తగ్గ అల్లుళ్ళు'లో విజయశాంతి

"కలలు కనే కళ్ళు"

"చంద్రమోహన్, ప్రసాద్‌బాబు, నూతన్ ప్రసాద్, ప్రతాప్‌పోతన్, హరిబాబు, సాక్షిరంగారావు, వెంకటేశ్, మేనక, ముచ్చెర్ల అరుణ రమాప్రభ, నిర్మల, ఝాన్సి నటించే వినోదాత్మక చిత్రం," అన్నారు కథకుడు ఎం. బాలు. ఈయన తొలిసారిగా దర్శకత్వం వహించే శ్రీ అన్నపూర్ణ మూవీస్ వారి పై చిత్రానికి ఇటీవల పాటలు రికార్డయ్యాయి. వేటూరి, ఆరుద్ర, గోపీ గీతాలకు శ్యాం బాణీలు కూర్చారు. కాశీ విశ్వనాథ్ మాటలు, హరి ఛాయ, కె. ఎస్ రాజా కూర్పు, వెంకటేశ్ నిర్వహణలో ఆకురాజు రత్తయ్య, ముప్పాల సాంబశివరావు నిర్మాతలు. ఏప్రిల్ 13 నుంచి నెలరోజుల ఒకే షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది.

కృష్ణార్జునులలో కష్టే ఫలే!

అలసి సొలసి వస్తున్న కృష్ణ (శోభన్)ను చూసి, "ఒరేయ్, చూడ్రా ఎవర్ని తీసుకొచ్చానో!" అన్నాడు అర్జున్ (కృష్ణ). అతని వెనుక వాసంతి (శ్రీదేవి) కనిపించడంతో కృష్ణ చకితుడై, "వాసంతీ, నువ్వేలా వచ్చావమ్మా?" అన్నాడు.

"నీకోసమే వచ్చానన్నయ్యా! ఆ రోజేమో — నువ్వు డబ్బు లేదని ఉత్తరం రాశావు... అమ్మ కంగారు పడిపోయి, బంగారు తాతయ్యనిచ్చి పంపించింది... స్టేషన్లో దిగాక తాతయ్య ఏమయ్యాడో తెలీదు. ఇంతలో ఇద్దరు దొంగవచ్చినోళ్ళు వచ్చి 'మాకు అడ్రసు తెలుసు. మేం తీసుకెళ్తాం,' అని చెప్పారు... వాళ్ళు మోసం చెయ్యబోవడం, హీరో రంగంలోకి దిగడం, విలన్‌లని తన్నడం, హీరోయిన్‌ని సేవ్ చేయడం, ఆ తర్వాత చేరాల్సిన చోటికి చేర్చడం," అంటూ వాసంతి, అర్జున్ వంక చిరునవ్వుతో చూసింది. అతనికి కృష్ణ కూడా థాంక్స్ చెప్పి, "పోన్లేమ్మా. నిన్ను చూడాలనిపించింది. కల్లోకి వచ్చేశావ్," అన్నాడు.

పుటుక్కున "నాక్కూడా వచ్చింది కల్లోకి," అన్నాడు అర్జున్.

"ఏంటీ?" అన్నాడు కృష్ణ అయోమయంగా.


అర్జున్ తమాయించుకుంటూ, "ఆఁ... అదే మీరిద్దరూ కలిసి కల్లోకి వచ్చారు," అన్నాడు.

వాసంతి నవ్వుకుంటూ, "వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కురండి. అన్నం వడ్డిస్తాను," అంది.


"అన్నమా? ఆహా!" అంటూ అర్జున్ లొట్టలు వేశాడు.

కృష్ణ అదోలా చూస్తూ, "అక్కర్లేదమ్మా. తినేసి వచ్చాం," అన్నాడు.

"నాకు తెల్సులే మీరు తిన్నారో — లేదో! అయినా అన్నయ్యా, మీరు ఉద్యోగం చేయడానికి వచ్చారా, పస్తులు పడుకోడానికి వచ్చారా?" అంది వాసంతి.



'నిప్పులో చెలగాటం'లో కృష్ణంరాజు, శారద



'గోపాల కృష్ణుడు'లో

"తప్పదమ్మా.. అన్నం తినాలనుకున్నప్పుడు ముందు ధాన్యాన్ని బియ్యం చెయ్యాలి. ఆ బియ్యాన్ని వండాలి. ఆ తర్వాత తినాలి. అలాగే ఏదైనా తినాలనుకున్నప్పుడు ముందు శ్రమ పడాలి," అన్నాడు కృష్ణ.

"నువ్విలా బాధ పడ్తావనే అమ్మ రెండొందలు పంపించింది. ఒక వంద రూపాయలు పెట్టి ఇంటి సామాన్లు కొన్నాను. ఇంకో వంద ఇదిగో."

"ఉండమ్మా."

ఇంతలో అర్జున్ "ఇలాగివ్వండి. నేనుంచుతాను," అంటూ చెయ్యి చాపాడు.

"వద్దులెండి. ఫర్వాలేదు," అంటూ వాసంతి వెనుతిరిగి వంట గదికేసి వెళ్ళింది.

జయకృష్ణా ఆర్ట్ మూవీస్ "కృష్ణార్జునులు" చిత్రం త్వరలో విడుదలవుతుంది. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం : దాసరి నారాయణరావు నిర్మాత : జయకృష్ణ.

చక్రపాణి

కావిలిపాటి విజయలక్ష్మి నవల "చక్రపాణి"ని లక్ష్మీదీపక్ దర్శకత్వంలో చలం ఆర్ట్ ప్రొడక్షన్స్ వారు తెరకెక్కిస్తారు. గొల్లపూడి సంభాషణలకర్త. మార్చిలో పాటలు రికార్డవుతాయి. బి. ఎస్. చలం, డి. నరసింగరావు నిర్మాతలు.



నాగేశ్వరరావు, జయసుధ

విశేషాలు

-జి. వి. జి.

లంబు - జంబు

"మిస్ వెండ్‌హిల్ అనే ఆస్ట్రేలియా సుందరి మా చిత్రంలో నాయిక. నైజీరియా వాస్తవ్యులైన ఇద్దరు నీగ్రోలు విలన్‌లుగా నటిస్తారు. ప్రముఖ హైదరాబాద్ న్యాయవాదులు వరప్రసాదరావు, పేరి సుబ్బారావుగార్లకు కూడా కొన్ని కీలక పాత్రలున్నాయి," అన్నారు హీరో నరసింహరాజు. లోగడ ఈయన "ఇంటర్నేషనల్ ఫూల్స్" అనే ఆంగ్ల చిత్రాన్ని తీయదలిచారు. ఇప్పుడదే చిత్రాన్ని "లంబు జంబు" పేరున బి. ఎస్. రామస్వామి నిర్మాతగా ఎల్. జి. పి. ప్రెజెంట్స్ సంస్థ తెర కెక్కిస్తోంది. ఫిబ్రవరి 5న నరసింహరాజు, హాస్య నటుడు సారధి, ఎల్. ఆర్. ఈశ్వరి పాడిన విజయరత్నం గీతం దేవదాస్ స్వరకల్పన, ఎ.ఎ. రాజ్ ఆర్కెస్ట్రా నిర్వహణలో ధ్వనిముద్రిక చేయ బడింది. ఇది జయమాలిని, నరసింహరాజు, సారధిలమీద చిత్రీకరింపబడుతుందని డైరెక్టర్ రాజా పద్మనాభ తెలియజేశారు. [ఈయన సుప్రసిద్ధ దర్శక నిర్మాత బి. విఠల ఆచార్య పుత్రుడు]. రాజ్ బాబు, పద్మనాభం, వెంకన్నబాబు, కె. కె. శర్మ, కవిత ఇతర పాత్రధారులు. హెచ్. ఎస్. వేణు ఛాయ, పి. వెంకటేశ్వరరావు శిల్పం, బి. కందస్వామి కూర్పు, బాలకృష్ణ ప్రొడక్షన్‌తో మాదాస్ నరసింహారావు నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు,

మనసా కవ్వించకేలో చెల్లెలి ఆశయం

కిశోర్ (గిరిబాబు), ప్రతిమ (సంగీత), లక్ష్మి (శుభ) డైనింగ్ టేబుల్ వద్ద కూర్చొని ఫలహారాలు ఆరగిస్తున్నారు. కిశోర్ లొట్టలు వేస్తూ, "ఈ రోజు టిఫిన్ చాలా అద్భుతంగా ఉందోయ్! అందులోనూ ఈ అల్లం పచ్చడి ఉందే ... ప్స్!" అంటూ లక్ష్మి వంక చూశాడు.

భర్త తనను అనవసరంగా కాకా పడుతున్నాడని లక్ష్మికి తెలుసు. అందుకే "ఈ రోజు చేసింది నేను కాదు – మీ చెల్లెమ్మ," అంది.

వెంటనే కిశోర్ సమర్థించుకుంటూ, "అదే కదా! మనం చేస్తే ఇడ్లీలు ఇలా ఎందుకుంటాయ్? పేపర్ వెయిట్లలా వాడుకోవచ్చు," అన్నాడు నవ్వుతూ.

అన్నయ్య జోకను ప్రతిమ విన్నట్లు లేదు. "సరేగాని, అన్నయ్యా! నేను ప్రకటన్ కంటిన్యూ చేద్దామనుకుంటున్నాను. ఇంట్లో నాకేం తోచడం లేదు. నువ్వూ, వదినా ఒప్పుకుంటే, ఏదైనా ట్యుటోరియల్ కాలేజీలో చేర్తాను," అంది.

లక్ష్మి "దానికేం – నువ్వు సంతోషంగా ఉండటం కంటే మాక్కావలసింది మాత్రం ఏముంది? ఏమండీ, మాట్లాడరేం?" అంది.

"నేను ఈ పని చూశాక మాట్లాడతా. ఈలోపున నువ్వు మాట్లాడు," అన్నాడు కిశోర్ మెక్కుతూనే.

అతని అవస్థకు మరదళ్ళు నవ్వుకున్నారు.

సుప్రభాతా ఆర్ట్స్ "మనసా కవ్వించకే" చిత్రాన్ని మార్చిలో విడుదల చేయదలచినట్లు నిర్మాతలు కె. సాంబశివరావు, ఎ. జగన్నాధరావు తెలియజేశారు. శ్రీధర్, నరసింహరాజు, కవిత, రావి కొండలరావు, రాళ్ళపల్లి, జయభాస్కర్, కాకరాల, పొట్టిప్రసాద్, రాంబాబు ఇతర ముఖ్య పాత్రధారులు. జె. వి. రాఘవులు సంగీతం, ఆర్. మధుసూదన్ ఛాయ, అనంతరాం శిల్పం,



'మా ఇంటాయన కథ'లో సులక్షణ

వెంకటరత్నం కూర్పుతో పొట్టి నరసింహారావు నిర్వహణ బాధ్యతలు వహిస్తారు. "జనవరిలో ఏర్కాడ్ కొండల ప్రాంతంలో రెండు పాటలు పిక్చరైజ్ చేశాం," అన్నారు ఈ చిత్ర రచయిత, దర్శకుడు గోపీ.

స్టార్స్ ఇంటర్నేషనల్

కృష్ణతో విజయనిర్మల స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో "లంకెల బిందెలు" చిత్రాన్ని బాలకృష్ణ నిర్మిస్తారు.


'భక్త ధ్రువ మార్కండేయ' సెట్‌లో బాబు, దర్శకురాలు భానుమతీ రామకృష్ణ, శోభన



సినీస్కోప్

కన్నెబలి

"రక్తదాహంతో, కన్నెపిల్లల బలిదానంతో అతీత శక్తులను సాధించాలని సమాధి నుండి బయటపడ్డ భూతప్రేతాలు చేసే భీకర బీభత్సాన్ని భగవంతుని ప్రతిరూపంగా ఇలలో నిలచిన ఒక చర్చి ఫాదర్, ఒక పురోహితుడు, ఒక ఇస్లాం మతప్రవక్త సంయుక్తంగా ఎదుర్కొని తుదముట్టిస్తారు ... మాతృక మలయాళ చిత్రం. అత్యంతం ఉత్సుకతను రేకెత్తించే రీతిలో సాగే ఈ చిత్రం మన ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది," అన్నారు సునీతా పిక్చర్స్ వారి ఈ చిత్రాన్ని సమర్పించే పాత్రికేయుడు బి. ఎ. వి. శాండిల్య. కమలహాసన్, వాగేష్, సుభాషిణి, జ్యోతిలక్ష్మి, తాతినేని రాజేశ్వరి పాల్గొన్నారు. చక్రవర్తి సంగీత దర్శకుడు. మలయాళంలో మూడు హిట్ చిత్రాలను అందించిన కృష్ణకుమార్ ఈ "కన్నెబలి" చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించారు. "ఉగాదికి విడుదల చేస్తాం," అన్నారు నిర్మాత గోపాల్.



"మా డైరెక్టరుగారు సీను తీసేముందు విపరీతంగా ఆలోచిస్తారు"

అన్నపూర్ణా పిక్చర్స్ చిత్రం రెండవ షెడ్యూల్


"రెండవ షెడ్యూల్ ఫిబ్రవరి 18 నుంచి మార్చి 4 వరకు హైదరాబాద్‌లో జరుగుతుంది," అన్నారు దుక్కిపాటి మధుసూదనరావు. తొలి షెడ్యూల్ జనవరి 16 నుంచి ఫిబ్రవరి 7 వరకు అమరావతిలో జరిగింది. శరత్‌బాబు, జె. వి. సోమయాజులు, అల్లు రామలింగయ్య, సాయిచంద్, సురేష్, మాడా, సంగీత, సుమలత, విజయశాంతి, రమాప్రభ, సూర్యకాంతం పాల్గొంటున్నారు ముళ్ళపూడి వెంకటరమణ రచయిత. శ్రీ.శ్రీ., ఆత్రేయ గీతాలకు ఎం. ఎస్. విశ్వనాథం బాణీలు కూర్చారు. బాబాఆజ్మి ఛాయ, భాస్కరరాజు శిల్పంతో బాపు దర్శకుడు. కథా బలం, కథా విధానం గల అన్నపూర్ణా సంస్థ 16వ చిత్రమిది

జై జయంతీ మూవీస్


కృష్ణ, కృష్ణంరాజులతో నిర్మాత అశ్వినీదత్ జూన్‌లో ప్రారంభించే చిత్రానికి కె. రాఘవేంద్రరావు దర్శకుడు.

'జగన్నాధ రథ చక్రాలు'లో కృష్ణ, జయప్రద






త్వరలో
K. బాలచందర్
ముసలోడికే
దసరా పండుగ
dimple
DESIGNERS



ఇద్దరు కొడుకులు
దర్శకత్వం: కట్టా సుబ్బారావు
మైసూర్ ఉమాశంకర్ పిక్చర్స్
alpana
SREE PUBS



'కన్నె బలి'లో గౌరి



'చట్టంతో చెలగాటం'లో రాజేష్

సినిమా

జమున దర్శకత్వంలో తొలి చిత్రం

ఎందరో గొప్ప దర్శకుల చిత్రాల్లో నటించిన జమునకు దర్శకత్వశాఖ పట్ల మొదటి నుంచీ ఎంతో ఆసక్తి ఉంది. ఆ అనుభవంతోనే ఆమె దర్శకత్వంలోనే లోగడ "డాక్టర్ జమున" చిత్రానికి అంకురార్పణ జరిగింది. ఇప్పుడు చురుకుగా టి. వి. ఎస్. ప్రొడక్షన్స్‌వారు ఆ చిత్ర నిర్మాణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మార్చి మొదటి వారం నుంచి షూటింగ్ ఉంటుంది. హైదరాబాద్, విశాఖపట్నం ప్రాంతాలలో చిత్రీకరణ జరిగే ఈ చిత్రంలో కొందరు కొత్తవారికి కూడా అవకాశాలుంటాయి. శ్రీ.శ్రీ, కొసరాజు, సి. నారాయణరెడ్డి, ఆప్పలాచార్య గీతాలకు చక్రవర్తి బాణీలు కూర్చారు. టి. వి. సత్యనారాయణ నిర్మాణ పర్యవేక్షణలో ఎం. ఎస్. ఎ. రామకృష్ణానంద్ నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు. కొమ్మన కృష్ణమూర్తి చౌదరి, టి. వి. శ్రీనివాస్ నిర్మాతలు. మాడపాటి సరళాదేవి, వై. వి. వి. సత్యనారాయణస్వామి సహ నిర్మాతలు. వైద్య వృత్తిలోని గొప్పతనాన్ని చాటి చెప్పే ఈ చిత్రకథను డి. కామేశ్వరి రాయగా, సంభాషణలు గోపి రాశారు. ప్రధాన పాత్ర ధరిస్తూ జమున ఈ చిత్రాన్ని సమర్పిస్తారు కూడా.

క్రాంతికుమార్ కొత్త చిత్రం

"మార్చి 1న నేను మొదలెట్టే కొత్త చిత్రంలో కూడా చిరంజీవి, రాధిక హీరో హీరోయిన్లు," అన్నారు క్రాంతికుమార్. ఈయన ఈ మారు విజయభాస్కర్ అనే కొత్త దర్శకుని పరిచయం చేస్తున్నారు. సత్యానంద్, చక్రవర్తి, నవకాంత్, సతీష్ తెరవెనుక కృషి చేస్తారు. తొలి షెడ్యూల్ మార్చి 15 వరకు మద్రాసులో జరుగుతుంది. రెండవ షెడ్యూల్ ఏప్రిల్ 1 నుంచి 15 వరకు.

గోదావరి చిత్రవారి మంచు పల్లకీ

"మార్చి 15 నుంచి ఏప్రిల్ 15 వరకు హైదరాబాద్‌లో ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు వేమూరి సత్యనారాయణ ఈ ప్రాతికేయుడు సమర్పించే గోదావరి చిత్రవారి "మంచు పల్లకీ" చిత్రానికి ఎం. ఆర్. ప్రసాదరావు నిర్మాత. చిరంజీవి, నారాయణరావు, హరిప్రసాద్, సాయిచంద్, సాక్షి రంగారావు, పి.ఎల్. నారాయణ, సుహాసిని, అన్నపూర్ణ, కొత్త నటులు వి.వి. ప్రసాద్, ఎం. నాగేశ్వరరావు పాత్రధారులు. ఫిబ్రవరి 13-16 లోగా రాజన్–నాగేంద్ర స్వరకల్పనలో శ్రీ.శ్రీ., వేటూరి రాసిన నాలుగు గీతాలు రికార్డయ్యాయి. రాజశేఖర్ కథకుడు. యండమూరి వీరేంద్రనాథ్ సంభాషణలకర్త. చంద్ర శిల్పం, అనిల్ దత్తాత్రేయ కూర్పు, ఎం. వి. ఎస్. రెడ్డి సహకార దర్శకత్వం నిర్వహిస్తున్నారు. లోగడ పలు తమిళ చిత్రాలలో తన ప్రతిభావిశేషాలను కనబరచిన ఛాయాగ్రాహకుడు హరికి ఇది తొలి తెలుగు చిత్రం. అలాగే ఈ సంస్థ స్క్రీన్‌ప్లే రైటర్, డైరెక్టర్‌గా పరిచయం చేసే వంశీ కూడా లోగడ కె. విశ్వనాథ్, సింగీతం శ్రీనివాసరావు, భారతీరాజా లాంటి ప్రముఖ దర్శకుల వద్ద అసోసియేట్‌గా దాదాపు 15 చిత్రాలకు పని చేసి అనుభవం గడించారు. "నేటి యువతరం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యలు కొన్నింటిని ఈ చిత్రం కొత్త కోణంలో చూపిస్తుంది," అన్నారు నిర్మాత ఎం. ఆర్. ప్రసాదరావు.

రజనీకాంత్ హిందీ చిత్రానుభవం

"నా తొలి చిత్రం 'అపూర్వ రాగంగళ్'లో నటించే ముందు ఎంత గాభరా కలిగిందో — నా తొలి హిందీ చిత్రంలో నటించబోయే ముందు కూడా కలిగింది," అన్నారు రజనీకాంత్. "చట్టానికి కళ్ళులేవు" చిత్రాన్ని హిందీలో తాతినేని రామారావు దర్శకత్వంలో లక్ష్మీ ప్రొడక్షన్స్ అధినేత అట్లూరి పూర్ణచంద్రరావు నిర్మిస్తున్నారు. హేమమాలిని తమ్ముడుగా రజనీకాంత్ నటిస్తున్నారు. "ఫిబ్రవరి 3 ఉదయం ఆ చిత్రం ప్రారంభం. అంతకు క్రితం రాత్రి నా కంటికి కునుకు లేదంటే నమ్మండి. ఆ హిందీ పిక్చర్ గురించి ఆలోచనే. మొదటి షాట్‌లో హేమమాలిని నా చెవి పట్టుకులాగేటప్పుడు నేను చెప్పవలసిన డైలాగ్‌ను డైరెక్టర్ వినిపించినప్పుడు ఎక్కడ తడబడతానోనని జంకాను. ఫస్ట్ టేక్‌లోనే గట్టెక్కాను. అలా రెండు మూడు షాట్లు ఓ–కే అయ్యాక నేనూ హిందీలో ఓ–కే అయిపోయాను," అన్నారు రజనీ. ★

'కోరుకున్న మొగుడు'లో రూపాచక్రవర్తి, శోభన్‌బాబు, జయసుధ



భక్తాగ్రగణ్యుడు పదలాలిత్యప్రసిద్ధుడు బమ్మెర పోతనామాత్యుడు

బమ్మెర పోతరాజు గ్రామనామముగాక పురుషనామమో తెలియదు. తగినన్ని ఆధారములు లేనిదే దీని గురించి వ్రాయఁగూడదు గావున దీని విరమించెదము.

భాగవతాంధ్ర కవులు

ఈ క్రింది సంప్రదాయజ్ఞుల వలన విన్నంతవఱకు నా వలన ఇదివఱలో వివరింపఁబడిన గాథలు పై కథా సందర్భములకు వ్యతిరేకించనట్లుగా దిద్ది పునరుక్తి లేకుండఁజేసి వివరించెదము.

శ్రీనాథుడు కర్ణాటకునికి కృతి నిప్పింపవచ్చుట

[ఇదివఱలో నీ భాగవత గ్రంథమును కృతియిమ్మని రావుసింగన కోరినట్లు దానిం జేయకుంట కలిగి యాతఁడపకారము చేసెననియును జెప్పియున్నాము. అటువలెనే కర్ణాటక ప్రభుఁడుగూడ నీ భాగవత గ్రంథము తనకు కృతి నిప్పింప వలయునని కోరి తన మిత్రుండును, పోతనకు బంధువుఁడు నగు శ్రీనాథ కవిం బంపినట్లును, అతఁడు వచ్చునపుడు పోతరాజు వ్యవసాయము చేయుచు పొలము గట్టునఁ గూర్చుండఁగా 'హాలికులకు మీకుం గుశలంబె' అని యడుగుడుఁ బోతన యీ క్రింది పద్యంబు చదివినట్లును గలదు. ఎట్లన్నను :—

"ఉ. బాలరసాల సాలనవపల్లవ కోమలకావ్యకన్యకం
గూళల కిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి గహనాంతర సీమలఁ గందమూలకౌ
ద్దాలికులైననేమి నిజదార సుతోదర పోషణార్థమై."

అట్టిమాటకు శ్రీనాథుడు సమాధానము చెప్పఁజాలక నీవు పలికినది నిజమే. ప్రపంచములో ధనికునకు నే కొఱఁత యుండదు. 'ధన మూల మిదం జగత్' అని యుండలేదా! బ్రతికి యున్నంతవఱకు నింత యన్నముం బట్టయుఁ గలిగి యుండవలెఁగదా! నీ కంత యిష్టమున్న మఱియొక కృతి దేవునకిమ్ము. ఇప్పుడు నా పలుకాలించి నీ భాగవతంబుఁ గర్ణాట మహీపాలునకుఁ గృతి యొసంగి సంపదల నందుము. దీనికి మాఱుపలికిన నా మాటకుఁ దప్పినట్లు దలంచెద. అనుడు పోతన శ్రీనాథుని నిర్బంధ వాక్యముల కేమియుఁ బ్రతివచనం బీయ నోరాడకుండటంజేసి యూరకుండె. దాని నంగీకారసూచకంబుగ భావించి శ్రీనాథుండు కర్ణాట మహీశుని కడకరిగి పోతన వృత్తాంతం బంతయుఁ దెలిపి భాగవతంబునకుఁ గృతిపతివిగా నీవ తగుదని తెల్పి పోతన కవనంబు గొనియాడి యాతని పదలాలిత్యంబు విన్నను నీ పదలాలిత్యం బాతని సంతుష్టుఁ జేయునని తలంచెదననియె. రాజును శ్రీనాథు పలుకులకు సంతసిల్లి వల్లెయనియె.

పోతన చింత

అంతఁ బోతన శ్రీనాథు పల్కులు మనంబునం దలపోసి యిట్లు చింతించె. అయ్యయో యిది యేటి వృత్తాంతంబు! కర్ణాటునకుం గృతి యొసఁగుమని ఎన్నితండు ప్రేరేపించెడిని. నే నెటుజేసిన నీతని కేమాయె. నీతం డీవృత్తాంతమంతయు గర్ణాట మహీధవునకుఁ దెల్పియుండవోవు. అతఁడు కృతిఁ దెమ్మన్న నే నెట్లు దెత్తు. అటుగాకున్న నేమి చేటు వాటిలునో బుద్ధి జాడ్యంబునం జేసి స్వాభిప్రాయంబు తేటపడం బల్కనైతి. ఇట్టి బుద్ధి మాంద్యము గలవానికిఁ జిట్టులు తప్పక రావలయు. అని తన్ను నిందించికొనుచు నేమియుఁజేయఁ జేయాడకున్న నాకవోఁ గూర్చుండి యుండి కనులు మూసె. అంతఁగమలపాణి యగువాణి కన్నీరు వఱదలై పాలిండ్లు నేదుచుఁ గాన్పించె. పోతన యాపె కమలభవుని రాణిగ నెఱింగి రోదనము సేయుటకుఁ గతిం బూహించి స్వాపరాధంబ దానికిం గారణంబని యెంచి యద్దేవిం గాంచి యిట్లనియె :—

"ఉ. కాటుక కంటినీరు చనుకట్టుపయిం బడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల యోమదంబ యో
హాటకగర్భురాణి నిను నాఁకటికిం గొనిపోయి యల్లక
ర్ణాట కిరాట కీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ."

అని పల్కి యాపై నూరార్చి నాటనుండియుఁ గర్ణాటునకుం గృతి నిచ్చు తలంపు మానియుండెనఁట.

కర్ణాట ప్రభుఁడు వచ్చుట

ఇట నొక్కనాఁడు కర్ణాట మహీజాని భాగవత నామంబుఁ దలంచి యిట్లు చింతించె. బహుదినంబులాయెఁ బోతన భాగవతంబుఁ దెనిఁగించుచుండెనని వింటిమి. ఇంతకు నాతండు రాకుండుటకుఁ గారణం బేమి. మృగయా వినోద మిషంబున నతండుండు దేశంబునకుఁ బోయి వత్తుఁగాకయని బయలువెడలి యాతని యూరుసేరి యాతనిం బిలువ దూతంబనిచె. అత్తఱిఁ బోతనామాత్యుండు భాగవత తృతీయ స్కంధంబున శ్రీ యజ్ఞవరాహావతార ఘట్టంబు దెనిఁగించుచుండె. భక్తపరాధీనుండగు నారాయణుండు పోతనతో నెల్లప్పుడు లీలావినోదంబులఁ గాలంబు గడుపుచుండుఁ గావున వర్ణిత వరాహ రూపంబున నచ్చో విహరించుచుండె భూవిభుని బంట్లు వచ్చిన వృత్తాంతమంతయు నెఱింగి యా దేవుండు భక్త రక్షణార్థంబు తద్గృహోపరిభాగంబున సూక్ష్మగాత్రంబునఁ గూర్చుండియుండె. భటకోటి లోనికేఁగ నమర్త్యుకులగుచుఁ దనదేహంబు హుంకార ధ్వనితోఁ బెంచి వారి నదల్చిన నా రాజకింకరులు తమ యొడయని కడ కేఁగి సంప్రాప్త మగు సంకటిఁ దెల్ప నాతండు శంకితుడుగుండని భయంకర సేనాపరివృతుండై చని కిటి స్వామిం గని సామాన్య వరాహంబని యెంచి పందికై యిటు భయమందనేల? చూడుఁడు. నే నిపుడ దీని మడియింతు. అని తన సేనాముఖం బురికొల్పి పొడువుఁడు పొడువుఁడు చంపు డంపుఁ డనుచు వెంట నంటె. అంత నా క్రోడంబు సక్రోధంబై కన్నుల నిప్పులొలుక వారినందఱఁ దనకోప పావకునకు సింధపీభూతులఁ జేయఁదలంచి విజృంభించి దంతిహతి నరాతిచమూపతుల నింతింతలు తునియలుగ విదారించి పొట్టఁ జించి మించె. ఇట్లుండఁ బాలికలనిం గాంచి యా రాజిట్లు చింతించె. ఏమీ యీ యద్భుతంబు! ఇక్కిటి యొక్కటియె మదీయ సేన నుక్కడంచె. నే నొక్కండ దీనిని చక్కఁజేసెదనని మిక్కుటంపు కోపంబున దిక్కరింపుచు నస్త్రశస్త్రంబుల బరికించుచో నయ్యాదివరాహం బవార్యతర శౌర్యంబున మాఱులేని విహారంబు సల్పుచు ధరఁ బొరియఁగఁ ద్రవ్వుచుఁ జెలరేఁగియుండె. దానిం జూచి రాజు కన్నులు మిఱుమిట్లుగొన శరీరంబు కంపింప నిశ్చేష్టితుండయ్యె. ఇట్లుండి కొంత తడవునకుఁ దెలిసి యిది యంతయుఁ బోతనామాత్య ప్రభావ ప్రకటనంబునకుఁగా నాతని యిష్ట దైవంబు చేసిన చేఁతగా నెఱింగి యపరాధంబు సేసితినని పోతనను దనమది నెంచి యపరాధ క్షమయని నమస్కరించె. అంత నా వరాహం బంతర్ధానంబు నొందె. ఆ రాజేంద్రుం డామంత్రిశిఖామణి కడకుం జని యాతని యడుగుఁ దమ్ముల కెఱఁగి కర్ణాటుండ దీనుండ రక్షింపుఁడు. అనుఁడు పోతన యాతనిం గ్రుచ్చియెత్తి యాతని వృత్తాంత మడిగిన నాతం డిట్లనియె. "తెలుపకురా వెడదన"ట్లు నిను నవమానింపఁదలంచి నేన యాపదల పాలైతి. సర్వబలంబులు నశించె. నీ వాకిటికిటి నా కిటుల నగునటుల నొనర్చె. ఇది యంతయు భవదీయానుగ్రహాతిశయంబుచే నివారితంబు గావలయు. అను పృథ్వీధవు పల్కులాలించి కించిత్తాలోచించి భగవత్కృతంబని యెఱింగి యవమానంబునకు నగవకుమని యా రాజు నోదార్చి యిట్లనియె. నీకు సర్వంబును మంగళంబగు. రమేశు ధ్యానింపుమఁ గాలంబు గడుపు మనుఁడు నాతండు శ్రీ హరిని తన హృత్సరసిజంబున నిల్పి ధ్యానింపుచుఁ బోతనామాత్యు మాహాత్మ్యంబు దలంచుచు నాయిలు వెడలె. అపుడు మోహనాస్త్ర విముక్తుల భంగి వింగిముట్టఁ గోలాహలస్వనంబు సేయుచు భగవదనుగ్రహదత్తంబులై యతని సేనలుండ నాతండు కొలఁదికి మీఱిన సంతసముఁ బొంది తన యూరు సేరెనట.

భగవద్దర్శనము

అనంతరము పోతనామాత్యుండు భగవద్భక్తి యుక్తుండై చతుర్థాది స్కంధంబులఁ దెనిఁగించి యష్టమ స్కంధంబున గజేంద్ర మోక్షణంబు వ్రాయుచు నందు గజేంద్రుండు స్వామిని రక్షింపుమని పలుకఁగ నా వచనంబులు

వైకుంఠ నాథుండారించె నెమకో "అల వైకుంఠపురంబులో నగరిలో నా మూల" అని నుడివె. అంతట నేమియుం దోచకుండె. అపుడు తన కూఁతుం బిలిచి తా వ్రాయుచున్న పొత్తం బాపె చేతికిచ్చి యిది వచ్చెదనని యొక నిర్జన ప్రదేశంబునకుం జని తొంటి వాక్యంబ మరల నూహించుచుండె. ఇట పోతన యిష్టదైవంబు తద్రూప ధారియై యాతని గృహంబునకుం జని పోతన కూఁతుం బిలిచి పుస్తకము దెప్పించి యందున్న యసంపూర్ణ వాక్యంబు నూఁది "సౌధంబుదాపల" అని వ్రాసి దాని నాపె కొసంగి తా నంతర్ధానంబు నొందె. పోతనకు రహస్య స్థలంబున నీ వాక్యంబ స్ఫురింప నైశంబుగ నిలుసేరి తన పొత్తంబు మరలఁ గైకొని యందున్న స్వమనోగోచరార్థంబుఁ జూచి యత్యాశ్చర్యంబునఁ గూఁతుఁ బిలిచి దానియం దెవ్వరు వ్రాసియుండిరని యడిగె. అనుడు నాపె 'నీవకదా యింతకు మున్నిటకు నేతెంచి వ్రాసియుంటివి.' అనినం గూఁతు పల్కులు విని కొంత తడవు చింతించి యిట్లనియె. అమ్మా నీ పుణ్యం బెంతయు శ్లాఘనీయంబు. నీ కగపడిన మత్స్వరూపధారుం డాత్మారాముండగు రాముండుగాని యేగాఁడు. అని తెల్పి ప్రచ్ఛన్నుండై తన వెనువెంట నంటి తిరుగుచుండినంత తండ్రికి మ్రొక్కి ప్రసన్నుండగుడుగా కవి సంతసంబున నా పద్యంబు పూర్ణంబుసేసె. పిమ్మట నా స్కంధంబును ముగించెను.

శ్రీనాథునియాక్షేపము

అంత శ్రీనాథుం డొక దినంబున మరలఁ జనుదెంచి పోతన వ్రాసిన యష్టమ స్కంధముఁ జూచి యందున్న

"మ. సిరికిం జెప్పఁడు శంఖచక్ర యుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్కనొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై."

అను పద్యంబుఁ జూచి పోతనం బిలిచి బావా నీ పద్యంబు సమ్మతంబు గాకున్నది సుమీ అని యిట్లనియె. సిరికిఁ జెప్పఁడు. శంఖ చక్రములఁ బట్టఁడు. తదితర సాధనముల ముట్టఁడు. ఊరక గజేంద్రుం గావ విష్ణుండరిగెనని వ్రాసితివి. అతండు పరికర రహితుండై యేమిసేయం జనె. ఇట్లు వ్రాయుటం జేసి నీ వ్రాఁత యుక్తి యుక్తముగ నుండినట్లు గానరాదు. అనుడుఁ బోతన యిట్లనియె. భక్తావనుండగు శ్రియఃపతి అట్లు పరితాపంబు పొలఁగుట భక్తులయెడఁ దనకుండు కారుణ్యంబు జూపుటకే కదా. ఇదియ నాకుంబోలిన యర్థంబు. సహేతుకంబు గాకున్న భక్తికిం గొదువయేమి. అనుడు శ్రీనాథుం డూరకుండె. మఱికొన్ని దినంబులైన తర్వాతఁ బోతనామాత్యుండు తన మనంబున శ్రీనాథుండు శ్రీనాథు నాడిన నాఁడిమాటలవేఁడిమి సహింపలేక యథార్థం బాతనికి గోచరం బగునట్లొనరింపఁ దలంచి యాతని పుత్త్రుని దాచి బావా నీ కొడుకు నూతం గూలెనని తెల్పె. శ్రీనాథుం డా పల్కులు విని మనంబునఁ గలఁగి దిగ్గనలేచి కళవళపడి యెచ్చటెచ్చట నని విలపించుచుఁ బరువులిడఁ దొడంగె. దానిం జూచి పోతన యాతనితో నిట్లనియె. ఓయీ నిలు నిలుము. ఊరక చనెదవేమి. త్రాడేది నిచ్చెన యేది. ఇట్లు విలపించుచుఁ జని నీవు నందుఁ గూలుదువు గాబోలు. అని యడ్డంబువచ్చి నిలిచిన శ్రీనాథుండు పోతనతో నిట్లనియె. వేగంబునఁ జనినన్నా క్షణమిం గననిమ్ము. కన్నారంజూచినఁ గొంత శాంత మూను. అనునాతనిం గాంచి పోతన యిట్లనియె. బావా జడియకుము. నీ కుమారుండు నూతం బడలేదు. గజేంద్ర రక్షణంబునకు నార్తావనుండగు శ్రియఃపతి యిటులనే పరితాపంబు నొందె. నీ వసమర్థుండవయ్యుఁ బరికర రహితుండవయ్యు మిన్నక చూచినంతనే కర్జంబగునని తలంప నఖిల లోకాధీశ్వరుండగు కరివరదుం డూరక యచ్చోటి కరిగినఁ గొఱఁత యొక్కటి గలదే భక్తులయెడ భగవంతునకుం గల ప్రేమ జనులకును నీకును గోచరంబుగా నే నట్లు పలికితి. నీవు వాగపరాధం బొనర్చితివి. కావునఁ బశ్చాత్తప్తుండవై యా హరి శరణంబు వేఁడుమని నిజ నివాసంబునకుం జనియె. ఇట్లనేక సమయంబులఁ బోతనామాత్యుండు భగవన్మాహాత్మ్య ప్రకటనంబు సేయుచు భాగవతంబుఁ దెనిఁగించి భగవదర్పణంబు సేసె. ఇందీతండు శివపరాత్పరత్వము చెప్పకుంటంజేసి వాగ్దోషంబు సంభవించెననియుఁ దద్దోష పరిహారార్థంబు వీరభద్ర విజయంబను నొక గ్రంథంబు వ్రాసి తత్పాపంబు పాసికొనెననియుం గలదు. ఇటీవల నా వలనఁ జేయంబడిన "వీరభద్ర విజయ వివేకము" అను నొక దీర్ఘోపన్యాసములో భాగవత గ్రంథకర్త ఆ గ్రంథకర్త కాఁడని సిద్ధాంత మాయెఁ గావున బాతకులీ వ్యాసాంతమందుఁ బొందుపఱచి యుంచిన 'వీరభద్ర విజయ వివేక'ముం జదివి తమ సందియములు వారువఁ గోరెదను. భక్తాగ్రగణ్యుండగు నీ పోతనామాత్యుండు సరళాలిత్యంబునకు మిగులఁ బ్రసిద్ధుండు. ఇట్టి కవికృత గ్రంథంబునఁ గొన్ని స్థలంబుల నితని కవనంపు జాడలఁ జూడ నోడుదుము. అట్టివట్లు రచించిన వాఁడితం డౌనాయని శంక వొడమెడిని. అతుక నిష్కళంకముసేయు నొక వృత్తాంతంబు గలదు. దానిఁ గ్రింద వివరింతము.

పోతన భాగవతముం దాఁచుట

ఈ కవి యాంధ్ర భాగవతంబు పూర్ణంబుసేసి యది యైహిక సుఖేచ్ఛాపరులగు పామరులకు వర్జ్యంబైన వేదాంతార్థంబుల గౌరవంబు సెడునని యెంచి ప్రచురింపక పరమార్థులగు ముముక్షు జనుల వెదుకుచు నుండె. ఇట్లుండ నిర్యాణ సమయం బగుడుఁ దనకుమారుండగు మల్లనను రావించి యతనికి నఖిల రహస్యార్థ ప్రతిపాదకంబగు స్వకృత భాగవతం బిచ్చి దానిని సాధన చతుష్టయ సంపన్నులగు ముముక్షువుల కర్పణీయంబగు నట్లొనరింపుమని తెల్పి తాఁ బరమపద ప్రాప్తుండయ్యె. అంత మల్లన పితృవాక్య పరిపాలనేచ్ఛాపరుండై తదర్హ జనాన్వేషణంబు సేయుచు దానిఁ బేటికాంతర్గతంబు సేసి దేవతార్చనావితర్ది సమీపంబున నుంచి సముచిత భక్తిఁ బూజించుచుండె. అనంతర మాతండు తనకును గాలవశం బగుడు నాత్మసఖుండును సహాధ్యాయియునగు వెలిగందల నారయ కవిం బిలిచి రహస్యంబుగఁ దన పైతృకధనంబుఁ గొమ్మని దేవతార్చన పూర్వకంబుగ నా పేటిక నిచ్చి తా లోకాంతర గతుండయ్యె ... పిమ్మట నారయ తన గురు ధనంబు నారయ దానిం దీసి యందుఁ జీనాంబరముల పరిశిథిలంబు నొందియున్న జీర్ణభాగవతంబుఁ జూచి యది స్వగురు ప్రణీతంబ కాఁ దెలిసి శైథిల్యంబు నొందుట కెంతయు డెందంబునఁ గుంది దానిఁ గట్టి మరల నొకచోఁ బెట్టియుంచి నాఁటి రేయి దానిం గూర్చి చింతింపుచు నిద్రింపఁ బోతనామాత్యుం డాతనికి స్వప్నంబునఁ గన్పించి యిట్లనియె. ఓయీ దీని నే నింతకు లోకంబున వ్యాపకంబు నట్లొనరింపకుండుటం జేసి యీ గతి వగవ వలసివచ్చె. ఇపుడు విచ్ఛిన్నంబులైన ఘట్టంబుల నట్లింపు దోఁప సంపూర్ణంబుసేసి పూర్ణంబ దీని జగద్వ్యాపక మగునట్లొనరింపుమని తిరోహితుండయ్యెన, నారయ మేల్కాంచి స్వప్నంబు తెఱంగు పోతనామాత్య శిష్యులకుఁ దెల్పె. వారును నాతనిం గూడి దానినంతయు సంపూర్ణంబుసేసిరి. ఇది కొందఱి మతము. ఇందుఁ గొంతపూర్వపక్ష మాయెను దానిని మఱియొకచోఁ దెల్పితి.

పోతన కవనంబును శిష్య కవనంబును

పోతనామాత్య కవనంబునకుఁ దచ్ఛిష్య జన కవనంబునకుఁ గల భేదంబులు సమాన వర్ణనలున్న తావులఁ గొన్ని కొన్ని పద్యంబులఁ జూచిన గోచరంబగు. దీనికిఁ దార్కాణంబుగ సప్తమంబునఁ బ్రహ్లాదుని పద్యము.

"సీ. మందార మకరంద మాధుర్యమునఁ దేలు, మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికలఁ దూఁగు, రాయంచ సనునె తరంగిణులకు
లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు, కోయిల సేరునే కుటజములకుఁ
బూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక, మరుగునే సాంద్ర నీహారములకు
తే. నంబుజోదరు దివ్య పాదారవింద, చింతనామృతపాన విశేష మత్త
చిత్త మేరీతి నితరులఁ జేరనేర్చు, వినుత గుణశీల మాటలు వేయునేల."

ఇది పోతనామాత్య కవనంబు. తచ్ఛిష్యకృతంబగు దశమోత్తర భాగంబున రుక్మిణితోఁ గృష్ణుండు సరసోక్తులాడిన యనంతరము శ్రీకృష్ణుఁ డాపెను దేర్చియుండ ననంతర మాయమ శ్రీకృష్ణు నుతించుతఱి పద్యము:

"సీ. నీరదాగమ మేఘ నిర్యత్పయః పాన, చాతకం బేఁగునే చౌటిపడెకు
పరిపక్వమాకందఫలరసంబులఁ గ్రోలు, కీరముల్ చనునె దుత్తూరములకు
ఘనరవాకర్ణనోత్కలికమయూరము, లొరునె కఠిన ఝిల్లీరవంబు
కరికుంభ పిశితస్వాద సమోదిత సింహ, మరుగునే శునక మాంసాభిలాషఁ
గీ. బ్రవిమలాకార భవదీయ పాదపద్మ, యుగ సమాశ్రయ నైపుణోద్యోగచిత్త
మన్యుఁ గోరునె తన కుపాస్యంబుగాఁగ, భక్తమందార దుర్భవభయ విదూర."

[కీ. శే. గురుజాడ శ్రీరామమూర్తిగారి "కవి జీవితములు" నుంచి]

తార

శ్రీమతి–కళ్యాణి

సీరియల్

1948-1949 !

(గత సంచిక తరువాయి)

పోలీసుల దూకుడు మరీ ఎక్కువై పోయింది. కనిపించిన వాడ్ని కనిపించినట్లే కాల్చేస్తున్నారు. అనుమానం వచ్చిన ప్రతివాడినీ పట్టుకుని జైల్లో పెట్టటం !

అందితే పట్టుకోవటం !

అందకపోతే కాల్చేయటం !

'వాళ్ళతో పరిచయాలు ఉన్నవాళ్ళు !' అని ఏమాత్రం తెలిసినా— వాళ్ళ ఆచూకీలు తెల్పమని వేధించటం, చిత్రహింసలు పెట్టటం— ఓహ్ ! ప్రత్యక్ష నరకంలాగా ఉంది !

ఉదయమవుతున్నాది అంటే పేపరులో ఏవార్త చూడాలో అని భయం ! రాత్రి అవుతున్నాది అంటే ఎవుడు ఏ ఆర్తనాదం వినిపిస్తుందో, ఎవరు ఏకబురు మోసుకొచ్చి వినిపిస్తారో అనే ఆందోళన ! ప్రతి వారి గుండెలూ గుప్పెట్లలోనే ఉన్నట్లుగా ఉంటున్నాయి !

వెంకట్ మాఇల్లకు వచ్చేసాక ఒక ఇరవై అయిదు రోజులపాటు ఏ గొడవలూ లేకుండా సాఫీగా జరిగిపోయింది ! ఇంక ఎప్పుడూ అలాగే సాఫీగా ఉంటే వెంకట్‌ను విప్లవ నాయకుడని ఎలా అనగలం?

ఒకరోజు సడెన్‌గా పోలీసులొచ్చిపడ్డారు !

కడిగిన గొడ్లను తోలుకొస్తున్నాడు గురవడు. చెరువులోంచి పైకి వచ్చి గట్టుమీద నడుస్తున్న గురవడు అల్లంత దూరంలో ఉన్న కోమటి కొట్టులో బీడీలు కొంటూ వెంకటరత్నం ఇంటిని గూర్చి వాకబు చేస్తున్న పోలీసుల్ని చూసాడు.

అంతే ! ఒకే పరుగు తీసాడు ! రొప్పుతూ, రొజుతూ వచ్చిన గురవడ్ని చూసి ఆశ్చర్యపోయాడు వెంకట్. అతను ముందర వరండాలో స్వప్నతో ఆటలాడుతున్నాడు.

"చినబాబూ, చినబాబూ ! పోలీసోళ్లు ఒస్తున్నారు బాబూ," ఆయాసంతో మాటలు కూడా సరిగ్గా రావటంలేదు.

"ఇదిగో, స్వప్నను లోపలకు తీసుకురా."

మిటనొక్కినట్టుగా లేచి లోపలకు వెళ్ళాడు వెంకట్.

మరోపది నిమిషాల్లో పోలీసులు ఇంటి ముందరకు వచ్చేసారు.

సత్యవతమ్మ వెనుక వరండాలో స్వప్నను కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పించుకుంటున్నాది. గిరిజ పాపకు పౌడరు వేస్తున్నాది. దమయంతి బియ్యం ఏరుతున్నాది. రేణుకను కాళ్ళమీద కూర్చోబెట్టుకుని నీళ్ళు పోస్తున్నాది తార.

తార చేతిలో నీళ్ళు పోస్తున్నది అవ్వ. గురవడు పాలు తీస్తున్నాడు. రంగడు దొడ్డి అంతా ఊడుస్తున్నాను.

ఇల్లు అంతా తుఫానుకు ముందర వాతావరణం లాగా ఉన్నది !

లోపలకు వచ్చారు, పోలీసులు !

"వెంకటరత్నం ఎక్కడ ?" అని మనిషి మనిషినీ అడిగారు. ఎవరికి వాళ్ళు తాపీగా తమకు తెలీదని చెబుతూంటే పోలీసులు అసహనంతో చిందులు వేసారు.

ఇల్లంతా వెదికారు !

"మాకు దొరక్కుండా ఎంతకాలం దాక్కుంటాడో చూస్తాం" అంటూ వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిన పదినిమిషాలకు 'హమ్మ వెళ్ళిపోయారులే' అని ఖచ్చితంగా అనుకుంటూన్న సమయంలో వెంకటేశ్వరరావు ఖంగారు ఖంగారుగా లోపలకు వచ్చాడు.

సత్యవతిని చూస్తూనే హడావుడిగా అడిగారు— "అత్తయ్యా ! వెంకట్ ఏడి ?"

"ఎందుకురా?" నవ్వుతూ అడిగింది.

"నేను వస్తూంటే పోలీసులు ఎదురొచ్చారు. ఒకవేళ వీడికోసమే అయివుంటుందని .." వెంకటేశ్వరరావు మాట పూర్తికాకుండానే, నవ్వుతూ చేయి చాపి, తార చేతి మీద నీళ్ళుపోస్తూన్న అవ్వను చూపిస్తూ "అడుగో మీ వెంకట్" అంది దమయంతి.

తలమీంచి కప్పుకున్న తెల్లచీర ముసుగును తొలగించి, నవ్వుతూలేచి వస్తూన్న వెంకట్‌ను చూసి ఆశ్చర్యంలో నోరు తెరిచాడు వెంకటేశ్వరరావు.

ఇలాటి సంఘటనలు రామరామా చాలా మామూలు అయిపోయాయి ! మొదట్లో ఇరవై రోజులకూ, పదిహేను రోజులకూ వస్తూన్న పోలీసులు ఇపుడు వారం వారం అన్నట్లుగా వస్తున్నారు.

ఒకసారి వచ్చినపుడు అంట్లు తోముతూన్న గురవడ్ని లేపి, ఆదరా బాదరా చీర చుట్టుకుని కూర్చున్నాడు.

మరోసారి గొడ్లచావిడిలో పిడకల అటకపైన ఎక్కి దాక్కున్నాడు.

అది జరిగిన మూడు రోజులకే మళ్ళీ వచ్చారు పోలీసులు.

ఈసారి ఉదయం ఎనిమిది గంటలు కూడా కాలేదు. అపుడే వచ్చేసారు.

ఆ సమయానికి వెంకటరత్నం చెంబు తీసుకుని కాలువ గట్టు వైపుకు వెళ్ళాడు. సాధారణంగా

జరిగిన కథ—14 రాఘవయ్య, నాగరత్నం దంపతులకు తార, సరళ—రామారావ్, రామ్మోహన్, చంద్రం సంతానం. కమ్యూనిస్టు పార్టీ ప్రముఖులలో ఒకడుగా పేరు తెచ్చుకుంటాడు వెంకటరత్నం. శ్రీనివాసరావ్‌తో కలసి ప్రసాద్ పెళ్ళికి వెళ్ళిన వెంకటరత్నం మదిలో 'అనుకోని సంఘటన' ద్వారా ముద్రవేసుకొంటుంది తార. ఎవరెన్ని విధాల నచ్చజెప్పినా వినక వెంకటరత్నాన్నే పెళ్ళి చేసుకొంటుంది తార. భర్తపైన ఉండే గౌరవంకొద్దీ అతను పంపే ఉత్తరాలతోపాటు పార్టీ పుస్తకాలు కూడా చదువుతూ ఆనాటి రాజకీయాలను అవగతం చేసుకొంటుంది తార. బెజవాడలో జరగబోతున్న మీటింగులకి వెళ్దాం రమ్మని తారకు ఉత్తరం ద్వారా తెల్పుతాడు వెంకటరత్నం. తండ్రి వెళ్ళొద్దని వారించినా వినక ఎన్నో బాధలకోర్చి అతన్ని కలుసుకొంది తార. రాఘవయ్య నిరాదరణతో వెంకట్ వెంట వచ్చిన తార అత్తగారింటి పరిస్థితుల్ని అవగాహన చేసుకుంటుంది. ఉత్తరం ద్వారా తార గర్భవతి అని తెలుసుకొన్న రాఘవయ్యగారు పరమానందభరితులై, రెండు మూడు రోజుల్లో వచ్చి చూస్తానని చెబుతారు. పురిటికి పుట్టింటికి వెళ్తుంది తార. కూతురి పేరు 'స్వప్న' అని పెట్టుకొంటాడు వెంకట్. చదువు కోసం గుడివాడ వెళ్ళిన కళ్యాణి పార్టీలో పనిచేసే సీతారామయ్యని ప్రేమించి అతన్నే పెళ్ళి చేసుకొంటానని ఖచ్చితంగా ఇంట్లో చెప్తుంది. సత్యవతమ్మ గొడవచేస్తుంది. ఎలాగైతేనేం సత్యవతమ్మను నచ్చించి కళ్యాణిని సీతారామయ్య కిచ్చి వివాహం చేస్తారు. గుడ్లవల్లేరు ఫిర్కాకు పార్టీ కార్యదర్శిగా వెంకట్‌ను నియమించడంతో తన కుటుంబంతో అక్కడ కాపురం పెడ్తాడు. తారకు ఈసారి మళ్ళీ ఆడపిల్లె పుడ్తుంది. ఆ పాప పేరు 'రేణుక' అని పెట్టుకొంటుంది. తను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకొనడంతో ఏం గొడవ చేస్తుందో అనుకొన్న వెంకటరత్నం తార మనసులోని మాట తెలుసుకొని అభినందించకుండ వుండలేకపోతాడు. ప్రకాశం మంత్రివర్గం ఏర్పాటయిన తరువాత కమ్యూనిస్టుపార్టీని నిషేధించింది. తత్ఫలితంగా వెంకట్‌ను పట్టుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తుంటుంది పోలీసుశాఖ. అతనిప్పుడు పూర్తిగా వేషం మార్చేసి తప్పించుకు తిరుగుతుంటాడు. తన కాపురాన్ని పుట్టింటికి మార్చేస్తాడు వెంకట్. మరో విప్లవ నాయకుడు సుబ్బారావ్ భార్య స్వరాజ్యం తనతో అసభ్యంగా ప్రవర్తించిన పోలీసువాళ్ళపై ప్రతీకారచర్య తీసుకొంటుంది.

ఉదయం పూట అట్లా వెళ్ళిన వెంకట్ గడ్డికోసంగా వెళ్ళే గురవడికి చెంబు ఇచ్చేసి, స్నేహితులతో కబుర్లు చెబుతూ ఎనిమిది గంటలయితేగానీ ఇంటికి రాడు. ఆరోజు కూడా చెంబుని గడ్డివాము దగ్గర పడేసి, చెరువు గట్టుపైన స్నేహితులతో కబుర్లు చెబుతూ వేపపుల్లతో పళ్ళు తోముతున్నాడు వెంకట్.

ఆదరాబాదరా వచ్చాడు గురవడు, "బాబూ! పోలీపోల్లు ఒచ్చినారయ్యా, తెల్లబట్టల్లో ఒచ్చారు! ఇల్లంతా యాగీ పేసేత్తన్నారు దొరా! పెద్ద దొర ఇంటికాడే ఉన్నారు! తవురు యాడకైనా పారుపొండి."

పరుగెత్తినట్లే వెళ్ళి, కాస్తంత ఎండుగడ్డి మోపు నెత్తిన పెట్టుకుని, చెంబు తీసుకుని ఇంటి వైపు చకచకా అడుగు లేసాడు గురవడు. వెంకటరత్నం చెరువు దగ్గరే ఉన్న వెంగళరావు ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

పోలీసులు ఇప్పటికి ఎన్నిసార్లు వచ్చినా వెంకట్రామయ్యగారు ఎపుడూ ఇంట్లో లేరు. వాళ్ళు ఇల్లంతా ఇష్టమొచ్చినట్లు వెతుకుతూ, సామానులు తన్నేస్తూ తిరుగుతూంటే అంతటి పెద్దమనిషి కూడా భయం భయంగా చూస్తూ కూర్చున్నారు.

బీరువాల్లో నుండి బట్టలన్నీ తీసి ఇల్లంతా విసిరేసారు! అటకమీదికెక్కి ఇత్తడి సామానులన్నీ క్రిందకు విసిరేసారు! మంచాలమీది దుప్పట్లులాగేసి, పరుపులు తీసి క్రింద పడేసారు! గొడ్లచావిడిలోని అటకమీదికెక్కి జనపకట్టలన్నీ లాగి క్రిందికి గిరవాటేసారు!

రేణుక ఆడుకుంటూన్న పొట్లాం వంక చూస్తూ "ఇవేమిటి?" అన్నారు.

'మీ బొంద' అనుకున్న తార బదులు పలకలేదు.

"వాళ్ళు చెబుతారా!" అంటూనే ఒకడు వంగి పొట్లం తీసి చూసాడు.

"సిగరెట్టు నుసి" అన్నాడు నవ్వుతూ.

"ఇంకేమో రాసి ఉంది చూడు!"

అదిరిపడింది తార! గబుక్కున 'అవన్నీ జాగ్రత్తగా దాయి' అన్న వెంకట్ మాటలు గుర్తుకొచ్చాయి.

అందులో వ్రాసి ఉన్న దేమిటో వాళ్ళ కర్థం కాలేదు. మార్చి మార్చి చూసారు! తిప్పి తిప్పి చదివారు! అర్థంకాక అవతల పడేసారు!

ఇల్లంతా నానా రభస చేసి "మా కందకుండా ఎంత కాలం తిరగ్గలడో చూస్తాం!" అంటూ కోపంగా కేకలేస్తూ వెళ్ళిపోయారు.

ఇది జరిగాక ఇంటిల్లిపాదీ చాలా భయపడ్డారు. ఇంతవరకూ వాళ్ళు రావటమూ, వెంకట్ ఆకతాయితనంగా చీరెలు కట్టుకుని, అటకలపైన ఎక్కి, గడ్డివాములో దాక్కుని తప్పించుకుంటూంటే అదొక సరదాగానూ, తమాషాగానూ ఉంటోంది. కాని, ఈసారి వాళ్ళు అంత తీవ్రంగా వెదుకుతూంటే చిన్నపిల్ల నన్న కూడా చాలా భయపడిపోయింది.

ఆ రాత్రి ఎన్నడూ లేనిది వెంకట్రామయ్యగారు కొడుకుని చాలాసేపు తీవ్రంగా కేకలేసారు.



తండ్రి ఎంతగా తిడుతున్నా వెంకట్ నోరు విప్పలేదు. తలవంచి అన్నిటినీ ఓపిగ్గా విన్నాడే తప్ప ఒక్క మాటకూడా బదులు పలకలేదు.

తార దాచి ఉంచిన పిటీలన్నీ తీసుకుని, జేబులో వేసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

* * *

స్వప్నకు అన్నం తినిపిస్తున్న తార వద్దకు పరుగెత్తుకొచ్చింది దమయంతి.

"ఒదినా, ఒదినా — ఇదిగో, ఇది చూడు." చేతిలోని పేపరు అందించింది.

ఎడంచేత్తో పేపరందుకుని "ఏమిటమ్మా? ఏమిటంత ముఖ్యమైన..." అన్నైన తారా నోట్లోంచి మాటలు బయటకు రాలేదు.

వానపాముల వాస్తవ్యుడైన 'చలపతిరావు' అనే విప్లవకారుడ్ని కాల్చి చంపివేసిన సంఘటనను వివరిస్తూ, అతని ఫొటో కూడా ప్రచురించారు.

అతని బొమ్మ చూస్తుంటే ఒళ్ళంతా గగుర్పొడిచింది తారకు.

'ఎంత చిన్న వయసు!'

'అబ్బ! ఏ తల్లి కన్న బిడ్డడో —' కళ్ళల్లోకి గిర్రున నీళ్ళు తిరిగాయి.

ప్చ్! పాపం! మీసాలు కూడా సరిగ్గా రాలేదు. ఇంత చిన్న వయసులో, ఎంతో పెద్ద ఆశయాలతో, ఆవేశంతో అభిమన్యుడిలా బలైపోయిన అతడ్ని చూస్తుంటే తారకు ఉండి ఉండి దుఃఖం ముంచుకు వస్తున్నాది.

స్వప్నకు ఎలాగో అన్నం తినిపించటం పూర్తి చేసింది. చేయి కడుక్కున్నాక మళ్ళీ పేపరందుకుని చూసింది తార.

పేపరునిండా అన్నీ అవే వార్తలు! ఒకచోట ఏడుగురిని అరెస్టు చేసినట్లు! మరోచోట ఇద్దర్ని కాల్చేసినట్లు! ఇంకోచోట మరికొందరిని పట్టుకోవటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లూ —

'అబ్బ! అసలు ఈ జీవితాలకు శాంతి అనేది ఉంటుందా!'

ప్రతిరోజూ, ప్రతి గంటా... ఊహూఁ — ప్రతి సెకనూ ఆందోళనే!

* * *

ఆ రోజు 1950 జనవరి ఒకటి!

గిరిజ కూతురుకు పాలుపట్టి నిద్రపుచ్చింది. మంచంమీది నుండి లేచివచ్చి అన్నం పెట్టుకుంది! దమయంతి అప్పటికే భోజనం చేస్తున్నాది. సత్యవతమ్మ వెంకట్రామయ్యగారికి చారు పోస్తున్నాది.

రేణుక నిద్రపోయింది. స్వప్నను పడుకోబెట్టి దుప్పటి కప్పుతోంది తార.

సంక్రాంతి దగ్గరకు వస్తున్నాదని ఆ రోజు ఇల్లంతా సున్నం కొట్టించారు. ఇల్లంతా శుభ్రం చేసుకోవటం, సామానులన్నీ సర్దుకోవటంతో అందరూ అలసిపోయి ఉన్నారు.

పైగా చలికాలం! పెందలకాడ కాస్త వేడి వేడి అన్నం తినేసి, దుప్పటి కప్పుకుని పడుకోవాలనిపిస్తున్నాది.

ఇంకా వెంకటరత్నం భోజనానికి రాలేదు.

"మీరు కూడా భోంచేసెయ్యండత్తయ్యా! ఆయనొస్తే నేను వడ్డించుతాను" అన్నది తార.

అందరి భోజనాలూ పూర్తి అవుతూండగా వెంకటరత్నం వచ్చాడు.

ఆనాడు పోలీసుల హడావుడి అయ్యాక తండ్రితో చివాట్లు తిన్న వెంకట్ మళ్ళీ తండ్రికి ఎదురుపడలేదు. ఆ తర్వాత తండ్రిని చూడటం ఇవ్వాళే!

తలవంచుకుని గది లోపలకు వెళ్ళాడు.

"తారా! చాలా ఆకలిగా ఉంది. అన్నం పెట్టేసెయ్. గబగబా స్నానంచేసి వచ్చేస్తాను."

"అలాగే! త్వరగా రండి."

తార వంట గదిలోకి వెళ్ళి, అన్నీ సిద్ధం చేస్తున్నాది. అతడు అన్నట్లుగానే తొందరగా స్నానంచేసి, లుంగీ చుట్టుకుని భోజనానికి వచ్చాడు. సరిగ్గా తుడుచుకోలేదు కాబోలు, ఏ అచ్ఛాదనా లేని అతని తెల్లని ఒంటిపై నీటిబొట్లు తమాషాగా మెరుస్తున్నాయి!

దూరంగా వరండాలో పడక్కుర్చీలో కూర్చుని కొడుకు వంకే చూస్తున్నారు వెంకట్రామయ్యగారు.

నాలుగు ముద్దలయినా తిన్నాడో లేదో — బయట అలవాటయిన బూట్ల చప్పుడు వినిపించింది.

ఎలా, ఎక్కడకు తప్పుకోవాలో తెలియని వెంకట్ గబుక్కున గోడమీదికెక్కి ప్రక్క ఇంట్లోకి దూకేసాడు.

వానరాకడ, ప్రాణం పోకడ ఎవరూ చెప్పలేరు అంటారు!

పోలీసుల రాక కూడా ఎవరూ చెప్పలేరనిపిస్తున్నాది!

అంతా ఎవరికి వారు బొమ్మల్లాగా బిగిసుకు పోయా[illegible]

ఆ ఎనిమిదిగంటల రాత్రి సమయంలో సుమారు ఆరేడుమంది పోలీసులు ఇంట్లో జొరబడి నానా బీభత్సం చేస్తున్నారు! చాలా దారుణంగా ప్రవర్తిస్తున్నారు!

బీరువాలన్నీ ఖాళీచేసి క్రిందకు తోసేసారు!

రెండు క్రొత్త పరుపులు చుట్టచుట్టి కాస్త ఎత్తుగా తాళ్ళుకట్టి వ్రేళ్ళాడేసారు. ఆ తాళ్ళు తెగగొట్టి పరుపుల్ని క్రింద పడేసారు.

వాళ్ళను చూస్తుంటే చక్కని వనంలో దూరిన కోతిమూక ప్రవర్తనలాగా ఉంది.

ఇంకా తృప్తి తీరలేదు కాబోలు!

మంచంపైన పడుకుని నిద్రపోతూన్న స్వప్నను తుపాకీతో పొడిచి లేపారు. నిద్ర కళ్ళలో భయం భయంగా చూస్తూన్న స్వప్న ఒక్కసారిగా గట్టిగా ఏడ్చేసింది. గబుక్కున దగ్గరకు తీసుకుని గుండెల్లో దాచుకుంది తార.

గదిలో అల్మారా అద్దాలు పగలగొట్టి వెండి సామానంతా క్రిందకు దొర్లించేసారు.

మధ్యలో రెండు మూడుసార్లు రాగాలు తీయబోయిన సత్యవతమ్మను కాల్చేస్తామని గురి చూపించారు.

వెంకటరత్నం కనిపించలేదు!

వాళ్ళ కక్ష తీరలేదు!

విరగగొట్టటానికీ, పగలగొట్టటానికీ ఇంకేమీ కన్పించలేదు.

అందుకని —

మంచం మధ్యలో అమాయకంగా, హాయిగా నిద్రపోతూన్న గిరిజ కూతురు పద్మజను ఎత్తి దూరంగా గిరాటేసారు!

కెవ్వుమంది తార!

భోరుమంది గిరిజ!

క్రింద పడిపోయిన ఆ చిన్ని ప్రాణం నలిగి పోయి గాలిలో కలిసిపోయిందనే అనుకున్నారు. వెంకట్రామయ్యగారితో సహా అందరూ గట్టిగా కళ్ళు మూసేసుకున్నారు. సత్యవతి గట్టిగా ఏడ్చేస్తున్నాది!

కానీ — ఆ వార్త ఏదో తెలిసి, కేవలం ఆ పసికూనను రక్షించేందుకే వచ్చినట్లుగా వచ్చి రెండుచేతుల్లోనూ పట్టుకొన్నాడు వెంకటేశ్వరరావు!

పరుగెత్తికెళ్ళి అందుకున్నాది గిరిజ!

అందరి గుండెలూ పనిచేయటం ఆరంభించక ముందే వికృతంగా నవ్వుతూ చేసిన మరో రాక్షస కాండ — రేణుకను ఎత్తి మరో మూలకు విసిరేసారు!

కేవలం అది రేణుక అదృష్టమే అనుకోవాలి! ఎవ్వరూ లేని ఆ వైపున అంతకుముందు త్రాళ్ళు తెంపి క్రింద పడేసిన పరుపులున్నాయి! వాటిమీద పడింది రేణుక! దబ్బున పడటంతో కెవ్వున కేకవేసి గుక్క తిప్పుకోలేనంతగా ఏడుస్తున్నది రేణుక.

ఒక వైపున స్వప్న, మరోవైపున పద్మజ, మరోవైపున రేణుక —

ఆ చిన్నారి పాపలు అలా ఏడుస్తుంటే ఆ మృగాలు — పోలీసులు వికటంగా నవ్వుతూ ఆనందిస్తున్నారు!

అది చూస్తుంటే వెంకటేశ్వరరావు వేడిరక్తం ఆగలేదు.

"అసలు మీరు మనుషులేనా! వెంకటరత్నాన్ని పట్టుకోవటం చేతకాక ఆడవాళ్ళమీద అఘాయిత్యాలు చేస్తున్నారా? చిన్నపిల్లల్నీ, ఆడవాళ్ళనీ చంపమందా మీ ప్రభుత్వం!" అంటూనే వాకిలి ప్రక్కనే ఉన్న వెంకట్రామయ్యగారి పొడవాటి కర్రను అందుకుని టపీ టపీమని వాళ్ళ మోకాళ్ళమీద కొట్టేసాడు!

ఇంకేముంది! కల్లు తాగిన కోతుల్లాగా అయిపోయారు!

వెంకటేశ్వరరావుని పట్టుకోబోయారు. 'ఎలాగూ ఎదురుతిరిగాము కదా!' అనుకున్నాడో, ఏమో వెంకటేశ్వరరావు అంత తేలిగ్గా వాళ్ళకు అందలేదు. చాలాసేపు వాళ్ళతో కలియబడి ఇష్టం వచ్చినట్లు కాళ్ళతో ఎడా పెడా తన్నేసాడు. ఒకడికయితే తగలరానిచోట తగిలేసరికి 'అబ్బా' అంటూ గింగిర్లు తిరిగి క్రింద పడిపోయాడు.

దానితో పోలీసులు ఇంకా రెచ్చిపోయారు. క్రింద పడినవాడిని స్థాణువై చూస్తూన్న వెంకటేశ్వరరావుని రెప్పపాటులో గబుక్కున పట్టుకుని చేతులు వెనక్కు విరిచి కట్టేసారు. దొడ్లోకి లాక్కువెళ్ళి కొబ్బరిచెట్టుకు కట్టేసి ఉత్త డ్రాయరు తప్ప మిగిలిన బట్టలన్నీ లాగేసారు. లాఠీ కర్రలతో, కాళ్ళతో ఇష్టమొచ్చినట్లు కొట్టేసారు. వెంకట్రామయ్యగారు అడ్డు వెళ్ళబోతే ఇవతలకు

మీ నుదుటనున్న శింగార్ నకిలీది కాదుకదా?

తిలకం బొట్టు కొనడానికి వెళ్లేటప్పుడు, జాగ్రత్తగా చూసి అసలైన శింగార్ కుమ్‌కుమ్ బొట్టే తెచ్చుకోండి.

నకిలీ తిలకాలు తయారుచేసే వాళ్ల మోసాలు తెలుసుకోండి.

ఇది మా అసలైన చిహ్నం. నకిలీ తయారీదార్లు దీనికి బదులు K, M, శ్రీ మొదలైన చిహ్నాలతో తయారు చేసి మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తూంటారు.



Shingar

ఇది మా పేరు. ఎన్నో సంవత్సరాలనుంచీ మీకు నమ్మకంగా ఉంటున్న పేరు. S-h-i-n-g-a-r అన్న అక్షరాలు కలిగి వుంటుంది. హిందీలో शिंगार అని వుంటుంది. మా మీద మీకున్న నమ్మకాన్ని తమ ప్రయోజనానికి వాడుకోవటం కోసం, నకిలీ తయారీదార్లు తమ పేర్లను దీన్ని పోలివుండేటట్లుగా రాస్తున్నారు. ఎలా అంటే— Shingari Shrinagar, లేదా Shimgar అని.

మా ప్యాక్‌మీద మీకు సుపరిచితమైన గుండ్రటి బొట్టు ఉంటుంది. మిమ్మల్ని తప్పుతోవ పట్టించడానికి నకిలీ తయారీదార్లు దానికి బదులు ◎, ♧, ✡, □ మొదలైనవి ముద్రిస్తారు.

అసలైన శింగార్ కుమ్‌కుమ్ తిలకాన్ని అత్యుత్తమమైన పదార్థాలతో తయారు చేస్తున్నారు. అవి మీ చర్మానికి పూర్తిగా సురక్షితమైనవి.
పైగా, శింగార్ బొట్టు చిట్లిపోదు, పాకిపోదు, ఊడిపోదు. నకిలీ తయార్లలో ఈ ఉత్తమ గుణాలెందుకుంటాయి? అవి మీ చర్మానికి ఎంతో హాని కలిగించవచ్చు కూడా.

అంచేత ఆ ప్రమాదానికి తావే ఇవ్వకండి. జాగ్రత్తగా చూసి కొనండి.

చౌకబారు నకిలీ తయార్లుకూడా ఉంటాయి జాగ్రత్త! అవి మీ చర్మానికి హాని కలిగించవచ్చు.

శింగార్

కుమ్ కుమ్ బొట్టు

ఆ పేరులో ఉంది చెప్పలేని అందం — అంటే ఇది నమ్మదగినదనే అర్థం

everest/81/SH/376 tel

లాగేసారు ! మరోసారి అడ్డం వెళ్ళిన తారను అంత దూరానికి తోసేసారు. నూతిగట్టు కొట్టుకుని నుదురు చిట్లింది తారకు.

జరుగుతూన్న రాక్షసకాండను చూసేందుకు అంత రాత్రిపూట కూడా ఊరు ఊరంతా వెంకట్రామయ్యగారి లోగిలిలోనే ఉన్నది.

ఎందుకో — ఆ పోలీసువాళ్ళను చూస్తే అందరూ భయపడతారు! ఊరంతా ఏకమైతే కోన్‌కీస్ — ఆ ఏడుగురు పోలీసులు ఒక లెక్కా! కాని, ఒక్కరూ నోరు తెరవటంలేదు !

"ఆగండి" ఆడపులిలా గర్జించింది తార. క్రరలెత్తిన పోలీసులు అలాగే తలలు తిప్పి తారవంక చూసారు.

"ఇంకా తీరలేదా మీ రక్తదాహం! ఏం — మమ్మల్ని వదిలేసారే — కాల్చేసెయ్యండి! ఛీ! మీరు మనుషులేనా? మీకు భార్యా పిల్లలు లేరా? తల్లి తండ్రులు లేరా? మీలో మానవత్వమే లేదా? ఆ పశువులకూ మీకూ తేడా ఏముందిరా రాక్షసుల్లారా! ఛీ! గొడ్డును బాదినట్లు బాదటానికి మీకు చేతులెట్లా వస్తున్నాయి! మీదీ ఒక జన్మేనా! మీరు చేస్తూన్న ఈ పాపకృత్యాలన్నిటికీ ఏదో ఒకనాటికి భయంకరమైన ఫలితాన్ని మీ కుటుంబమంతా అనుభవిస్తారు చూడండి! మమ్మల్నింతగా ఏడిపిస్తూన్న పాపం మిమ్మల్ని ఊరకే వదలదు! మా ఉసురు మీకు తగలకమానదు!"

వెంకటేశ్వరరావు నిస్త్రాణగా తలవాల్చేసాడు.

క్రిందపడిన పోలీసువాడిని మోసుకుంటూ, పున్నమి చంద్రుని వెన్నెట్లో అపరకాళిలా హూంకరిస్తూన్న తారను నిర్లక్ష్యంగా చూస్తూ వెళ్ళిపోయారు పోలీసులు!

నుదుట దెబ్బతగలటం మూలంగా ముఖమంత రుధిరంతో తడిసిపోయి ఉన్నది. ఆవేశంతో ఆదిశక్తిలా అరిచిన తారను ఆ ఊరి ప్రజలు అపుడే మొదటిసారిగా చూస్తున్నారు. సాధారణంగా పెద్దిళ్ళలోని కోడళ్ళు బయటకు రారు! అందువల్ల తారను గూర్చి వినటమేగానీ, ఆమెనెపుడూ ఎవరూ చూడలేదు!

వెంకట్రామయ్యగారు చటుక్కున ముందరకు వెళ్ళి వెంకటేశ్వరరావుని పట్టుకున్నారు. ఊరివాళ్ళు ముందరకు వచ్చి కట్లువిప్పారు! డాక్టరు కోసం పరుగుతీసారు! అలాగే భుజాలమీద ఇంట్లోకి తీసుకొచ్చారు! పడుకోబెట్టటానికి కూడా స్థలం లేదు. ఇల్లంతా అస్తవ్యస్తంగా ఉన్నది! దమయంతి క్రిందపడి ఉన్న పరుపుపై గబుక్కున దుప్పటి పరచింది. దానిమీదే పడుకోబెట్టారు!

ఆ ఊరి ప్రజలు ఆ ఇంటిని ఒక ప్రదర్శనశాలను చూసినట్లుగా విరిగిపోయిన వాటికోకథ, పగిలిన వాటికోకథ, తల్లక్రిందులుగా పడ్డ వాటికో కథ చొప్పున చెప్పుకుంటూ చూస్తున్నారు. సానుభూతి చూపులతో, వ్యర్థమైన పలుకులతో ఎక్కడి వాళ్ళక్కడ తప్పుకున్నారు.

ఈ విషాద సంఘటన — మరవిపోలేని ఒక పీడకల!

* * *

తార

ఆ రోజు తప్పించుకుని పారిపోయిన వెంకటరత్నం వారం రోజులయినా ఇంటికి రాలేదు.

వెంకటేశ్వరరావు కొంచెం కోలుకుని ఇపుడు ఆరోగ్యంగానే ఉన్నాడు.

కాని, వెంకటరత్నం జాడతెలియకా, ఎపుడు ఏం జరుగుతుందో అనే భయంతోనూ ఇంటిల్లిపాదీ రోజులు యుగాల్లా గడుపుతున్నారు.

మృత్యుదేవత సపరివారంగా ఇంటి ముందు తిష్ఠవేసుక్కూర్చున్నట్లుగా ఉన్నది.

పిల్లల మనసుల్లో అర్థంకాని భయం! చెప్పుకోవటానికి చేతగాని వయస్సు! పద్మజ, రేణుక ఇద్దరూ కూడ ఉండి ఉండి నిద్రలోనే వెక్కి వెక్కి ఏడుస్తుండేవారు! స్వప్న అయితే ఏ మధ్య రాత్రిలోనో కెవ్వున కేకవేసి లేచి కూర్చునేది! వెంకటేశ్వరరావుని కట్టి కొట్టటమూ, రక్తసిక్తమైన ముఖంతో తిరిగిన తారనూ చూసిన స్వప్న మనసు చాలా ఖంగుతిన్నది. ఆ లేత మనసులో అవి బాగా ముద్ర వేసుకున్నాయి!

పెద్దవాళ్ళూ అలాగే ఉన్నారు! కళ్ళకు నిద్ర వచ్చేది కాదు! ఒకవేళ ఏ అర్థరాత్రి పూటో మాగన్నుగా అలా కునుకుపడితే భయంకరమైన పీడకలలు!

రోజులు అతి దారుణంగా గడుస్తున్నాయి! పదిరోజుల తర్వాత వెంకటరత్నం ఒక ఉత్తరం వ్రాసి మనిషికిచ్చి పంపాడు. అందులో తను ఎక్కడ ఉన్నదీ తెలపకుండా, క్షేమంగానే ఉన్నట్లు మాత్రం వ్రాసాడు. 'చాలా దూరంలో ఉన్నట్లూ, ఇంక ఇప్పట్లో ఇంటివైపుకు రానని' వ్రాసాడు! ఆ రోజు ఇంట్లో జరిగిన బీభత్సం తెలిసిందనీ, అందువల్లే ఇంటికి దూరంగా వెళ్ళిపోయాననీ కూడా వ్రాసాడు. అంతే కాకుండా తండ్రిని క్షమార్పణ కోరుతూ — "ఇంత జరిగాక నా ఈ ఆశయాలను వదలి ఒక జీవచ్ఛవంలా బ్రతకలేను. చావో, గెలుపో — ఏదో ఒకటి తేలేవరకూ ఈ పార్టీలోంచి బయటకు రాలేను. నా ఈ నిర్ణయం మిమ్మల్ని బాధ పెడుతుందని నాకు తెలుసు! మిమ్మల్ని సంతోష పరచలేని నన్ను మరచిపొండి! మీ కొక కొడుకు ఉన్నాడనే సంగతే మరచిపొండి! నాలాటి వ్యక్తి పెళ్ళి, పిల్లలూ అనే బంధాలతో ముడిపెట్టుకోకూడదు! కాని, కొన్ని బలహీనమయిన పరిస్థితుల్లో వాటికి లొంగిపోయాను. నా పొరపాటుకు శిక్ష నా పిల్లలు అనుభవించకుండా వాళ్ళను కాపాడే బాధ్యత మీదే!" నంటూ వ్రాసాడు.

ఆ ఉత్తరం చదివాక సత్యవతమ్మ భోరున ఏడ్చేసింది. పెద్ద పెద్ద రాగాలు పెట్టేసింది. వెంకట్రామయ్యగారు కూడా పంచెతో ముఖాన్ని కప్పేసుకున్నారు! తార చాలా కృంగిపోయింది! అయినా తమాయించుకుని, వెంటనే ఒక కాగితం మీద "మీకు లేని భవిష్యత్తు నాకుగానీ, పిల్లలకు గానీ వద్దు! మీతోపాటే మేమూ! దయచేసి మమ్మల్ని మీ దగ్గరకు తీసుకువెళ్ళండి" అంటూ నాలుగు ముక్కలు గబగబా వ్రాసి ఆతనికే ఇచ్చి పంపించింది.

* * *

వెంకటరత్నం వ్రాసి పంపిన ఉత్తరం వెంకట్రామయ్యగారిలో చాలా అలజడిని రేపింది. ఎపుడూ ఏదో ఆలోచిస్తూ పిల్లల్ని దగ్గరకు తీసుకుంటూ గడిపేవారు.

నాలుగైదురోజులు కొడుకు ఏమైపోయాడో అని కుళ్ళి కుళ్ళి ఏడుస్తూండేది, సత్యవతి. కొడుకు బిడ్డల్ని చూస్తూ ఊరే కన్నీళ్ళను తుడుచుకుంటూండేది.

ఆ యింట్లో 'ఆకలి' అనేదే లేకుండాపోయింది.

అలాటి గంభీర వాతావరణం ఇంకా అలుముకుని ఉండగానే మరోసారి పోలీసులు దాడి జరిపారు.

'వెంకటరత్నం లేదు; ఆనలెక్కడున్నాడో కూడా మాకు తెలియదు' అంటూ ఎన్నివిధాలుగా చెప్పినా—

"బెల్లం కుండ ఉండగా చీమలు రావు అని చెబితే నమ్మటానికి మేము తెలివి తక్కువ వాళ్ళమా" అన్నారు, నిర్లక్ష్యంగా. తారను చూసి హేళనగా నవ్వుతూ "చింకలాటి పెళ్ళాన్ని వదిలేసి ఎంత కాలం ఉండగలడో మేమూ చూస్తాం" అన్నారు.

ఛీ! ఛీ! వాళ్ళ చూపులూ, వాళ్ళ నవ్వులూ, హేళనలూ — అసహ్యంగా, కంపరంగా ఉన్నది! భరించశక్యం కాకుండా ఉన్నది! వాటిని ఎలా ఎదిరించాలో అర్థం కావటంలేదు! ఆ పరిస్థితుల్లోంచి తప్పించుకోవటం అనేది చాలా అసాధ్యమైన పనిగా అన్పించింది తారకు!

కాని, గిరిజకు అలా అన్పించటంలేదు. 'వదిన ఇంట్లో ఉండబట్టే ఈ గొడవంతా జరుగుతున్నాది.' అని ఆమె అభిప్రాయం! 'వదిన కూడా వెళ్ళిపోతే పోలీసులు ఇంక రారు! వాళ్ళవల్ల తమ కే ఇబ్బందీ ఉండదు!' అని ఆమె ఖచ్చితమైన నమ్మకం!

ఆ విషయం సత్యవతితో అన్నపుడు ఆమె అంత త్వరగా గిరిజను సమర్థించలేకపోయింది. సాధించే స్వభావం, గొణుగుడుబుద్ధీ ఉన్నాకూడా సత్యవతి మనస్సు మంచిది! మార్దవం కలిగిన స్త్రీ! అన్నింటినీమించి మాతృమూర్తి! చూస్తూ చూస్తూ పసికూనలను తీసుకుని ఇల్లు విడిచి వెళ్ళిపొమ్మని — ఇంటికోడల్ని తరిమేసేందుకు ఆమె అంతరాత్మ ఒప్పుకోలేదు!

అలాగ అని నిప్పుల కుంపటిని నెత్తిన పెట్టుకోవటానికీ ధైర్యం లేదు. పెళ్ళీడుకొచ్చిన పిల్ల దమయంతి! దాని భవిష్యత్తు ఏంగాను! పైగా దిన దిన గండంగా ఎన్నాళ్ళు! ఈ సమస్యకు ఏదో ఒక పరిష్కారం చూడాలి!

సరిగ్గా అపుడే వెంకటరత్నం మనిషితో ఉత్తరం పంపించాడు. అందులో తారను 'అలాటి మొండిపంతాలు పట్టవద్దనీ, తమ ప్రేమఫలాలు స్వప్ననూ, రేణుకనూ చూసి అయినా మనసు మార్చుకొమ్మనీ' వ్రాసాడు. మాజిల్లాలో మళ్ళీ జరిగిన పోలీసుల దురాగతం తనకు తెలిసిందని వ్రాస్తూ 'ఇలాటి పరిస్థితుల్లో నీవు అక్కడే ఉండటంకూడా అంత మంచిది కాదు! కాబట్టి నీవు మీ నాన్నగారింటికి వెళ్తే బాగుంటుంది!' అని సూచించాడు. 'వెళ్ళటానికి ఇష్టపడే పక్షంలో ఈ ఉత్తరం తెచ్చినతను నిన్నూ, పిల్లల్నీ చాలా జాగ్రత్తగా తీసుకెళ్ళి గుడివాడలో దించుతాడు! ఎలాటి సంకోచాలూ పెట్టుకోవద్దు! పిల్లల జాగ్రత్త!' అంటూ ఏవేవో ధైర్యవచనాలు వ్రాసాడు.

(ఇంకా వుంది)

(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]

పోతన శ్రీనాథులని బావమరదులుగా చిత్రించిన కథలు

పోతనామాత్యుఁడు పరమభక్తాగ్రేసరుఁడై వ్యవసాయముచేసి జీవితము గడుపుకొనుచు, భగవత్పాదపద్మధ్యానమునకై కాలమును వినియోగించుచుండెడివాఁడట. రాజాశ్రయము నపేక్షింపనివాఁడగుటచే ద్రవ్యవంతుఁడు గాక, దారిద్ర్యముచేఁబీడింపఁబడుచున్న యాతనిగూర్చి యనేకకథలు చెప్పుకొనుచుందురు. భాగవతమును గర్ణాట రాజులకుఁ గృతి యిప్పింపవలయునని శ్రీనాథుఁడు పోతనామాత్యునియొద్ద కొకపర్యాయ మరుదెంచుచు, రాజాశ్రయమువలనఁ దాను పొందుచున్న మహైశ్వర్యమును జూపించి, పోతనను, దన వంకకుఁ ద్రిప్పుకొనుటకై తానెక్కివచ్చుచున్న పల్లకిని పోతన వ్యవసాయము సేయుచున్న ప్రదేశము నంటిపోవునట్లు చేసెనట. పోతన శ్రీనాథులు బావమఱఁదులని చిరకాలానుగతమైన జనశ్రుతియొకటికలదు. పోతన తన భూమిప్రక్కనున్న చెఱువు గట్టుపైఁ గూర్చుండి గ్రంథ రచనము చేసికొనుచుండ నాతనితనయుఁడైన మల్లన యరక దున్నుచుండెనట. శ్రీనాథుఁడు తన పల్లకిమోయు బోయీలలో నొక పక్కబోయీలను బల్లకిని వదలుఁడనియెననియు, నా ప్రక్కబోయీలు లేకుండగనే పల్లకి నడచుచుండుటను జూచి మల్లన తండ్రితో "నాయనా! మామయ్య పల్లకి యొకప్రక్క మోయువారు లేకుండగనే నడచుచున్నది చూడు" మని చెప్పఁగా నీవు కూడ నొకయెద్దును వదలుమని పోతన చెప్పెననియుఁ నాప్రక్కయెద్దు లేకుండగనే నాగలి నడచుచుండెననియు, నదిచూచి శ్రీనాథుఁడు రెండవప్రక్క బోయీలను తగ్గుఁడనియాజ్ఞాపింప వారట్లు చేసిరనియు బోయీలు లేకుండగనే నడచుచున్న పల్లకినిఁజూచి మల్లన రెండవ యెద్దును గూడ విప్పివేయ, యెద్దు లేకుండగనే నాగలి నడచుచుండెననియుఁ జెప్పుదురు. ఇట్లు బావమఱఁదు లిరువురు నొకరితపశ్శక్తి నొకరికి జూపుకొనిన పిమ్మట శ్రీనాథుఁడు పల్లకిదిగి పోతనామాత్యుని కడకు వచ్చి హాలికులకుఁ గుశలమా! యని పరిహాస పూర్వకముగఁ గుశలప్రశ్న చేయ, నాతని యుద్దేశమును గ్రహించి,

ఉ. బాలరసాలసాల నవపల్లవ కోమలకావ్య
కన్యకన్
గూళలకిచ్చి యప్పడుపుకూడు
భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి గహనాంతరసీమల
కందమూలగౌ
ద్దాలికులైననేమి నిజదారసుతోదర
పోషణార్థమై

అని ప్రత్యుత్తరమిచ్చెనట.

పోతనామాత్యునకుఁ గోపమువచ్చెనని తెలిసికొని శ్రీనాథుఁడాతనికిఁ దగిన సమాధానమొసంగి యుపశమింపఁజేసెనట.

పరివారముతో నున్న శ్రీనాథుని గౌరవించుటకు నింట నేమియు లేదని పోతనామాత్యుని భార్య కళవళపడుచుండ భయములేదని చెప్పి పాత్రలను వంటగదియందుంచి– స్నానముచేసి దేవతార్చన గది యందు గూర్చుండి యిష్టదైవమును ప్రార్థించుచుండుమని భార్య కనుజ్ఞయిచ్చి తాను సరస్వతీదేవిని మనసారఁ బ్రార్థించి పిమ్మట పోతనామాత్యుఁడు శ్రీనాథునితోఁగలిసి స్నానముచేయఁబోయెనట. తిరిగివచ్చి పాత్రలనిండ వంటకము లుండుటం గాంచి, దేవీకటాక్షమున కపరిమితానందము నొంది భార్యంబిలిచి వడ్డింపుమనియెనట! లోపల నుండి సరస్వతియే యందించుచుండ పోతనామాత్యుని భార్య పదార్థములను వడ్డించుచుండ షడ్రసోపేతముగ భుజించి శ్రీనాథుఁడు భోజనానంతరమునఁ దాంబూలమును సేవించుచు, పోతనతో భాగవతమును గర్ణాటప్రభువుల కంకితము సేయు విషయమును బ్రస్తావలోనికిఁ దెచ్చెనట. అప్పుడు సరస్వతి బాష్పోదక నయనములతోఁబోతనామాత్యుని కెట్టయెదుటఁ గన్పట్టనాతని హృదయము నీరైపోయి,

ఉ. కాటుక కంటి నీరు చనుకట్టు
పయింబడ నేలయేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల!
యో మదంబ! యో
హాటకగర్భురాణి! నినునాకటికై
గొనిపోయి యల్లక
ర్ణాటకిరాటకీచకులకమ్మఁ ద్రిశుద్ధిగ
నమ్ము భారతీ!

యనయామె నాశ్వాసించెనట! అందుపై శ్రీనాథుఁడిఁక లాభము లేదని తలఁచి తన ప్రయత్నమును విరమించుకొనియెనట! శ్రీనాథుఁడు పోతనామాత్యుని భాగవతములోని యొకకథ చదివి వినిపింపుమని కోరెననియు, నందుపై తన కెక్కువయభిమానము గల గజేంద్రమోక్షమును జదివి వినిపింప నందలి :–

నేను

రెక్కలొచ్చినా సరే
సుందర కాశ్మీరాలకు
శృంగార ఎల్లోరాలకు
ఎగురుకొంటూ వెళ్ళను!
రెక్కలు విరిగి వారిగి పోయినా సరే
కష్టజీవుల మొరలు వినేందుకు
కన్నీట తడిసిన ఆ బ్రతుకులు
బాగుపరచేందుకు
నడుచుకొంటూ అయినా సరే
వెళతాను!

– డా. గుమ్మనూరు రమేష్‌బాబు

కార్టూనిస్టులకు సూచనలు !

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి !

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి ! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలాబిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥

పోతన శ్రీనాథులని...

మ. సిరికింజెప్పఁడు శంఖచక్రయుగముం
జేదోయిసంధింపఁడే
పరివారంబును జీరఁడ భగపతిం
బన్నింపఁడా కర్ణికాం
తరధమ్మిల్ల ముఁ జక్కనొత్తఁడు
వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడుగజ
ప్రాణావనోత్సాహియై


అను పద్యమును విని బావగారూ ! భగవంతుని మకరమును వధించుట కాయుధములను వెంటగొనిపోకుండఁ బరువెత్తునంతటి వెఱ్ఱివానిగఁ జేసితిరేమి ? యని హాస్యముచేసెనఁట ! దానికేమియుఁ బ్రత్యుత్తరమీయక పోతన తరువాత నున్న,

మ తన వెంటన్ సిరిలచ్చివెంట నవరోధ
వ్రాతమున్ దాని వె
న్కను బక్షీంద్రుఁడు వానిపొంతను
ధనుఃకౌమోదకీశంఖ చ
క్రనికాయంబును నారదుండు ధ్వజినీ
కాంతుండు దావచ్చి రొ
య్యనవైకుంఠపురంబునం గలుగువారా
బాలగోపాలమున్.

అను పద్యము జదివి యొక్కసారి శ్రీనాథుని వంక దృష్టి సారించి పిమ్మట నాకథాభాగముమ బూర్తిగఁజదివెనఁట.

మరియొకప్పుడు శ్రీనాథుఁడు దేవతార్చన గృహమున ధ్యానమగ్నుఁడై యున్నతటి నాతని కొమరునొకచోఁదాచి యొక బండరాయినెత్తి సమీపముననున్న నూతిలో ధ్వనియగునట్లు పడవైచి యొక్కపరుగున లోనికివచ్చి "బావా! పిల్లవాఁడు నూతిలోఁబడిపోయె" ననియొక వెఱ్ఱికేకనైచెనఁట ! ధ్యానము చేయుచున్న శ్రీనాథుఁడాతముతోలేచి, నూయి యొద్దకుఁ బరువెత్తి నూయిచుట్టుఁ దిరుగుచు నూతి లోనికిఁ జూచుచుండుటగాంచి "బావా ! అట్లు తిరుగుచుండిన నేమి లాభము ! నిచ్చెన యేది ? త్రాళ్ళేవి ? నూతిలో దిగువారేరి?" యని ప్రశ్నించి నీకుఁబుతునిపైఁగల ప్రేమకంటె భగవంతునకు గజేంద్రునిపై బ్రేమ వేయిరెట్లధికము సుమీ యని యానాఁటికథను జ్ఞాపకముగఁజేసి పిల్లవానినిదెచ్చి చూపెనఁట.

[శ్రీ చాగంటి శేషయ్యగారి
'ఆంధ్ర కవితరంగిణి' నుంచి]



కాని మీరు వదిలించుకోవాల్సింది ఓ పటాన లొంగని, తీవ్రమైన చుండు అయితే మీకు కావాల్సిన షాంపూ, క్లినిక్‌ని మించినదై ఉండాలి మరి



కొత్తది

క్లినిక్ స్పెషల్

క్లినిక్ మీ చుండుపై పనిచేసిందని, మీకు సరిగ్గా సరిపడిందని మాకు తెలుసు. అయితే ఓ పటాన లొంగని, తీవ్రమైన చుండుగల వారున్నారన్న సంగతి మాకు తెలుసు.

అందుకే ఓ పటాన లొంగని, తీవ్రమైన చుండును తొలగించేందుకు కొత్త సూత్రీకరణను ప్రవేశపెట్టాం. క్లినిక్‌ని మించినదది...దాని పేరు క్లినిక్ స్పెషల్. ఆ! ఇప్పుడు రెండు క్లినిక్ షాంపూలు ఉన్నాయి. మామూలు చుండుకు క్లినిక్...ఓ పటాన లొంగని తీవ్రమైన చుండుకు క్లినిక్ స్పెషల్ ఇక ఈ రెండింటి కలయిక చుండు సమస్యలన్నింటికీ నివారణే మరి.

హిందుస్తాన్ లివర్ లిమిటెడ్ వారి విశిష్ట ఉత్పాదన.

HLSC-

పెళ్ళైతే చాలు



కొండముది శ్రీరామచంద్రమూర్తి

గిరిజకు పెళ్ళవుతున్నదంటే నిజానికి నేనెంతో సంతోషించాలి. కానీ నాకు సంతోషం కలగడంలేదు, దుఃఖం వస్తోంది, కోపం కలుగుతోంది. ఈ సంఘం మీద, ఆచారాల మీద, మనుష్యుల సిగ్గులేని స్వార్థం మీద అసహ్యం వేస్తోంది.

"అవతల నీ స్నేహితురాలు గౌరీపూజకు కూచోబోతోంటే, ఇంకా ఇక్కడ నువ్వు, చేతిలో పుస్తకం పట్టుకుని, తలైనా దువ్వుకోకుండా, చీర మార్చుకోకుండా, హవ్వ, చూసే వాళ్ళేమనుకుంటారూ, ఆ అమ్మాయికి పట్టిన అదృష్టానికి నువ్వేదో అసూయపడి పోతున్నావని నోళ్ళు నొక్కుకోరూ ?... పద పద. కాస్త మొహం కడుక్కుని, లక్షణంగా బొట్టు పెట్టుకుని..." మా అమ్మ నా చేతిలో పుస్తకం లాగేయబోయింది.

"ముందు నువ్వెళ్ళమ్మా, తర్వాతవస్తాన్లే, మెల్లిగా!" నేను లోపలకు వెళ్ళిపోయాను, చివాలున.

"రారా! ఆలస్యంచేయకు, బావుండదు." అమ్మ గిఫ్ట్ ప్యాకెట్టు తీసుకుని వెళ్ళిపోయింది.

గిరిజ వాళ్ళ ఇంట్లో నుంచి మంగళ వాద్యాలు వినిపిస్తున్నాయి. వాకిలి ముందు వేసిన పందిరి మీది నుంచి వస్తున్న రాత్రిగాలి పచ్చితాటాకుల వాసనను పరవశంగా మోసుకు వస్తోంది. వాళ్ళ ఇంట్లో, వాళ్ల ఇంటి ముందు జరుగుతున్నదంతా నాకు కనిపిస్తోంది, వినిపిస్తోంది. ఆడవాళ్ల పట్టుచీరల రెప రెపలు, మగవాళ్ళు పగలబడి నవ్వుకొనే హాస్యోక్తులు, రిక్షాలు గంటలు గణగణ మోగించుకుంటూ పందిరి దాకా వచ్చి అక్కడ తమ సరుకును ఖాళీచేసి వెనక్కు మళ్ళడం; ఒకటి రెండు కార్లు వచ్చి కీచు మంటూ ఆగిన తర్వాత, వాటిల్లోంచి వడ్డాణాల వాళ్ళూ, వంకీ చేతుల వాళ్ళూ, పొందూరు ఖద్దరు వాళ్ళూ, ఉంగరాల తళ్తళ చేతుల్తో, హుందాగా కిందకు దిగి అచి తూచి అడుగు వేస్తూ పెళ్ళి పందిట్లోకి నడవడం;

"అడుగో, అడుగో వరపూజకు పెళ్ళి కొడుకు వస్తున్నాడు!"

"స్నాతకం వాళ్ల వూళ్ళోనే చేసుకుని వచ్చేశారేమిటే ?"

"వాళ్ళ వూరంటావేమిటే — నువ్వెక్కడో పిచ్చిదాన్లా వున్నావే— పెళ్ళికొడుకూ వాళ్ళది మహారాణీపేట కాదూ ?"

"అట్నాగా, చెప్పావు కాదు— పెళ్ళికొడుకు ఏం చేస్తున్నాడేవిటి ?"

"కాలేజి ప్రిన్సిపాల్టమ్మా!"

ఆర్థిక స్వావలంబనకు కొత్త 20 అంశాల

ఆర్థిక కార్యక్రమం

ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడానికి జనవరిలో ప్రధానమంత్రి కొత్త 20 అంశాల కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలోని వివరాలు దిగువ ఇవ్వబడినాయి.

★ సేద్యపు నీటి సౌకర్యాలను పెంపొందించడం, మెట్ట సేద్యానికి వీలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉపకరణాలను వినియోగించడం, అభివృద్ధి పరచడం.

★ పప్పు దినుసులు, నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి ప్రత్యేకంగా కృషి చేయడం.

★ సమగ్ర గ్రామీణాభివృద్ధికి జాతీయ గ్రామీణ ఉపాధి కల్పనా కార్యక్రమాలను పటిష్టం చేయడం, విస్తృతపరచడం.

★ వ్యవసాయభూముల పరిమితులను, మిగులు భూముల పంపకాన్ని ఖచ్చితంగా అమలు జరపడం, పరిపాలనా సంబంధమైన, చట్ట సంబంధమైన అడ్డంకులను తొలగించి భూములకు సంబంధించిన రికార్డులను పూర్తి చేయడం,

★ వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలను సమీక్ష చేయడం, సమర్థవంతంగా అమలు చేయడం,

★ వెట్టిచాకిరీ నుంచి విముక్తులైనవారికి పునరావాసం కల్పించడం.

★ షెడ్యూలు కులాల, షెడ్యూలు తెగల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను త్వరత్వరగా అమలు చేయడం.

★ నీటి ఎద్దడి వున్న గ్రామాలన్నిటికి మంచినీటి సరఫరా సౌకర్యం కలిగించడం.

★ గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేని కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయింపు చేయడం, ఇళ్ళు కట్టుకునేందుకు సహాయ కార్యక్రమాన్ని విస్తృత పరచి, వారికి వర్తింపచేయడం.

★ మురికివాడల పరిసరాలను మెరుగు పరచడం, ఆర్థికంగా బలహీనవర్గాలవారికోసం ఇళ్ల నిర్మాణ కార్యక్రమాలను అమలు జరపడం, ఇళ్ల స్థలాల ధరలు విపరీతంగా పెరిగిపోకుండా చర్యలు తీసుకోవడం.

★ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి సాధ్యమైనంత ఎక్కువగా వుండేట్టు చూడ్డం, విద్యుచ్ఛక్తి సిబ్బంది పని తీరును మెరుగు పరచడం, గ్రామాలన్నిటికీ విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించడం.

★ చెట్లునాటే కార్యక్రమం, సామాజిక అటవీ కార్యక్రమాలను గట్టిగా అమలు జరిగేట్టు చూడడం, బయోగ్యాస్ ఇతర ప్రత్యామ్నాయ శక్తి జనక పద్ధతులను మెరుగు పరచడం,

★ స్వచ్ఛంద ప్రాతిపదికపై కుటుంబ నియంత్రణను ప్రజోద్యమంగా ప్రోత్సహించడం.

★ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను బాగా ఎక్కువ చేయడం, కుష్టు, క్షయ, అంధత్వాలను నిరోధించడం.

★ స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలను శీఘ్రవంతం చేయడం, గర్భిణీ స్త్రీలకు, చంటి పిల్లల తల్లులకు, చంటి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే-ముఖ్యంగా అటవీ, గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో-కార్యక్రమాలను త్వరత్వరగా అమలు చేయడం.

★ 6-14 సంవత్సరాల మధ్య వయస్కులైన పిల్లలకు-బాలికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ-ఎలిమెంటరీ విద్యను కల్పించడం వయోజన నిరక్షరాస్యతా నిర్మూలనకు విద్యార్థులను, స్వచ్ఛంద సంస్థలను వినియోగించడం.

★ మారుమూల ప్రాంతాల్లో పంచదార దుకాణాలు, పారిశ్రామిక కార్మికులు, హాస్టలు విద్యార్థులకోసం దుకాణాలతో సహా మరిన్ని చౌకధరల దుకాణాలను ఏర్పాటు చేసి పౌర సరఫరా విధానాన్ని విస్తరింపచేయడం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అధిక ప్రాధాన్యమిస్తూ లభించేట్టు చేయడం, పటిష్టమైన వినియోగదారుల రక్షణ ఉద్యమాన్ని ప్రోత్సహించడం.

★ పెట్టుబడులు పెట్టడానికి సంబంధించిన నిబంధనలను సడలించడం, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి వీలుగా పారిశ్రామిక విధానాలను ఆధునికంచేయడం, చేతి వృత్తులు చేనేత, లఘు పరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి, ఆధునిక, సాంకేతిక పద్ధతుల్ని అవలంభించడానికి సకల సౌకర్యాల్ని కల్పించడం.

★ స్మగ్లర్లు, దొంగ నిల్వదారులు, పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోవడం, గుప్త ధనాన్ని అరికట్టడం.

★ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా, పూర్తి ఉత్పత్తిస్థాయిని వినియోగించుకోవడం ద్వారా అంతర్గత వనరులను సమకూర్చుకోవడం ద్వారాగా ప్రభుత్వరంగ సంస్థల పనితీరును అభివృద్ధి పరచడం.

మొదటి 20 అంశాల కార్యక్రమాన్ని అమలు జరపడంలో అగ్రగామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్, 1982 ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీవరకు 20 అంశాల కార్యక్రమం వారోత్సవంజరపడం ద్వారా కొత్త 20 అంశాల కార్యక్రమాన్ని తీవ్రతరం అమలు జరపడం ప్రారంభించింది.

Advt No. 3.

డైరెక్టరు సమాచార, పౌర సంబంధశాఖ : హైదరాబాదు. DIPR No. 3-1/Advt I/C3 82

పెళ్ళి తేవాలు

"బావుంది, బావుంది, ఎంతొస్తుందం టావ్ జీతం ?"

"రెండువేలకు పైనే వస్తుందట! అయినా ముష్టి జీతం—అదో లెక్కా వాళ్ళకు? జగదాంబా జంక్షన్‌లో నాలుగు కొట్లున్నా యట వాళ్ళకు, ఆ నాలుగు కొట్ల మీదా మూడువేలు వస్తుందటమ్మా ఆదాయం!! విజయనగరంలో వో వీధి వీధంతా వాళ్ళదేట! అనకాపల్లిలో బంగారం పండే పొలం యాభై ఎకరాలుందట!"

"అంత వున్న వాళ్ళు ఈ అమ్మాయి నెందుకు చేసుకుంటున్నారో ?"

మా కాంపౌండుగోడ పక్కనే నిలబడి ఆ ఇద్దరు వయసు మళ్ళిన ఆడవాళ్ళూ మాట్లాడు కొంటున్నారు. ఆ ఇద్దరి గొంతులూ పెద్దవే. వాళ్ళ మాటలు నాకు స్పష్టంగానే వినిపిస్తు న్నాయి.

బొంగురు గొంతు ఆవిడ అడిగిన ప్రశ్నకు కీచుగొంతు ఆవిడ గొంతు తగ్గించి, బుగ్గలు నొక్కుకొంటూ ఏదో అన్నది. ఇంతలో మళ్ళీ మొదటి ఆవిడ గొంతు పెద్దదైంది.

"చూడు, చూడు, అటు చూడు: ఆ పెళ్ళికొడుకును చూడు, ఎంత ఇదిగా వున్నాడో !"

"అవునవును. ఎంతో ఠీవిగా వున్నాడు."

పెళ్ళికొడుకు కారులో నుంచి దిగాడు. ఎలక్ట్రిక్ లైట్లలో అతని బట్టతల మెరు స్తోంది. చెంపల మీద విస్కర్స్ నలుపూ తెలుపూ కాని రంగులో వున్నాయి. మొహం మీది ముడతల్లో నలభై ఏళ్ళు దాటిన వయసు చిక్కుపడి గిజగిజ కొట్టుకుంటోంది. పెళ్ళి కొడుకు కారుకు కొంచెం దూరంలో మరో కారు వచ్చి ఆగింది. అందులో నుంచి బిక్కు బిక్కుగా వయసు వచ్చీరాని నలుగురుపిల్లలూ, వాళ్ళ వెనగ్గా ఓ మధ్య వయసు ఆడమనిషీ, ఆమె చెయ్యి పట్టుకుని ఓ ముసలాయనా దిగారు.

"ఎంత మంచి పిల్లల్లా మీరు ? మీ నాన్న పెళ్ళి చూడ్డానికి వచ్చారా, పరదాపడి! అదిగో మీ మరో అమ్మ, ఆ మూల గదిలో వుంటుంది. వెళ్ళి చూడండి. చూపిం తర్వాత పందిట్లోకి వచ్చి వో పక్కగా కూచోండి."

ఆ పిల్లలు తలలూపి పెళ్ళికూతురు వున్న చోటుకు పరుగెత్తుకు వెళ్ళారు. పందిరంతా

రీతి

తాను కూర్చున్న కొమ్మను
నరికే కాళిదాసు
మూర్ఖుడు
మరొకడు కూర్చున్న
కొమ్మను నరికేవాడు
యోగ్యుడు.

వి.ఎస్. మునిసుందరం

పెళ్ళికొడుక్కు అడుగులకు మడుగులొత్తు తోంది. పెళ్ళి మొదలైంది.

గిరిజను గంపలో కూచోపెట్టి పెళ్ళి పీటల దగ్గరకు తీసుకువచ్చారు. గంపలో ముడుచుకుని కూచున్న గిరిజ ముద్ద మందారంలా వుంది, ముగ్ధ మనోహరంగా వుంది.

పెళ్ళి పీటలమీద రెండో పెళ్ళికి తయా రయిన నలభై ఏళ్ళు దాటిన బట్టతల పెళ్ళి కొడుకు. అతనికి ఎదురుగా బుగ్గనచుక్కతో తలలో పూలతో, నొసటన బాసికంతో, తలంబ్రాల చీర కట్టుకుని, సిగ్గు సిగ్గుగా భయం భయంగా తలవంచుకు కూచున్న పదహారేళ్ళ గిరిజ... వాళ్ళకు ఎదురుగ్గా మొదటి వరుసలో వరుసాగ్గా కూచుని ఆసక్తిగా చూస్తున్న నలుగురు పిల్లలు... నా కది పెళ్ళిమంటపంలా కనబడం లేదు. ఆ పెళ్ళిపీట వధ్యశిలలా కనిపిస్తోంది.

* * *

గిరిజ ఫస్టు ఫారంలో చేరింది, నేను టెన్త్ క్లాసులో వున్నప్పుడు. గిరిజకు చీర కట్టుకోడం నేను నేర్పాను. గిరిజ పదోతరగతి ఫస్టున ప్యాసై, "అక్కా, మా నాన్నతో నువ్వు చెప్పవూ, ఇంకా నన్ను చదివించమని!" అని అడిగినప్పుడు వాళ్ళ నాన్నతో నేను దెబ్బ లాడాను. అప్పటికి నేను యూనివర్సిటీలో యం. ఏ. లో వున్నాను.

"చదివించనమ్మా!" అన్నాడు గిరిజనాన్న నేను చెప్పిందంతా విని, నా మాటల్ని కొట్టి పారేస్తూ.

నాకు కోపం వచ్చింది. "ఎందుకని?" రెట్టించాను.

"చదువులూ, ఉద్యోగాలూ ఆడవాళ్ళ విషయంలో ఉన్నవాళ్ళ ఊసుబోకవ్యవహారాలు.

నన్ను తండ్రిగా దాన్నో ఇంటిదాన్ని చేసి అవతలకు పంపించేస్తే, ఈ జీవితానికా సార్థకత చాలు. కట్నాలా, పెద్దగా ఇచ్చుకో లేని ఎలిమెంటరీ స్కూలు బడిపంతులు గంగిరెద్దు బతుకు నాది. సంబంధాలా, వెతికే ఓపిక చచ్చిపోయింది నాలో, మొదటి ముగ్గురి కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేసేసరికి. అంచేత ఏ రెండో పెళ్ళివాడు దొరికినా, ఆ ఏడుకొండల వాడికి జోలెత్తుతాము."

ఆ ఏడుకొండలవాడు అతను కట్టబోయే జోలికి ఆశపడి, ఈ పెళ్ళికొడుకును అతనికి చూపించాడు.

"గిరిజా! నీ కిష్టమైందా ఈ సంబంధం?"

పెళ్ళి నిశ్చయం చేసుకోబోయేముందు గిరిజను వో మూలకు తీసుకువెళ్ళి రహస్యంగా అడిగాను.

"మా నాన్న కిష్టమైంది. కట్నం బాధ లేదు. ఇంకా నా ఇష్టం ఎందుకక్కా?" గిరిజ అమాయకస్వరంలో వున్న ఆ ప్రశ్నా తీవ్రత నన్ను విచలితను చేసింది. ఈ దేశంలో అమ్మాయిలకు చదువక్కరలేదు, ఉద్యోగాలక్కరలేదు, వ్యక్తిత్వం అక్కరలేదు, పెళ్ళైతే చాలు అనుకుంటున్నారు తల్లి దండ్రులు. కానీ వాళ్ళ గుండెల్లో మండుతున్న మహాగ్ని కలల్ని గురించి ఎవరు పట్టించుకుంటారూ?

గిరిజకు తాంబూలాల తతంగం ముసి ముసి నవ్వుల మధ్య ముగిసిపోయింతర్వాత, మా అమ్మ నన్ను తీవ్రంగానే మందలించింది.

పెళ్ళైతే చాలు

"ఆ పిల్ల ఇష్టపడే చేసుకుంటోందో, కష్టంగానే తాళి కట్టించుకుంటుందో, నీకెందుకే? నీ సంగతి నీకు చూసుకోడం చేత కాదు, ఇంకొకళ్ళ వ్యవహారం నీ కెందుకూ? అయినా నీకేం తెలుసు? పెళ్ళికి ముందు వింత మూతి ముడుచుకున్నా, పెళ్ళి తర్వాత కట్టుకున్నవాడి వెనుక వెనకే తిరుగుతారీ ఆడపిల్లలు! అప్పుడు వయసు భేదమూ వుండదు, తెలుపూ నలుపూ వుండదు."

మా అమ్మ అట్లా కోప్పడటానికి కారణం వేరేవుంది. ఏ సంబంధం వచ్చినా నేను కాదు పొమ్మంటున్నాను. నాకు నచ్చిన వాడు కాకపోతే, అతడు ప్రిన్స్ ఛార్లెస్ అయితే మాత్రం నాకేం? నిన్నటి వినాయక చవితికి ఇరవైనాలుగువెళ్ళి అయిదు వస్తుంది. ఆ ఏటికి ఆ ఏడు పైబడిన కొద్దీ, నేను పెళ్ళి కాకుండా కన్యగానే మిగిలిపోతానేమోనని ఆమె భయం. తగిన మగవాడు దొరక్కపోతే, కన్యగానే వుండిపోతే కొంపలు మునిగి పోతాయా అని నా భావం.

కానీ నా మానాన నన్ను స్వేచ్ఛగా ఉండ నీయడంలేదు ఈ సంఘం.

"ఏనమ్మా — మీ అమ్మాయికి పెళ్ళి చేయవూ?" అని అమ్మలక్కల పరామర్శ.

"మాకు తెలిసిన రెండోపెళ్ళి సంబంధం ఒకటి వుంది. చెప్పమంటారేమిటీ?" అని కొందరి మగవారి ప్రశ్న.

ఒకరోజు సాయంకాలం బిక్కు బిక్కుగా వచ్చింది గిరిజ నా గదిలోకి అప్పుడే శ్రీదేవి నవల కాలాతీత వ్యక్తులు చదివి అవతల పెట్టాను. గిరిజ కళ్ళలో ప్రశ్న. ఆమె పెదిమలమీద ఏదో అనాన్నతహాసం.

"ఏం గిరిజా, ఏం కావాలి?"

"అక్కా...?"

"ఏనమ్మా... చెప్పు."

"మీ కాలేజీలో లాజిక్ లెక్చరరు చచ్చి పోయిందట కదా?"

"అవునమ్మా, పాపం, కాన్సు కష్టమై వైద్య సహాయం సమయానికి అందక..."

"ఆవిడ మొగుడు డి యస్ పేట కదా?"

"అయితే...?" నా బొమలు ముడి పడ్డాయి.

గిరిజ గభాలున అన్నది—"ఆయన్ను నువ్వు చేసుకుంటావా?"

నేను ఉలిక్కిపడ్డాను. నా వీపున ఎవరో ఛెళ్ళున కొరడాతో కొట్టినట్టయింది.

"ఇంపాసిబుల్! నేనా... ఆ విడోయర్ని? ఆయనభార్యా నేనూ ఎంత క్లోజ్ ఫ్రెండ్సమో నీకు తెలీదు గిరిజా! ఆవిడ పోయి యింకా నెలైనా కాలేదు. అప్పుడే ఆయనగారికి మరో పెళ్ళాం కావల్సి వచ్చిందా? - ఏం మగజాతి ఇది!!"

నా మాటలు వెనకనుండి మా అమ్మ విన్నట్టుంది. గంభీరంగా మగవాళ్ళను సమర్థిస్తున్నట్టుగా అన్నది, "అతగాడికోసం కాదే ఈ పెళ్ళి? కన్ను తెరవని ఆ పసికందు కోసం!"

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పరిశీలనార్థం పంపే బొమ్మలు, ముఖచిత్ర రచనలు పంపేవారు కూడా వాటితోపాటు తగినన్ని తపాలా బిళ్లలు అంటించిన కవరును జతపరచకపోతే అవి త్రిప్పి పంపబడవు. -సం.



"ఆయానొకత్తెను పెట్టుకుంటే సరిపోదూ?" ఈసడింపుగా అన్నాను.

"ఎంతటి ఆయా అయినా, కట్టుకున్న పెళ్ళాంతో సాటి అవుతుందా?"

ఇప్పుడు కూడా గిరిజను తన పిల్లల్ని పెంచడం కోసమే ఆ ప్రిన్సిపాలు పెళ్ళి చేసుకున్నాడా? తన పదవిని ఎరగా జూపి, తన హోదాను ఆశపెట్టి, తన డబ్బును లంచం చేసి, తన వయసును కప్పబెట్టి, బీదరికాన్ని తన స్వార్థానికి అతను వాడుకున్నాడా? వాడుకున్నాడనే నా ఆరోపణ.

* * *

గిరిజను మూడునిద్దర్లకు అత్తవారింటికి పంపించారు. ఆ సమయంలోనే మిగిలిన ముచ్చట కూడా తీరిపోయిందన్నారు. గిరిజను అత్తవారింటికి పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పదహారు రోజుల పండుగ లోపల అయితే తిథీ వార వర్జ్యాలు చూడక్కర్లేదట!

"ఆ పిల్ల మళ్ళీ వెళ్ళిపోతుందేమో, ఒకసారి చూసి రారాదూ?" అన్నది అమ్మ. నేను చివాలున తలెత్తి ఆవేశంగా అన్నాను—"ఏం చూసి రమ్మంటావ్? తన కూతురు వయసున్న చిన్నదానితో ఆ రెండో పెళ్ళి మగడు ఎట్లా సంసారాడుతున్నాడో ఏమని అడిగి రమ్మంటావ్?"

"పోవే నీ మాటల కేంటి? పుట్టింట్లో వున్నప్పుడు గిరిజ పట్టుచీర మొహం చూసి ఎరుగునా? ఇప్పుడు చూడు, ఎన్ని పట్టు చీరలో!! ఒంటినిండా నగలు, వేళకు సుష్టుగా

పెళ్ళైతే చాలు

భోజనం, అమ్మా అమ్మా అంటూ కొంగు పట్టుకు తిరిగే నలుగురు పిల్లలు, వీధిలో కారు, గుమ్మం దగ్గర నౌకరు, ఇంతకన్నా ఏం కావాలే ఆడపిల్లకు?"

"ఒకసారి చూసొస్తే పోతుంది కదా! ఈ భారతం వినక్కర్లేదు" అనుకుని గిరిజవాళ్ళ గుమ్మంలోకి వెళాను.

ఈ అయిదురోజుల అత్తవారింటి సంసారానికే గిరిజ మొహం వాడిపోయింది. ఒంటికి పట్టుచీర వుంది. మెడలో నగలున్నాయి. కాళ్ళకు మెట్టెలున్నాయి! పమిట చాటున నల్లపూసల్తో మంగళసూత్రాలు ధగధగలాడుతున్నాయి.

"ఏవిటే గిరిజా ఏవిటి విశేషాలు?" నవ్వుతూ పలకరించాను.

"లోపలకు రా అక్కయ్యా!" నన్ను చూడగానే ఆమె మొహంలోకి కళ వచ్చింది.

కాఫీ తాగుతూ ఇద్దరం ఏవో పిచ్చాపాటీ మాటాడుకున్నాం.

ఆ తర్వాత అసలు విషయం బయట పడింది.

"అట్లా అన్నాడా?" అన్నాను నేను దిగ్భ్రమలో.

సమాధానం చెప్పలేక మౌనంగా, దిగులుగా తలాడించింది.

ఏవో నాలుగు వూరడింపు మాటలు చెప్పి బయట పడ్డానే కాని మౌనంలోంచి గిరిజ అడుగుతున్న ఆ ప్రశ్న నన్ను జలదరింపు చేస్తూనే వుంది.

గిరిజ మొగుడు మొదటిభార్య వున్నప్పుడే, నలుగురు పిల్లల తండ్రయిన తర్వాత, ఇహ తనకు సంతానం చాలనుకుని ఆపరేషన్ చేయించేసుకున్నాట్ట. ఇప్పుడు గిరిజను పెళ్ళి చేసుకున్న తర్వాత మొదటి రాత్రి నాడు ఆ అమ్మాయితో అన్నాట్ట "ఇదీ సంగతి. నీకు హాఫ్ బెండ్‌వే! కానీ నిన్ను తల్లిని మాత్రం చెయ లేను. ఐయామ్ సారీ! నా పిల్లకు తల్లిగా వుండు, నీకు ఏం కావాల్సినా అనుభవించు. బట్ డోన్ట్ వాంట్ టు బీయే మదర్!"

"నేనిహ జన్మలో తల్లిని కాను. ఇంకా ఎందుకూ నా ఆడజన్మ?" అని గిరిజ అడుగుతున్నట్లే—

"ఆడజన్మే మధురం!" అని పాడుతున్న రేడియో గొంతు నొక్కేశాను ఆ కోశంతో.


"చూశావా అమ్మా - గిరిజకు జరిగిన అన్యాయం?" అమ్మతో అన్నాను.

"అన్యాయం లేదూ, గాడిదగుడ్డూ లేదు. పెళ్ళైంది చాలు, అందుకు సంతోషించమను. మహారాజా లాంటి భర్త...కనకుండానే నలుగురు పిల్లలు...ఆ అదృష్టం నీకు పట్టి వుంటే నేనెంత సంతోషించి వుండేదాన్నో!!" కళ్ళు తుడుచుకుంటూ అవతలికి వెళ్ళిపోయింది అమ్మ.

'తన కూతురు తల్లి కాలేదు' అన్న సంగతిని విన్న గిరిజ వాళ్ళ నాన్న కూడా పెద్దగా బాధపడినట్లు లేదు. ఈ పెళ్ళి మూలంగా ఆయన స్టేటస్ పెరిగింది, అది చాలు ఆయనకు. ఈ మధ్య గిరిజ అంతగా నాకు కనబడడంలేదు. 'ఏమైంది?' అని అమ్మనే అడిగాను.

"వ్రతాలూ, చన్నీళ్ళ స్నానాలూ, పూజలూ, పురస్కారాలూ, ఇప్పుడు దేవత లాగా ఎంత శుద్ధిగా కనిపిస్తోందో!" అన్నది ఆరాధనా భావంతో.

అట్లాకాక మరెట్లా చేస్తుంది పిచ్చి గిరిజ! ఆమె నిస్సహాయత ఆమెను ఆ మార్గం వేపుకు బలవంతంగా నెడుతోందని గిరిజకూ తెలీదు, మా అమ్మలాంటి వాళ్ళకూ తెలీదు!! నాకు తెలిసీ ప్రయోజనం లేదు. ఇట్లాగో అట్లా నాకూ పెళ్ళైతే చాలునని ఆరాటపడిపోతున్న ఈసమాజంలో ఎంతకాలం ఇట్లా స్వతంత్రంగా ఉండగలనో నాకూ తెలీదు.



ఆంధ్రపత్రిక

శ్రీ దుందుభి నామ సంవత్సర పూర్ణ శాస్త్రీయ పంచాంగమ్

శ్రీ కాంచీ కామకోటి పీఠ సంస్థానాస్థాన సిద్ధాన్తులగు

దైవజ్ఞ చిన్తామణి శ్రీ పిడపర్తి చిన కృష్ణమూర్తి శాస్త్రి, భాషా ప్రవీణ

శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి సిద్ధాన్తి సోదరులచే గుణింపబడినది.

ఇందు తిథి నక్షత్రములు ఘటికలతోను గంటలలోను కూడా చూపబడినవి. శుభముహూర్తములు, దుర్ముహూర్తములు వర్జ్యములు రాహుకాలము గంటలలోను కూడా చూపబడినవి. యోగములు, అమృత, గ్రహ ప్రవేశములు ఘటికలలో చూపబడినవి. భారత ప్రభుత్వము నియమించిన కాలెండరు రిఫారమ్సు కమిటీవారి నిర్ణయమును అనుసరించి ప్రకటింపబడిన ఇండియన్ ఎఫిమెరిస్ అండ్ నాటికల్ ఆల్మనాకు సరిపడునట్లు చూపబడినవి. ఆకాశ వేధశాలలో యుండు కనుగొనబడిన గ్రహ చంద్రములకు సరిపడు స్పష్ట రవిచంద్రులచే సాధింపబడిన తిథ్యాధికము, గ్రహ సంచారము చూపబడినవి. ఈ తిథ్యాది, గ్రహ సంచారములే పంచాంగములు వ్రాసినట్లు ఆకాశమున సరిపడుచున్నవి.

వివాహములకు ముహూర్తములు ఇండియన్ స్టాండర్డు టయిము ననుసరించి గం. 5—29 ని.లకు చూపబడినవి. కొన్ని పట్టణములు ఉత్తర 10 అక్షాంశ నుండి 30 అక్షాంశవరకు లగ్న ప్రమాణములు ఇవ్వబడినవి.

వర్ష యోగములు, గ్రహ ఫలములు, ఆనందాది యోగములు, వాస్తు ప్రకరణము, ఆంధ్రప్రదేశ్ భారతదేశముల భాగ్యములు, [illegible] విషయములు ఇవ్వబడినవి.

త్వరలో వెలువడనున్న ఆంధ్రపత్రిక పంచాంగము

ప్రతి యింట తప్పక వుండదగినది.

ముందుగా మీ కాపీకై మా ఏజంటుకు చెప్పియుంచండి

లేదా మా కార్యాలయమునకు వ్రాయుండి.

విడిప్రతి వెల రు. 3-00

రిజిష్టర్డు బుక్ పోస్టులో రు.

ఆంధ్రపత్రిక

గాంధీనగరం, విజయవాడ—3

బషీర్‌బాగ్, హైదరాబాద్—29.

అవీ... ఇవీ... అన్నీ...

పోతనకు సాహితీ సుధ నృత్యాంజలి

పోతన పంచ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప.గో.జిల్లా పెదపాడులోని సాహితీ సుధవారు ఫిబ్రవరి 21న కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, శ్రీ చెరుకూరి కిషోర్ రామమోహనరావు అధ్యక్షత వహించారు. శ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శాస్త్రి, కవిశిరోమణి ఉండ్రమూడి సత్యనారాయణ, డా.జి.వి. పూర్ణచంద్, శ్రీ ఎల్. వి. ఎస్. ఎస్. మూర్తి, అక్కినేని సంజీవరావు, శ్రీ కిలపర్తి వెంకటేశ్వర రావు వేదిక నలంకరించారు. శ్రీ గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు సంస్కృతంలో ఆశీస్సులు పలుకగా, బమ్మెర పోతనవ్య క్తిత్వంపై కవి శ్రీ ఐద్యాల్ల చదివారు.

శ్రీ చిర్రావూరి శివరామకృష్ణశాస్త్రి పోతన వ్యక్తిత్వాన్ని గురించి, వివరణాత్మకంగా మహాభాగవత గ్రంథ విశిష్టతని తెలిపారు.

చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ ప్రాచ్య కళాశాల విద్యార్థినులు నేత్ర, జావ్యా, అంగుష్ట పుష్ప ఘంటావధానములని ప్రదర్శించారు. కవి పండితులని గౌరవాధ్యక్షులు శ్రీ అక్కినేని సంజీవరావు సత్కరించారు.

కవి శేఖర ఉపాధ్యాయుల రామారావు వందన సమర్పణ చేశారు. (ఓ. వి.)

పాలవల్లి

అమలాపురం సాంస్కృతి సంస్థ వారు వెలువరించిన మినీకవితా సంకలనం, సంకలన కర్తలు శ్రీ ద్వా. నా. శాస్త్రి, శ్రీ కొల్హార్. 24 పేజీలు గల ఈ పుస్తకం వెల రెండు రూపాయలు. ప్రతులకు: ఎక్సరే పబ్లిషర్స్, కొల్హారి హౌస్, అమలాపురం—533202.

శాకాహారంపై వెలుగు వెల్లువలు

రచన : శ్రీ వి. విశాకాంతరావు. 40 పేజీలు గల ఈ పుస్తకంలో శాకాహార ప్రాశస్త్యాన్ని, విలువలని గూర్చి వివరంగా విశదీకరించారు. వెల రెండు రూపాయలు. ప్రతులకు : గౌరవ కార్యదర్శి, ఇండియన్ వెజిటేరియన్ కాంగ్రెస్, 27—4—30, మెయిన్ రోడ్డు, విశాఖపట్నం— 2

ఇకనైనా మారండి

శ్రీ మాత్రతేని సందేశాత్మక నాటిక. శ్రీ మల్లిబాబు రాసిన బక్కని యువిష్పత్తం గల ఈ నాటికని సాగర్ పబ్లికేషన్స్ వారు తమ తొలి కానుకగా వెలువరించారు. 34 పేజీలు గల ఈ పుస్తకం వెల రు. 2.50 పైసలు. ప్రతులకు సాగర్ పబ్లికేషన్స్, 4, బృందావన స్ట్రీట్, వెస్టు మాంబళం — మద్రాసు — 600033.

భావి పౌరులారా బాలలార

పిల్లల శతక కావ్యము. రచన: శ్రీ రసిక్ గిరు మల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో ప్రచురింపబడిన ఈ 34 పేజీల పుస్తకం వెల 3 రూపాయలు. ప్రతులకు : శ్రీ గుర్రం భాను మూర్తి, ఎస్.వి. యు. ఇంజనీరింగ్ కాలేజీ, తిరుపతి.



ఇటీవల మదరాసులోని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారు నిర్వహించిన కార్యక్రమాల్లో బొమ్మ చేత మాట్లాడించిన (వెంట్రిలాక్విజం) శ్రీ ప్రసాద్‌కి సినీ దర్శకుడు శ్రీ పి. పుల్లయ్య బహుమతి అందజేస్తున్న దృశ్యం.

ప్రశ్నావళి

కె. రమాలక్ష్మి

టి. వి. జి. — పింగోడం

ఇటీవలి కార్పొరేషన్ ఎన్నికలల్లో విజయవాడ, విశాఖలలో కాంగ్రెస్సు పరాజయానికి కారణం ఏమిటి ?

అధిక ప్రసంగం !

ఆనంద్ — విశాఖ

హింసించి చూపితే అది హత్య. మానసికంగా హింసించితే ?

మానసిక హత్య [అంటే శరీరం బ్రతికే వుంటుంది. లోపల జీవం చచ్చి వుంటుంది. బ్రతకాలి కనుక ?]

వి. వి. ఆర్. — మద్రాసు

చదివిన చదువులు మరిచిపోతాం. కాని రెండున్నర గంటలు చూసిన సినిమా ఎందుకు మరువం?

అదే విజువల్ మీడియం గొప్పతనం. కళ్లనుకట్టే విషయం మరిచి పోడానికి వ్యవధి కావాలి [ఇందువల్లే సినిమాలు ఒళ్లు దగ్గర పెట్టుకు తీయండోయ్ అని వాపోతూ వుంటారు].

శేఖర్ — చేబ్రోలు

విజయవాడ స్త్రీల కార్యక్రమం (ఆకాశవాణిలో) మీ ఇంటర్వ్యూ ఇప్పటిదాకా రాలేదు. వినే అవకాశం కల్గుతుందా ?

నేను అంత గొప్పదాన్నా ? ఇంటర్వ్యూ చేయడానికి ! అసలు అదంటే నాకే భయం. ఏం సినిమాలు ఇష్టం ? ఏ రచయిత్రి ఇష్టం ? ఏ రంగు ? ఏ కూర ? అడుగుతారేమోనని. స్త్రీల కార్యక్రమాలు ముగ్గులూ, సుంతానిండుపులూ పిండి వంటలూ, పిల్లల పెంపకం దాటి సీరియస్ నవలా ప్రసంగ విషయాలు దాటి— ఎదిగినప్పుడు చూద్దాం.

మధు — కొటాల

అహంకారాన్ని ఆభరణంగా వుంచుకున్న అమ్మాయి గుణవంతురాలవుతుందా ?

ఎందుకు కాదు ! ఆత్మాభిమానాన్ని మీ లాంటి వాళ్ళొకప్పుడు అహంకారంగా అంచనా వేస్తారు.

పి. ఆర్. ఆర్. — మహబూబాబాదు

కులమతాలుండకూడదని నిరూపించిన సప్తపది ప్రేక్షకుల ప్రశంసల నందుకుంది. అదే నిరూపించిన సీతాకోకచిలుక అంతగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ఎందుకంటారు ?

తరాల మధ్య ఐక్యత లోపించడంవల్ల. చిన్నవాళ్ల ప్రేమకు పెద్దవాళ్ల దన్ను వుంటేగాని విజయం పూర్తిగా సాధ్యంకాదు.

శ్రీనివాస్ — భువనేశ్వర్

జీవితంలో మనిషి తెలుసుకోవలసిన విషయాలున్నా అనవసరమైన వాటిపై ఎక్కువ శ్రద్ధ చూపుతాడు. ఎందుకో ?

ఏముందీ— తెలుసుకోవలసినది ఎలాగా తెలుసుకోక తప్పదు, కాస్త తెలుసుకోకూడనివేవో ముందు తెలుసుకుందామన్న చపలత్వం.

టి. ఆర్. బి. — నెల్లూరు

నేను, ఆ అమ్మాయి ఎంతో ప్రేమించుకున్నాం. ఆరేళ్ల పరిచయం మాది. నన్ను పుట్టినరోజుకు రమ్మని రాసింది. నేను వెళ్లలేక పోయాను. నేను రాలేదన్న బాధతో ...

చాలు. చాలు. ఈమధ్య సినిమా సీక్వెన్సుల్లా సినిమా అనుమానాలా బోరు కొడుతున్నాయి. తుమ్మితే వూడిపడే ముక్కుల్లాంటి ఏ స్నేహాలకీ, ప్రేమలకీ అర్థంలేదు.

మా వూర్లో చిలుకుంది నన్ను చూసినప్పుడల్లా చిలిపిగా నవ్విస్తోంది.

మీరు ఎక్కడైనా చిన్న ప్రమాదం పారేసుకున్నారేమో వెతుక్కోండి. మెదడులో ఏదైనా సీల పడిపోతేనే యిలాంటి పిచ్చి పిచ్చి వూహలు చెలరేగుతాయంటారు !

వి. ఎస్. ఆర్. — విజయవాడ

నేను ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆమె నన్ను ప్రేమించిందని మధ్యవర్తి ద్వారా తెలుసుకొన్నాను . . .

ఎందుకేనా మంచిది, మధ్యవర్తి మీద వో కన్ను వేసి ఉంచండి. మీ పిచ్చిగాని ప్రేమ మధ్యవర్తి తెలిపితే తెలుసుకొనేదికాదు. అది మనసులు మాట్లాడుకునే భాష. దానికెవరూ అర్థం చెప్పక్కరలేదు.

జె. జె. — బళ్ళారి

నా జీవితంలో మంచి మనసు, విశాల హృదయం [ప్లెయిన్ హార్ట్] . . . కలమనుషులంటే నాకు యిష్టం. అలాంటి వ్యక్తిని ఆదరించాను. కాని...

చూడు బ్రదర్ —మంచి మనసు — విశాల హృదయం —నీ భాషలో ప్లెయిన్ హార్ట్ (అంటే ఎడారిలాంటి హృదయమా?) ఇష్టం కావచ్చు కాని ఎదుటివారిని నీ ఆదర్శాలతో, ఆవేశాలతో, ఆశలతో ఉక్కిరిబిక్కిరి చేసేస్తే నిన్ను తప్పించుకు పారిపోవడానికే చూస్తారు. ఎదుటి మనసెరిగి ప్రవర్తించడం ఇంగితం. అది నేర్చుకోవాలి ముందు.

కె. వి. ఆర్. — సికింద్రాబాదు

కొత్త రోత.. కామెంట్ ?

పొరపాటు. కొత్తనీ పాతనీ — కాలంతో కొలవకూడదు. ఆధునికతని అసహ్యం లేకుండను, ప్రాచీనతని ఆరాధన లేకుండాను చూడగల్గాలి. వాటి వాటి సుగుణాలు ముఖ్యంగాని వయస్సుకాదు కదా?

జి. వి. ఆర్. — కర్నూలు


నాకొక స్నేహితుడున్నాడు. నా మాటి మాటికి కొట్లోతాకట్టు పెట్టాడు. రెండేళ్లయింది...

మీ సుదీర్ఘమైన ఉత్తరం చదివాను. ఒకరిపై ఒకరికి గౌరవం వున్న చోటనే స్నేహం రాణిస్తుంది. లేకపోతే ఇదిగో ఇలానే ఉంటుంది. వ్యక్తిగత అవసరాలకి స్నేహం చేస్తే దాన్ని స్నేహం అనకూడదు, కాకా పట్టడం అనాలి.

జి. వి. ఎస్. — హైదరాబాదు

ఆడపిల్లల జీవితానికి అద్దం పట్టిందా మధుర స్వప్నం ?

తెలియదు కాని — అది — తేరే మేరే స్వప్నే కదా ? అంచేత అవుననుకోవాలి.



వంటలు



స్వీట్ రైస్

కావలసిన వస్తువులు : బియ్యం — ఒక కప్పు, నెయ్యి — ఒక టేబుల్ స్పూను, చక్కెర — ఒక కప్పు, జీడిపప్పు — అరకప్పు, ఎండుద్రాక్ష — అరకప్పు, ఏలకుల పొడి, కుంకుమ పువ్వు, కొద్దిగా.

తయారుచేయు విధము : ముందుగా కుంకుమ పువ్వును కొద్ది పాలలో నానబెట్టాలి.

బియ్యమును రెండు కప్పుల నీటిలో పోసి పొయ్యిపై పెట్టి ఉడికించాలి. బియ్యం ఉడికి, నీరు ఇగిరిపోయి, పొడిగా వున్నప్పుడు చక్కెర, కుంకుమ పువ్వు వేసిన పాలు పోసి కలపాలి. తర్వాత జీడిపప్పు, ఎండు ద్రాక్ష, ఏలకుల పొడి, నెయ్యి వేసి మళ్ళీ బాగా కలియపెట్టాలి. చక్కెర పాకం బాగా కలిసి, అన్నం బాగా పొడిపొడిగా అయ్యేదాకా పొయ్యిపై సన్నని మంటపై పెట్టి దింపేయాలి. దించాక మూతపెట్టి పదిహేను నిమిషాల తర్వాత వేడిమీద తింటే చాలా రుచిగా వుంటుంది.


— గార్ల సరస్వతి

'స్టూ'

కావలసిన వస్తువులు : బంగాళ దుంపలు — పావుకిలో, కొబ్బరికాయ—1, ఉల్లిపాయలు —5, పచ్చిమిరపకాయలు—7, అల్లంముక్క—చిన్నది, పసుపు—అరచెంచా, శనగపప్పు — [పచ్చిది] -1 చెంచా, మినప్పప్పు—2 చెంచాలు, ఆవాలు—3 చెంచాలు, ఉప్పు, నూనె — తగినంత.

తయారు చేయు విధానం : బంగాళా దుంపలు ఉడకబెట్టి, పొట్టుతీసి, గరిటతో మెత్తగా కలియబెట్టాలి. కొబ్బరికాయ తురిమి వేడినీళ్ళల్లో వేసి, గుడ్డతో వడకట్టి, కొబ్బరి పాలు తయారు చేసుకోవాలి. ఉల్లిపాయలు పొట్టుతీసి, ముక్కలు తరుగుకోవాలి. ఒక గిన్నెలో నూనె మరగనిచ్చి, శనగపప్పు, మినప్పప్పు, ఆవాలు వేసి, కమ్మని వాసన రానిచ్చి, బంగాళా దుంపలు, కొబ్బరిపాలు, ఉప్పు, పసుపు వేయాలి. కూర కాస్త దగ్గర పడనిచ్చి ఒక స్టీలు గిన్నెలోనికి తీసుకోవాలి. ఈ కూర చపాతీలోనికి చాలా బాగుంటుంది.

— పి. సుగుణ



గోడలమీద వ్రాతలు :

విధి వ్రాత అనడానికి ఆంగ్లంలో హ్యాండ్ రైటింగ్ ఆన్ ది వాల్ — కాని, జంట నగరాలలో గోడల మీద కనిపించే వ్రాతలు విధి వ్రాతలు కావు. వీధి వ్రాతలు. తెలుగుజాతి జీవితమంతా శిథిలం చేసే అనడానికి తార్కాణం కావాలా ఈ వీధి వ్రాతలు. అబ్బ! తలచుకొంటేనే గుండె జలదరిస్తుంది, ఆంధ్ర తెలంగాణా విద్వేషోద్యమంనాటి గోడమీది వ్రాతలను. ముఖ్యమంత్రులు వారి అనూహ్య సెక్స్ కృత్యాలైన సతీమణుల పుట్టుపూర్వోత్తరాలూ గోడలకెక్కి తెలుగు జాతి పట్ల ఇతరులకు జుగుప్స కలిగించాయి. పూర్వం స్వాతంత్ర్యోద్యమ సమయంలో నెల్లూరులో సుగృహీత నామధేయుడు శివరామయ్య ఉండేవారు. తిప్పరాజువారి సత్రం గోడలపై ఆనాటి ప్రపంచ వార్తలు వ్రాసి జనానికి ప్రబోధం చేసేవారు. అవి బాగానే ఉండేవి. కాని రాను రాను జనం తమకు ఏం కష్టం వచ్చినా సరాసరి గోడలను అశ్లీల సాహిత్యంతో ఖరాబు చేయటం మితిమీరిపోయింది. హైదరాబాదులో లేడీ హైదరీ క్లబ్ గోడలు, పాత ఎం.ఎల్.ఏ. క్వార్టర్సు గోడలు రోజూ చూస్తున్న విధాన సభ సభ్యులకు ఆ వ్రాతలు ఎలాంటివో అనుభవమే. కనుకనే ఫిబ్రవరి 11వ తేదీన విధాన పరిషత్తులో శ్రీమతి సంయుక్తా బుల్లెయ్య మున్నగువారు వ్రాతలను గురించి ప్రశ్నించడం ఎంతో సమంజసంగా ఉంది. వారి ప్రశ్నలకు హోం శాఖా మంత్రి శ్రీ పి. జనార్దనరావు ఈ అసభ్యమైనటువంటి వ్రాతలు వ్రాసేవారిని కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం త్వరలో చట్టాన్ని చేస్తుందని సమాధానం చెప్పారు. చట్టం మాత్రం ప్రయోజనం లేదు. వ్రాతలు వ్రాసేవారిలో మార్పు రావాలి. ఇప్పుడు ఎన్ని చట్టాలు లేవు? చట్టాల శాతంలోనే నేరాలూ ఎక్కువవుతున్నాయి గదా! చట్టం ఉండడం వేరు. అమలు వేరు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే గాని ప్రభుత్వం చర్య తీసుకోదు. ఎవరి ఫిర్యాదూ ప్రమేయమూ లేకుండా ఇలాంటి నేరాలపై ప్రభుత్వమే చొరవ తీసుకొనేటట్లు ఉండాలి. అప్పటికి కొంత సత్ఫలితం ఉంటుందేమో!

ఇరానీ విద్యార్థుల ఘర్షణ :

ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు ఇతర విదేశీయులు భారతదేశానికి వ్యాపారరీత్యా వచ్చి వలస రాజ్యాలు ఏర్పాటు చేసుకొన్నారు. గడచిన శతాబ్దంలో తమ దేశంలో తగాదాలు వస్తే భారత దేశంలో కొట్లాడుకొని చచ్చేవారు. రామేశ్వరానికి పోయినా శనేశ్వరం విడవలేదన్నట్టుగా వారి స్వదేశ ద్వేషాలు వలసలలోను ప్రజ్వలించేవి. అలాగే నేడు మన దేశానికి చదువు కోసం వచ్చిన ఇరాన్ విద్యార్థులు, తమ దేశంలోని రాజకీయ కక్షలతో మన రాజధానిలో కొట్లాడుకుంటూ లేనిపోని సమస్యలు సృష్టిస్తున్నారు. తాము చదువు కోసం వచ్చారు గదా! చదువు పరమధ్యేయంగా పెట్టుకొని యోగ్యత సంపాదించుకొని తమ దేశానికి తిరిగి వెళ్ళి రాజకీయాలలో సతమతం కావచ్చు గదా.

హైదరాబాదు నోట్‌బుక్

కాని అలా ఉండలేక పోయారు. ఫిబ్రవరి 11న ఇరాన్‌లో ఆయతుల్లా ఖొమేనీ పాలన తృతీయ వార్షికోత్సవం జరుపుకొన్న ఇరానీ విద్యార్థులు–బషీర్‌బాగ్ ప్రాంతంలో ఈ ఘర్షణ జరిగింది. ఖొమేనీ అభిమానులు, ఇరానీ వామపక్ష అభిమానులపై దాడి చేశారు. ఈ సంఘర్షణలో ఒక పసివానికి కత్తిపోట్లు తగిలాయి. ఒక అమ్మాయికి కంట్లో కారప్పొడి చల్లారు. ఇరాన్‌లో రాజకీయ బందీలపై జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ కరపత్రాలు పంచిపెడుతున్న నలుగురిపై ఖొమేనీ అభిమానులు మోటార్ సైకిళ్లపై వచ్చి దాడిచేశారు. పోలీసులు ఆరుగురిని ఖొమేనీ అనుయాయులను అరెస్టు చేశారు.

ఉపాధ్యాయుల అరెస్టు :

పోర్టుఫోలియోల మార్పువల్ల విద్యాశాఖ, రెవెన్యూ శాఖ మంత్రులు సమ్మెను, ధర్నాను ఎదుర్కోవలసి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు మేరకు ఫిబ్రవరి 8న పలువురు ఉపాధ్యాయులు, ఐదుగురు విధాన పరిషత్తు ఉపాధ్యాయ ప్రతినిధులు శ్రీయుతులు మార్పు బాలకృష్ణమ్మ, ఎం. జె. మాణిక్ రావు, పి. బుజంగి రావు, కె. కోటేశ్వరరావు, ఎ. శ్యామసుందరరావు సచివాలయం ముందు పికెటింగ్, ధర్నా చేశారు. దీనివల్ల విధాన పరిషత్తు సభ్యులు ఐదుగురు, 50 మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సమాఖ్య నాయకులు శ్రీయుతులు పి. శ్రీరామమూర్తి, సింగరాజు రామకృష్ణయ్య, డి. సత్యనారాయణరావు, నరేంద్రరెడ్డి మున్నగువారితో సహా 175 మంది అరెస్టు అయ్యారు. చిరకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కావాలని వారు కోరారు.

గ్రామాలకు చౌకగా ఆహార ధాన్యాలు :

ఆంధ్రప్రదేశ్‌కు రిజర్వు బ్యాంక్ తక్కువ వడ్డీకి తొమ్మిదికోట్ల రూపాయలు అప్పిస్తుంది. ఈ మొత్తంతో గ్రామాలలో గోధుమ, గోధుమ వస్తువులు, బియ్యం చవకగా సరఫరా చేయడానికి పథకం ఏర్పాటవుతుంది. ఈ సరఫరాకు ప్రారంభంలో జిల్లాకొక తాలూకాను ఎంపిక చేసుకొని, ప్రయోగాత్మకంగా అమలు పరుస్తారు. ఇది విజయవంతమయితే, పిదప అన్ని గ్రామాలకూ వర్తింపచేస్తారు. దీనికి 18 కోట్ల రూపాయలు అవసరమవుతుంది. ఈ విషయాన్ని పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ జి. వెంకటస్వామి ఫిబ్రవరి 6న తెలియజేశారు. ఈ సరఫరా రాష్ట్ర అత్యవసర వస్తువుల సరఫరా కార్పొరేషన్ ద్వారా జరుగుతుంది. తొలి ప్రయోగంగా ఫిబ్రవరి 10 నుంచి నిజామాబాద్ జిల్లా ఆర్మూరు, కామారెడ్డి తాలూకాలలో ప్రారంభమయింది.

ఉపశ్రుతి :

"అబ్బాయిలూ, ఇదిగో అప్పచ్చులు. అల్లరి లేకుండా పంచుకోండి" అన్నది తల్లి పిల్లలతో


'వద్దమ్మా, నీవే ఇవ్వవే. వాడు నాకు ఇవ్వడు.

"చూడమ్మా! అన్నీ వాడే తినేస్తానంటున్నాడు.'

"నాకొక్కటీ దక్కనివ్వలేదు"—

'ఛీ! వెధవల్లారా! ఇచ్చింది సరిగ్గా పంచుకోడం తెలియదు. మీకెవ్వరికీ ఇవ్వను. పక్కింటి అబ్బాయికిస్తాను. ఇలా ఇవ్వండి అప్పచ్చులు అని లాక్కుంది తల్లి.

— తిరుమల రామచంద్ర



ఆంధ్రప్రదేశ్ డైరీ కల్చరల్ అసోసియేషన్ వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రదర్శించిన 'రాయబారం' నాటకంలో ఒక దృశ్యం. ...లు శ్రీ సి. హెచ్. హనుమంతరావు, శ్రీ ఎం. వెంకటేశ్వరరావు, శ్రీ నరసింహారావులని చిత్రంలో చూడవచ్చు.

ఉత్తరాలు

ముఖచిత్రం

మన్మథ పతి రతిని — మరచిన మగజాతి
అంగిలోని సొగసు — అట్టబొమ్మ
తెలతెల్లనినటి — నేటి 'రతీదేవి'
జాడ — నీర్లగానరే? — ఆడజాతి

డాక్టరు వమ్మిట శ్రీనివాసరావు (విశాఖపట్నం)

* * *

తేది 26-2-82 ఆంధ్ర సచిత్రవారపత్రిక ముఖచిత్రం నటి రతీదేవి ఎంతో ఆకర్షణీయముగా ఉన్నది.

వి. జ్యోతి (నారాయణవరము)

కథలు

19.2.82 నటి గీత ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది. "శవం" కథ చాల బాగుంది. జీవన వట్టకానికటు కథ ముగింపు బాగుంది.

డి. శ్రీనివాసభాస్కరరావు (అనంతపూర్)

* * *

19.2.82 నాటి పత్రిక "గీత" ముఖచిత్రంతో ఎంతో ముచ్చటగా ఉంది. కథలలో "నావేనికి మూడోవైపు" చాలా బాగున్నది.

గోపరాజు లక్ష్మప్ప (కదిరి)

* * *

19.2.82వ తేది సంచిక చాల ఆకర్షణీయంగా ఉంది. కథలలో 'శవం' 'రంగుటద్దాలు' బాగున్నాయి. 'నావేనికి మూడో వైపు' కథ చదువుతుంటే ఎంతో బాధనిపించింది. రచయిత చాలా బాగారాశారు.

ఎన్. మనోహర్‌రాంలోక్ (నిజామాబాద్)

* * *

ఈ వారం 19.2.82 ప్రచురణమైన 'నావేనికి మూడోవైపు' చాలా బాగుంది. చాలా చిన్న కథలయినా అనంతమైన నీతి ఉన్నది.

శ్రీమతి నిమ్మ (చిత్తూరు)

* * *

ఈ వారం 19.2,82 ఆంధ్రపత్రిక చిరునవ్వులు చిందించే నటి గీత ముఖచిత్రంతో మమ్మెంతగానో ఆకర్షించింది.

'నావేనికి మూడోవైపు' కథ ఆణిముత్యంలావుంది. "జీవన వట్టకానికటు''' పెద్దకథ మేమూహించని విధంగా ఎంతో బాగా ముగిసింది.

జి. శివశంకరరావు (గొల్లప్రోలు)

'గీత' ముఖచిత్రం బావుంది. కథలో "నావేనికి మూడోవైపు' చాలా బావుంది.

విజేంద్రనాద్‌ప్రసాద్ (ఆదోని)

* * *

19.2.82 నాటి ఆంధ్రసచిత్ర వారపత్రికలో 'నావేనికి మూడోవైపు' 'మానవత్వపు మజిలీలో ఒకరాత్రి' కథలు చాల బాగున్నాయి.

బీర వెంకట్రావు, సత్యవతి (కొవ్వూరు)

సీరియల్స్

జీవితవనంలో కొత్తగాలి చాలా ఇంటరెస్టుగా నడచినది. ఆఖరుకు కిరన్, సంధ్య కలుసుకోవడము చాలా బాగున్నది. వెరైటీ నవల అందించిన వ్రాసిన కుందుర్తి ఇందిరాదేవిగారికి అభినందనలు.

బి. కరుణమ్మ (గుంతకల్లు)

* * *

19.2.82 నాటి ఆంధ్ర సచిత్ర వారపత్రిక ముఖచిత్రం గెటప్ సౌందర్య భరితంగా ఉంది. సీరియల్సు అత్యంత ఉత్సుకతతో పాటకుల్ని ఉర్రూతలూగింప చేస్తున్నాయి. తార సీరియల్ రసమయమయిన మలుపులతో ఊహకు అందని రీతిన ఆసక్తిగా ముమ్ముందుకు నడుస్తోంది.

వై. హేమసుందరరావు, హేమబిందు, ప్రియ (డోర్నకల్)

* * *

జీవితవనంలో కొత్తగాలి సీరియల్ ముగింపు చాలా బాగుంది. మాకు ఎంతో నచ్చింది ఆ సీరియల్. తార సీరియల్ కూడ ఇంట్రస్టుగా ఉం[illegible]

కె. దుర్గాలక్ష్మి కుమారి పద్మజ (గుడివా[illegible]

* * *

కుందుర్తి ఇందిరాదేవి
కలం నుండి స్రవించి
సీరియల్‌గా వెలువడిన
జీవితవనంలో కొత్తగాలి
పాటకమనో వాకిళ్లలో
పరిమళాలు వెదజల్లింది
'సంధ్య' హృదయంలో కిరణోదయం
'కిరణో'దయంలో పులకించిన సంధ్య
అనురాగం పెంచుకున్న జీవితాలు !
అనుభూతులు పంచుకున్న పావురాలు !

పి. కామేశ్వరరావు (కాశీబుగ్గ)

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.